www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 18-5-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 32 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పంచమి ఉ.5.58 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.6.52 తదుపరి శ్రవణం, వర్జ్యం:రా.10.58-12.36, దుర్ముహూర్తం: సా.4.54-5.45, అమృతఘడియలు: మ.12.09-1.50, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శనివారం ఢిల్లీలో యువగళం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్

ఏపీకి మీ ఆశీస్సులు అందించండి

ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ వినతి

- నిరంతరం అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు
- కుటుంబంతో కలసి మోదీ నివాసానికి.. 2 గంటలు సమావేశం
- బ్రాహ్మణి, దేవాన్ష్‌కు ప్రధాని ఆశీస్సులు
- 'యువగళం' కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ
- దేవాన్ష్‌తో ముచ్చట్లు.. కానుకగా చాక్లెట్లు

దేవాన్ష్‌తో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆశీస్సులు అందించాలని ప్రధాని మోదీకి మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ తన వంతు సహకారం అందించేందుకు దిశానిర్దేశం చేయాల్సిందిగా విన్నవించారు. వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను

మిగతా 14వ పేజీలో...

మహిళలకు పంద్రాగస్టు కానుక

మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుడతాం. జూన్‌లో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. బడులు తెరిచిన వెంటనే ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ ఖాతాల్లో నగదు జమ చేస్తాం.

రాయలసీమను హరిత ఇంధన కేంద్రంగా, హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత నాది. రాయలసీమ గడ్డపైనే నేను పుట్టాను. ఈ ప్రాంత బిడ్డగా అది నా బాధ్యత. పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తాం. - సీఎం చంద్రబాబు



మహిళా రైతు నుంచి కీరదోసను కొనుగోలు చేస్తున్న చంద్రబాబు

- ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం
- జూన్‌లో 'తల్లికి వందనం'.. ఖాతాల్లోకి నగదు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- రాయలసీమకు పెద్దఎత్తున పరిశ్రమలు
- గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- 175 నియోజకవర్గాల్లో 175 రైతు బజార్లు
- ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర
- అందరూ భాగస్వాములు కావాలి
- కర్నూలు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం

కర్నూలు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పింఛన్ రూ.వెయ్యి పెంచామని, ఏడాదికి రూ.36 వేల కోట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. పాణ్యం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజావేదిక సభలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో మమేకం కావాలని, పర్యావరణ పరిరక్షణ కోసం చేయీ చేయీ కలిపి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. 'ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నాం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రపరచాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర నిర్వహించాలి. మూడో శనివారం ఎవరూ ఆఫీసుల్లో పని చేయవద్దు. ఆఫీసును శుభ్రం చేసి పచ్చని చెట్ల కింద విశ్రాంతి

మిగతా 14వ పేజీలో...

తెంపరి ట్రంప్‌తో తిప్పలు



అమెరికా అధ్యక్షుడి నోటి వెంట వెలువడే ప్రతి మాటకూ ఎంతో విలువ ఉంటుంది. ఎందుకంటే, దాని ప్రభావం ప్రపంచ దేశాల మీద ఉంటుంది. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఆయన తన మనసులో ఏది మెదిలితే అది ప్రకటించేస్తున్నారు.

భారత్-పాక్ మధ్య అమెరికా దౌత్యపరంగా రాజీ కుదిర్చితే కుదర్చవచ్చునుగానీ, ఆ విషయాన్ని ఆయా దేశాలు ప్రకటించక ముందే ట్రంప్ తన 'ట్రూత్' ఖాతా ద్వారా ప్రకటించడంతో మన ప్రధాని మోదీ ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది.

చైనాపై అడ్డగోలుగా వేసిన పన్నులను తిరిగి పూర్వ స్థితికి తీసుకువస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్, భారత్ విషయంలో మాత్రం పన్నులు తగ్గించేది లేదని ప్రకటించారు. 'యాపిల్' కంపెనీ తన ఐఫోన్ల ఉత్పత్తిని భారత్‌లో చేపట్టకూడదని తాను ఆ సంస్థను కోరానని మరో బాంబు పేల్చారు. ఈ ప్రకటనలన్నీ భారత్ ప్రయోజనాలకు విరుద్ధమైనవే.

జనాభా పరంగా కూడా ద్వితీయ స్థానంలో ఉన్న భారత్‌ను సామంత రాజ్యంగా పరిగణించాలని అగ్రరాజ్యాధినేత భావించడాన్ని మన దేశ పౌరులు జీర్ణించుకోలేక పోతున్నారు.

మారిన ట్రంప్ వైఖరి వల్ల భారత్‌కు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా? అన్నదే మనకు ముఖ్యం. ఈ నేపథ్యంలో మన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోవలసిన అవసరం ఉందనిపిస్తోంది.

పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించవచ్చునని మన దేశ ప్రజలు భావిస్తున్నారుగానీ, పాక్ వెనుక చైనా ఉందని విస్మరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ప్రకటించడం మంచిదే.

చట్ట సభలు ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టుకోవడం కూడా సమర్థనీయం కాదు. అలాంటి బిల్లులు ఏవైనా రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే వాటిని తిప్పి పంపే అధికారం గవర్నర్లకు ఉంటుంది. గవర్నర్లు ఆ పని చేయకుండా నెలలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడితే చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తిని హరించడమే అవుతుంది కదా?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

కాంగ్రెస్‌ను కాదని శశిథరూర్‌కు పట్టం



అఖిలపక్ష బృందంలో ఒకదానికి నేతృత్వం

- మోదీ సర్కారు సంచలన నిర్ణయం
- మండిపడ్డ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్
- కాంగ్రెస్‌లో ఉండటం వేరు..
- కాంగ్రెస్‌తో ఉండటం వేరని వ్యాఖ్య
- దౌత్య ప్రచారానికి ఎంపీలతో 7 బృందాలు
- ఇండియా కూటమి నుంచి ముగ్గురికి నేతృత్వం
- ప్రపంచవ్యాప్తంగా పాక్‌ను ఎండగట్టడం లక్ష్యం

న్యూఢిల్లీ, మే 17 (ఆంధ్రజ్యోతి): పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారత్ దౌత్య యుద్ధాన్ని ఆరంభించింది. అయితే.. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన నాలుగు పేర్లను కాదని.. ఓ బృందానికి కేంద్ర ప్రభుత్వం శశిథరూర్‌ను ఎంపిక చేయడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఏడాది కాలంగా శశిథరూర్ కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండడం.. ఇటీవల ప్రధాని మోదీ కూడా కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనను పొగడటం తెలిసిందే..! ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కేంద్రం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శశిథరూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "కాంగ్రెస్‌లో ఉండడం వేరు.. కాంగ్రెస్‌తో ఉండడం వేరు" అని వ్యాఖ్యానించారు. సున్నితమైన విషయాల పట్ల కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. క్రికెట్ పరిభాషలో 'బాడీలైన్(నిబంధనలకు విరుద్ధం)'ను ఉటంకిస్తూ.. "కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఆడుతుంటే.. బీజేపీ బాడీలైన్ ఆడుతోంది" అని తీవ్రస్థాయిలో విమర్శించారు. "కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు

మిగతా 13వ పేజీలో...



పాకిస్థాన్‌కు సైనిక రహస్యాల చేరవేత!

సైనిక, వైమానిక బేస్‌ల వీడియోలు చిత్రీకరించి పాక్‌కు పంపుతున్న మహిళా యూట్యూబర్ అరెస్టు

పలు రాష్ట్రాల్లో నెట్‌వర్క్.. ఆరుగురి అరెస్టు 13

వీరే ప్రధాన కుట్రదారులు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు



- జగన్‌కు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సన్నిహితులు
- ఈ ఇద్దరి ద్వారానే అసలు వ్యక్తికి మద్యం ముడుపులు
- నెలకు 50-60 కోట్ల కమీషన్ల వసూలుకు పక్కా స్కెచ్
- స్కామ్ అమలుకు డిప్యుటేషన్‌పై వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్
- ధనుంజయ్‌రెడ్డి సూచనతోనే వారిద్దరికి కీలక పోస్టులు
- 'లిక్కర్' సంప్రదింపులు జరిపింది కృష్ణమోహన్‌రెడ్డి
- రాజ్ కసిరెడ్డి నుంచి వీరికి ముడుపుల మూటలు
- అంతిమ లబ్ధిదారుకు భారీవాటా..వీరికీ సొంత లబ్ధి
- రిమాండ్ రిపోర్టుల్లో వెల్లడించిన సిట్ అధికారులు
- కస్టడీకి అనుమతించాలని కోర్టును కోరిన సిట్
- రిమాండ్ విధించిన కోర్టు.. బెజవాడ జైలుకు తరలింపు

అమరావతి, మే 17 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితులు, సీఎంవోలో కీలక వ్యక్తులైన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ద్వారానే ముడుపులు అసలువ్యక్తులకు చేరాయని ఏసీబీ కోర్టుకు సిట్ అధికారులు తెలిపారు. మద్యం వ్యాపారుల నుంచి కమీషన్లను ఏ1 రాజ్ కసిరెడ్డి వసూలు చేసేవారని, ఆ సొమ్ములు ఆయన నుంచి ఎక్కడికి చేరాయనేది వీరిద్దరికీ తెలుసునని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఈ ఇద్దరూ ప్రధాన కుట్రదారులని తెలిపారు. రాజ్ కసిరెడ్డి

మిగతా 12వ పేజీలో...

అధికార విధులు దాటి అక్రమాలు

- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ విచారణకు అనుమతి అక్కర్లేదు
- ఇది సాధారణ కేసు కాదు: ప్రాసిక్యూషన్
- 20 వరకు రిమాండ్..
- జైలులో పడక, దిండు, దుప్పటి సౌకర్యాలు కల్పించాలని కోర్టు ఆదేశం

సీజనొస్తున్నా.. సరఫరా ఏదీ?

- రాయితీ విత్తన పంపిణీలో తాత్సారం
- బడ్జెట్‌లో 240 కోట్లు కేటాయింపు
- 40% కోత పెట్టాలంటున్న ఆర్థిక శాఖ?
- ఇంకా నిధులు విడుదల చేయని వైనం
- విత్తన సరఫరాదారులకు గత ప్రభుత్వం 800 కోట్లు బకాయి
- మళ్లీ అప్పు ఇచ్చేందుకు విముఖత
- ఇండెంట్ పెట్టని వ్యవసాయ శాఖ



రుతుపవనాలు వచ్చేసరికి విత్తనాలు అందించాలంటున్న రైతులు 12

7,715 గ్రూపులుగా సచివాలయాలు

- భౌగోళిక పరిస్థితులను బట్టి గ్రూపింగ్ 12
- ఉద్యోగుల వర్గీకరణ.. జనాభాను బట్టి నియామకం
- ప్రతి గ్రామ సచివాలయానికీ ఒక ఏఎన్ఎం
- ప్రతి 'వార్డు'కు హెల్త్, శానిటేషన్ సెక్రటరీలు



రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!

- 2016లో 2 మెమోలు జారీ చేసిన హోంశాఖ
- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలపాలని రాష్ట్రపతికి సూచన 13
- ఇతర మంత్రిత్వశాఖలూ స్పందించాలని నిర్దేశం
- జాప్యం నివారణకు అవసరమని స్పష్టీకరణ
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం అర్ధరాత్రి
- ఆర్మీచీఫ్ తెలిపారు: పాక్ ప్రధాని షెహబాజ్ 13

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

కేంద్రం, ఎన్ఎంసీ, ఎన్‌టీఏకు నోటీసులు



జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి..!

- అమెరికాలో ఓ చిన్నారికి 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ కీలకపాత్ర 13

నక్సల్స్ మూలాలపై దెబ్బ

- మావోయిస్టుల రిక్రూట్‌మెంట్, సమాచారం, రవాణా, వనరులపై వేటు
- పదేళ్లలో తగ్గిన నక్సలిజం.. నక్సల్స్ స్థావరాల్లో బలగాల పాగా 2
- 126 నుంచి 6 జిల్లాలకు పరిమితమైన ప్రభావం.. హింస తగ్గుముఖం

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్!



- భారత్ సుంకాలను 100% తగ్గించనుందని పునరుద్ఘాటన.. గతంలోనే తోసిపుచ్చిన భారత్

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

- ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం
- గాజాను అభివృద్ధి చేస్తానని గతంలో ట్రంప్ ప్రకటన
- మాతృభూమిని రక్షించుకునేందుకు.. ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్న హమాస్ 13

తుర్కియేకు 'బ్యాండ్'!

- ఆ దేశంలో భారతీయుల డెస్టినేషన్ వెడ్డింగ్‌లు రద్దు
- ఫలితంగా రూ.770 కోట్ల మేర ఆదాయానికి గండి
- బెంగళూరు వస్త్ర వ్యాపారుల కటీఫ్
- దిగుమతులు రద్దు చేసుకున్న బీడబ్ల్యూసీఎంఏ

మోదీ విశాఖ పర్యటన ఏర్పాట్లకు మంత్రుల కమిటీ



అమరావతి, మే 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. దీని దృష్ట్యా వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఐదుగురు మంత్రులు.. నారా లోకేశ్, అనిత, సత్యకుమార్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామితో నిర్వాహక కమిటీని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలనశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ కన్వీనర్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబును నియమించింది. ప్రధాని పర్యటనకు అనుగుణంగా అన్నిశాఖలూ సమష్టిగా, సమన్వయంతో పని చేసేలా ఈ కమిటీ మార్గదర్శనం చేస్తుంది.

నేవీ విశ్రాంత అధికారుల సముద్ర యాత్ర

- న్యూజిల్యాండ్‌లోని ఓపూవా బే నుంచి అండమాన్‌లోని శ్రీవిజయపురం వరకు...

విశాఖపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇద్దరు ఆరు పదుల వయస్సు దాటిన తరువాత సముద్ర యాత్ర చేపట్టారు. వీరు నేవీలో పనిచేసి పదవీ విరమణ చేశారు. కె.శ్రీనివాస్ కల్నల్ హోదాలో, సీడీఎన్‌వీ ప్రసాద్ కెప్టెన్ హోదాలో రిటైర్ అయ్యారు. వీరిద్దరు ఈ నెల 14న న్యూజిలాండ్‌లోని ఓపూవా బే నుంచి 34 అడుగుల పొడవైన 'టిస్టి' అనే బోటులో యాత్ర ప్రారంభించారు. పోర్టు ఫిజీలోని సవుసావుకు ఈనెల 27న చేరుకుంటారు. ఇండోనేసియా, మలేసియా, థాయ్‌ల్యాండ్ మీదుగా అండమాన్, నికోబార్ దీవుల్లోని శ్రీవిజయపురం వరకు యాత్ర సాగుతుందని నేవీ వర్గాలు తెలిపాయి.



సెయిలింగ్ బోటు టిస్టి (ఇన్‌సెట్) శ్రీనివాస్, ప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ తదితరులు



ర్యాలీ చేస్తున్న పురందేశ్వరి, దుర్గేశ్, ఆదిరెడ్డి, సోము తదితరులు

ఘనంగా తిరంగా ర్యాలీలు

- మూడు జిల్లాలో నిర్వహణ
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ/అనంతపురం/టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం మూడు జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీలో మంత్రి కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, అధికారులు పాల్గొన్నారు. చినుకులు పడుతున్నా లెక్కచేయకుండా నాయకులు జాతీయ జెండాలతో 'మేరా భారత్ మహాన్.. జయహో భారత్..' నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతపురం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం నుంచి క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ నిర్వహించిన ర్యాలీలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్ జాతీయ జెండాలు చేతపట్టుకుని ముందు వరుసలో నిలిచారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు వారిని అనుసరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా మన సైన్యం పాకిస్థాన్‌కు గట్టి సమాధానం చెప్పిందని కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయుల విజయమని, మన సైనికుల ధైర్య సాహసాలకు ప్రతిఒక్కరూ సెల్యూట్ చెప్పాలని కోరారు.



కోటబొమ్మాళి ర్యాలీలో మంత్రి అచ్చెన్న

ప్లంజ్‌పూల్ విస్తరించలేదు

- గుర్తించిన జలవనరుల శాఖ
- శ్రీశైలం మరమ్మతుల ప్రక్రియ వేగవంతం

అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయం దుస్థితిపై కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ(సీడీఎస్ఏ) తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో.. మరమ్మతులపై రాష్ట్ర జల వనరుల శాఖ వేగం పెంచింది. స్పిల్‌వేకు ఎదురుగా ప్లంజ్ పూల్(భారీ గొయ్యి) విస్తరించిందేమోనని జల వనరుల శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. విస్తరించలేదని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్, దెబ్బతిన్న స్టీల్ సిలెండర్లపై సీడీఎస్ఏ హెచ్చరికలతో వాటి మరమ్మతులపై జల వనరుల శాఖ దృష్టి సారించింది. ఇప్పటిదాకా శ్రీశైల జలాశయం దుస్థితిపైనా, మరమ్మతులపైనా కేంద్ర జలసంఘం, కేంద్ర వాటర్ అండ్ పవర్ పరిశోధనా సంస్థ అధ్యయనం చేసేందుకు రూ.50 లక్షల చెల్లించాల్సిందిగా కోరాయి. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర ఆర్థిక శాఖకు తెలియజేసినప్పటికీ నిధులిచ్చేందుకు ఆర్థికశాఖ తిరస్కరించడంతో అధ్యయనం ఆగిపోయింది. 'ఆర్థిక శాఖతోనే అసలు 'పేచీ' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఆ ఫైళ్లపై సీఎంవో ఆరా తీసింది. సీడీఎస్ఏ సూచించిన మేరకు అప్రోచ్ రోడ్, స్టీల్ సిలెండర్ల మార్పిడి కోసం టెండర్లను పిలిచేందుకు జలవనరుల శాఖ సిద్ధమైంది. సమగ్ర నివేదికలూ, అంచనా వ్యయంపై సోమవారం ఆర్థికశాఖతో కలసి జల వనరుల శాఖ ఉన్నత స్థాయి సమీక్షను నిర్వహించనుంది.



ప్లంజ్‌పూల్‌ను యంత్రంతో పరిశీలిస్తున్న అధికారులు

నక్సల్స్ మూలాలపై దెబ్బ

- మావోయిస్టుల రిక్రూట్‌మెంట్, సమాచారం, రవాణా, వనరులపై వేటు
- నక్సల్స్ వనరులు, స్థావరాల్లో.. కేంద్ర బలగాల పాగా
- 126 నుంచి.. 6 జిల్లాలకు పరిమితమైన నక్సలిజం
- వివరాలను వెల్లడించిన కేంద్రం

చర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో దేశంలో నక్సలిజం చాలా వరకు తగ్గిపోయిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుడిచిపెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు గుర్తుచేసింది. 'నేషనల్ పాలసీ అండ్ యాక్షన్ ప్లాన్' పేరుతో ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలతో నక్సల్స్ హింస 81% మేర తగ్గడమే కాకుండా.. మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 6కు చేరినట్లు వెల్లడించింది. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లో కేంద్ర బలగాలు క్యాంపులను ఏర్పాటు చేశాయని, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో చిన్నారులకు విద్య, యువతకు వృత్తి నైపుణ్యతలో శిక్షణ, రోడ్ల నిర్మాణం, 4జీ నెట్‌వర్క్‌తో సెల్‌ఫోన్ సౌకర్యం, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేసినట్లు తెలిపింది. గత నెల 21 నుంచి ఈ నెల 11 వరకు తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 16 మంది మహిళా నక్సల్స్ సహా.. 31 మంది మావోయిస్టులు హతమయ్యారని, ఆ ప్రాంతంలో కేంద్ర బలగాలు పలు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు వివరించింది. అదే సమయంలో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్లు, కమ్యూనికేషన్, రవాణా, వనరులపై దెబ్బ కొట్టినట్లు పేర్కొంది. ఆయా వివరాలను 'బ్రేకింగ్ రెడ్ గ్రిప్' పేరుతో శనివారం ఓ నివేదికను విడుదల చేసింది. ఆ నివేదికలోని కీలకాంశాలు..

- 2014లో 126 జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉండగా.. వాటి సంఖ్య 2018లో 90కి, 2021లో 70కి, 2024లో 38కి.. ప్రస్తుతం 12కి తగ్గింది. ఈ12 జిల్లాల్లో ఆరింటిలో మాత్రం మావోయిజం తీవ్రంగా ఉంది.
- గడిచిన పదేళ్లలో 8 వేల మంది మావోయిస్టులు హింసామార్గాన్ని విడిచిపెట్టారు. 2010-24 మధ్యకాలంలో నక్సల్స్ హింస 81%, నక్సల్స్ హింసలో మరణాలు 85% మేర తగ్గాయి
- 2014లో 330 పోలీస్‌స్టేషన్ల పరిధిలో మావోయిస్టుల హింసపై కేసులు నమోదవ్వగా.. 2024లో ఆ సంఖ్య 104కు తగ్గింది.

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలు

- భద్రత ఖర్చుల(ఎస్ఆర్ఈ)పథకం ద్వారా రూ.3,260 కోట్ల ఖర్చు
- ప్రత్యేక కేంద్ర సహాయం(ఎస్‌సీఏ)కు 3,563 కోట్ల కేటాయింపు
- ప్రత్యేక మౌలిక వసతుల(ఎస్ఐఎస్) పథకం ద్వారా రూ.1741 కోట్లతో 221 పటిష్ఠ పోలీసు స్టేషన్ల నిర్మాణం.
- నక్సల్స్ ప్రాంతాల్లో 14,618 కిలోమీటర్ల పరిధిలో రోడ్లు పూర్తి
- 4జీ సేవల కోసం 10,505టవర్ల ఏర్పాటు లక్ష్యంలో.. 7,768 పూర్తి
- 35 జిల్లాల్లో 1,007 బ్యాంకు శాఖలు, 937 ఏటీఎంలు, 5,731 పోస్టాఫీసుల ఏర్పాటు. ఈ జిల్లాల్లో 178 ఏకలవ్య మోడల్ స్కూళ్లు, 48 ఐటీఐలు, 61 నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ యువతకు ప్రత్యేక శిక్షణనివ్వడం ద్వారా.. 1,143 మంది భద్రతాబలగాల్లో నియమితులయ్యారు
- గడిచిన ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కొత్తగా 302 క్యాంపులు ఏర్పాటయ్యాయి. సిబ్బంది తరలింపునకు అనుగుణంగా 68 హెలిప్యాడ్లు నిర్మితమయ్యాయి.

కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

తుని హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ముగ్గురి దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఐదుగురూ అపోలో ఫార్మసీ ఉద్యోగులు


షేక్ హజరత్


రామరాజు


సుధీర్


కాకినాడ జిల్లా తుని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

తుని రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన గెడ్డం రామరాజు, రాజమహేంద్రవరానికి చెందిన వెంకట సుబ్బారావు, కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన గోనా శివ శంకర్, పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన వారాడ సుధీర్, ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన షేక్ హజరత్ అలీ రాజమహేంద్రవరంలోని అపోలో ఫార్మసీ ఉద్యోగులు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన కంపెనీ సమావేశానికి హాజరై రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కాకినాడ జిల్లా తుని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామరాజు(38), సుధీర్(36), హజరత్ అలీ(35) అక్కడికక్కడే మృతి చెందగా వెంకట సుబ్బారావు, శివశంకర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇనుప కడ్డీల లోడు లారీని నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుల్లో షేక్ హజరత్ అలీకి ఇటీవలే వివాహమైనట్టు కుటుంబీకులు తెలిపారు.

మంత్రి లోకేశ్ దిగ్ర్భాంతి

ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం పట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి.. ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

ప్రపంచ ఆవిష్కరణలకు కేంద్రంగా ఏపీ

వికసిత్ భారత్‌ను అధిగమించేలా స్వర్ణాంధ్ర-2047

- ఏఐకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి
- అనంతపురం జేఎన్టీయూ స్నాతకోత్సవంలో గవర్నర్

అనంతపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆవిష్కరణలకు కేంద్రంగా, పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ వేదిక కానుందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. అనంతపురం జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అధ్యక్షతన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ చావాకు గవర్నర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆ తరువాత 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 40,109 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 'ప్రపంచం మీ ఆలోచనలు, మీ నాయకత్వం కోసం ఎదురుచూస్తోంది. వినయంతో ముందుకు సాగి వర్సిటీ అత్యున్నత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి' అని విద్యార్థులకు గవర్నర్ సూచించారు. జాతీయ క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతిలో క్వాంటం వ్యాలీ, క్వాంటం కంప్యూటింగ్ హబ్‌ను స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని అధిగమించేలా రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర-2047 విజన్ ఉందని అన్నారు. 2047 నాటికి ఆర్థికశ్రేయస్సు, సాంకేతిక పురోగతి, సామాజిక సమానత్వం, పర్యావరణ స్థిరత్వాన్ని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌మ్యాప్ రూపొందించిందని తెలిపారు. 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొని, అవకాశాలను అందుకునేలా యువతను సిద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తోందని గవర్నర్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, వర్సిటీ అధ్యాపకులు సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి హరి జవహర్‌లాల్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, కలెక్టర్ వినోద్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌ను సత్కరిస్తున్న అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

వేట కొడవళ్లతో దంపతుల హత్య

- భూ తగాదాతో ఘర్షణ
- అక్కడికక్కడే భార్య మృతి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- పలువురికి గాయాలు



నారాయణ రెడ్డి, ముత్యాలమ్మ

రాప్తాడు, మే 16(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య కొన్నేళ్లుగా కొనసాగుతున్న భూ వివాదం ఇద్దరి హత్యకు దారి తీసింది. భూమి కోసం ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో అనంతపురం జిల్లా రాప్తాడుకు చెందిన చిగిచెర్ల ముత్యాలమ్మ(46), చిగిచెర్ల నారాయణరెడ్డి(56) దంపతులు ప్రాణాలు కోల్పోయారు. రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి గంగలకుంట రెవెన్యూ సర్వే నంబర్ 78-3లో (పాత సర్వే నంబర్) 6.20 ఎకరాల భూమి ఉండేది. దీన్ని 1997లో రాప్తాడుకు చెందిన కాటమిరెడ్డి ముగ్గురు కుమార్తెలు పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మికి ఎకరం రూ.15 వేల చొప్పున విక్రయించారు. కొనుగోలుదారులు రూ.93 వేలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు నారాయణరెడ్డి కాలయాపన చేశారు. దీంతో భూమి కొన్నవారు కోర్టును ఆశ్రయించారు. 2012లో అనంతపురం సివిల్ కోర్టు వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ పూర్తైనా నారాయణరెడ్డే ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. దీంతో భూమి కొన్నవారు హైకోర్టును ఆశ్రయించారు. 2022లో హైకోర్టు కూడా వారికే అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఈ ఏడాది జనవరి 7న రెవెన్యూ అధికారులు కొనుగోలుదారుల పేరిట భూమిని ఆన్‌లైన్ చేయించారు. ఈ క్రమంలో రాప్తాడు, సమీప గ్రామాలకు చెందిన కొందరు ఆ భూమిని పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి నుంచి ఎకరం రూ.60 లక్షల చొప్పున కొన్నట్టు అగ్రిమెంటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారందరూ శనివారం ఉదయం పొలానికి వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో పొలంలోని దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా.. నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, బావమరిది ప్రతాప్ రెడ్డి అక్కడికి రావడంతో ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. వేట కొడవళ్లతో దాడి చేయడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నారాయణ రెడ్డి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రతాప్‌రెడ్డితో పాటు మరో వర్గానికి చెందిన నలుగురు గాయపడ్డారు. దాడిపై ప్రదీప్ కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

తెంపరి ట్రంప్‌తో తిప్పలు

ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత మంది కాంగ్రెస్ శాసనసభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేసి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైసీపీలో చేరారు. వారి రాజీనామాలు ఆమోదిస్తే, ఉప ఎన్నికలు వస్తాయి. అదే జరిగితే అప్పటి పరిస్థితులలో వైసీపీ విజయం సాధించేది. ఈ కారణంగా సభ్యుల రాజీనామాలను అప్పటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ పెండింగ్‌లో పెట్టారు. తర్వాత రాష్ట్రం విడిపోయింది. తెలంగాణలో తెలుగుదేశం తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌ను పార్టీలో చేర్చుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పించారు. అయితే, అప్పటి గవర్నర్ నరసింహన్ తెలుగు దేశం తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించడానికి నిరాకరించారు. దీంతో ఆయనతో ఉత్తుత్తి రాజీనామాను స్పీకర్‌కు అందజేయించారు. చట్టంలోని లోపాలను అలా వాడుకున్నారు. ఆ తర్వాత ఇదే ట్రిక్కును ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా వాడుకుంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ గడ్డపై నుంచి చేస్తున్న ప్రకటనలు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సొంత గడ్డపై ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ట్రంప్ ప్రకటనలతో అమెరికా మనకు మిత్ర దేశమా? శత్రు దేశమా? అని తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. మొదటి పర్యాయం అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ మన దేశానికి మిత్రుడిగా వ్యవహరించగా, రెండో పర్యాయం మాత్రం అనుకూల శత్రువుగా మారిపోయారు. ఆయన ప్రకటనలు దేశ ప్రయోజనాలకే కాకుండా ప్రధాని మోదీ రాజకీయ ప్రయోజనాలకు కూడా ముప్పుగా పరిణమిస్తున్నాయి. పహల్గాం దారుణం తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో మోదీ ప్రతిష్ఠ ఇంటా బయటా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ హఠాత్తుగా ఆగిపోవడం, ఇందుకు సంబంధించిన ప్రకటనను భారత్, పాకిస్థాన్‌లు అధికారికంగా చేయకముందే రెండు దేశాల మధ్య రాజీ కుదిరిందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో దేశ ప్రజలు నివ్వెరపోయారు. రెండు దేశాల మధ్య అమెరికా దౌత్యపరంగా రాజీ కుదిర్చితే కుదర్చవచ్చునుగానీ, ఆ విషయాన్ని ఆయా దేశాలు ప్రకటించక ముందే ట్రంప్ తన 'ట్రూత్' ఖాతా ద్వారా ప్రకటించడంతో మన ప్రధాని మోదీ ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది. అప్పటి నుంచి ట్రంప్ వరుసగా చేస్తున్న ప్రకటనలు మన దేశ ప్రయోజనాలకు ముప్పుగా పరిణమించాయి. భారత్‌తో పోల్చితే చైనా వైపే ట్రంప్ చూడటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మన ప్రధాని మోదీని తెలివైనవారు అని ప్రశంసించిన ట్రంప్ ఇప్పుడు చేస్తున్న ప్రకటనలతో మోదీని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు.

సత్తా చాటిన 'సిందూర్'.. అంతలోనే!

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సైనిక పాటవాన్ని ప్రపంచానికి తెలియజేసింది. అంతర్జాతీయ సరిహద్దులను అతిక్రమించకుండానే మన శత్రు దేశమైన పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టడమే కాకుండా, ఆ దేశ వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేయగలిగాం. అదే సమయంలో పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లు మన దేశంలో నష్టం చేయకముందే వాటిని కూల్చివేశాం. దీంతో పాక్‌పై మనది పైచేయి అయింది. పహల్గాం తర్వాత పాక్‌పై పగ ప్రతీకారాలతో రగిలిపోయిన దేశ ప్రజలకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. ఈ దశలో భారత్–పాక్ మధ్య యుద్ధం ముదురుతుందన్న భావన ఏర్పడింది. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హఠాత్తుగా చేసిన ప్రకటనతో మన దేశ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. ఈ ఆధునిక యుగంలో యుద్ధాలు వాంఛనీయం కాదు. ఎంత జటిలమైన సమస్యనైనా చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. అందునా, అణ్వాయుధాలు కలిగి ఉన్న రెండు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇలాంటి సందర్భాలలో ఉభయులకూ కావల్సిన దేశాలు మధ్యవర్తిత్వం నెరపడం కొత్త కాదు. అయితే యుద్ధరంగంలో తలమునకలై ఉన్న దేశాలతో నిమిత్తం లేకుండా రాజీకి చొరవ తీసుకున్న దేశాధినేతే ప్రకటన చేయడం ఇబ్బందిగా మారింది. అగ్రరాజ్యం మోచేతి కింద నీళ్లు తాగుతూ బతికే దేశాల విషయంలో ఇలా జరిగితే జరగవచ్చుగానీ, ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగడానికి పరుగులు తీస్తున్న భారత్‌వంటి దేశం విషయంలో మన ప్రమేయం లేకుండా ప్రకటన రావడం అవమానకరంగా దేశ పౌరులు భావిస్తున్నారు. యుద్ధానికి సంబంధించిన రాజీ ప్రకటనతో ఆగిపోకుండా ట్రంప్ తన వరుస ప్రకటనలతో మన నాయకత్వాన్ని మరింత ఇబ్బందికర స్థితిలోకి నెట్టారు. చైనాపై అడ్డగోలుగా వేసిన పన్నులను తిరిగి పూర్వ స్థితికి తీసుకువస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్, భారత్ విషయంలో మాత్రం పన్నులు తగ్గించేది లేదని ప్రకటించారు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండగానే అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై జీరో టాక్స్ అమలుకు భారత్ అంగీకరించిందని ప్రకటించడం ద్వారా ట్రంప్ మరోసారి మన ప్రధాని మోదీని ఆత్మరక్షణలోకి నెట్టారు. అంతటితో ఆగకుండా 'యాపిల్' కంపెనీ తన ఐఫోన్ల ఉత్పత్తిని భారత్‌లో చేపట్టకూడదని తాను ఆ సంస్థను కోరానని మరో బాంబు పేల్చారు. ఈ ప్రకటనలన్నీ భారత్ ప్రయోజనాలకు విరుద్ధమైనవే.

ట్రంప్ తీరే వేరు...

మామూలుగా అయితే దేశాధినేతలు హుందాగా ప్రవర్తిస్తారు. ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాలతో పాటు వాణిజ్య పరమైన అంశాలపై బహిరంగంగా ప్రకటనలు చేయరు. ఆయా దేశాలతో అవగాహన లేదా ఒప్పందాలు కుదిరినప్పుడు సంబంధిత శాఖల ద్వారా అధికారిక ప్రకటనలు చేయిస్తారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ స్టయిలే వేరు. రెండవ పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తానొక అగ్రరాజ్యాధినేతలా కాకుండా సాదాసీదా నాయకుడిగా ఎడాపెడా ప్రకటనలు చేస్తూ నోటికి పని చెబుతున్నారు. వాణిజ్య పన్నులకు సంబంధించి ఆయన చేసిన ప్రకటనలతో ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. స్వదేశంలో కూడా ట్రంప్‌పై వ్యతిరేకత పెరిగింది. భారత్–పాక్ ప్రధానమంత్రులు కలిసి కూర్చొని డిన్నర్ చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ట్రంప్ తన వాచాలత్వం ప్రదర్శించారు. దాయాదుల మధ్య పోరు ఈనాటిది కాదు. ఇద్దరు ప్రధానులూ కూర్చొని భోజనం చేసినంత మాత్రాన పరిష్కారమయ్యే వైషమ్యాలా ఇవి? ప్రధానులు సరే అనుకున్నప్పటికీ 140 కోట్ల మంది భారతీయులు, 25 కోట్ల మంది పాకిస్థానీలను సంతృప్తిపరచడం సాధ్యమా? ఇలాంటి క్లిష్టమైన అంశాలను కూడా ట్రంప్ తేలికగా తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. యావత్ ప్రపంచానికే తనను నాయకుడిగా ప్రకటించుకోవాలన్న దుగ్ధతోనే బహుశా ట్రంప్ ఇలా ప్రవర్తిస్తున్నారేమో తెలియదు. ఐదు దశాబ్దాల క్రితమే మన ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఆధిపత్య ధోరణిని తిరస్కరించారు. అప్పటితో పోల్చితే భారత్ ఇప్పుడు ఆర్థికంగా, సైనిక పరంగా ఎన్నో రెట్లు బలపడింది. ఈ దశలో జనాభా పరంగా కూడా ద్వితీయ స్థానంలో ఉన్న భారత్‌ను సామంత రాజ్యంగా పరిగణించాలని అగ్రరాజ్యాధినేత భావించడాన్ని మన దేశ పౌరులు జీర్ణించుకోలేకపోతున్నారు. అమెరికాతో వాణిజ్య సంబంధం లేకపోతే ప్రపంచ దేశాలు మనుగడ సాగించలేవు అన్నట్టుగా ట్రంప్ తెంపరితనం ప్రదర్శిస్తున్నారు. ఇంతా చేస్తే అమెరికా జనాభా 35 కోట్లు మాత్రమే. 140 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని 35 కోట్ల జనాభా ఉన్న అమెరికా వాణిజ్యపరంగా నియంత్రించాలని అనుకోవడం ఏమిటి? అని మన దేశ ప్రజలు సహజంగానే ప్రశ్నిస్తున్నారు. భారత్ విషయంలో ట్రంప్ వైఖరి మారడానికి కారణాలు తెలియాల్సి ఉంది. చైనాకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా మనకు ఇవ్వకపోవడంపై భారతీయులు ఆగ్రహంగా ఉన్నారు. యుద్ధం ఆపేయకపోతే మీ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంటానని బెదిరించడంతో... పాక్‌తో పాటు భారత్ కూడా దారికి వచ్చిందని ట్రంప్ చెప్పుకొంటున్నారు. ఈ ప్రకటనతో మన విదేశాంగ శాఖ విభేదించింది. నిజంగా కూడా అమెరికాతో వాణిజ్య సంబంధాలు లేకపోతే మన దేశం మనుగడ సాగించలేదా? ఈ విషయమై నిజానిజాలను ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నా తమ దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారు. అది సహజం కూడా. ఈ క్రమంలోనే మిత్ర దేశాలకు అవసరమైన ఆర్థిక, ఆయుధ సహకారాన్ని అమెరికా అందిస్తూ వస్తోంది. నిన్న మొన్నటి వరకు భారత్‌ను మిత్ర దేశంగా అమెరికా పరిగణించింది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు అండగా నిలిచిన తుర్కియేకు క్షిపణులు సరఫరా చేయడానికి అమెరికా సిద్ధపడింది. ఇది దేనికి సంకేతం? మన విదేశాంగ విధానంలోనే లోపం ఉందా? లేక ప్రపంచ దేశాల వైఖరి మారుతోందా? ఏది ఏమైనా డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలతో ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ట్రంప్ ప్రకటనలు భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ ప్రధానమంత్రి మోదీ నోరు విప్పకపోవడం ఏమిటి? ఆపరేషన్ సిందూర్ విషయంలో కూడా ముందుగా ట్రంప్ నుంచి ప్రకటన రావడం ఏమిటి? ఇటువంటి ప్రశ్నలను ప్రతిపక్షాలు సంధిస్తున్నాయి. అయితే ట్రంప్ తన నోటికి పని చెబుతున్నారని చెప్పి మన ప్రధాని కూడా ప్రతి దానికీ వివరణ ఇవ్వాలని ఆశించడం తగదు. దేశాధినేతలు చాలా హుందాగా, గుంభనంగా ఉండాలి. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి. ఇతర దేశాధినేతలు తనకు సబార్డినేట్స్ అన్నట్టుగా ట్రంప్ వ్యవహరిస్తున్నట్టు ఇతర దేశాధినేతలు కూడా వ్యవహరించాలని కోరుకోలేం. బహుశా ఈ కారణంగానే కాబోలు ప్రధాని మోదీ గుంభనంగా ఉంటున్నారు. అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై జీరో టాక్స్‌కు మనం సిద్ధపడ్డామని ట్రంప్ ప్రకటించినా ప్రధాని మోదీ తాను స్పందించకుండా విదేశాంగ శాఖ మంత్రి ద్వారా ప్రకటన చేయించారు. వాణిజ్య పరమైన అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని, తుది నిర్ణయం ఏదీ తీసుకోలేదని విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది.

చట్టాలను అపహాస్యం చేయకూడదు. సమస్యను పరిష్కరించవలసిన వారే సమస్యకు కారకులైనప్పుడు సుప్రీంకోర్టు కూడా పట్టించుకోకపోతే ఎలా? రాష్ట్రపతి లేఖపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావచ్చుగానీ సమస్యలకు కారణమైన వారే పరిష్కారం చెబితే ఇలాంటి సున్నితమైన అంశాలపై వివాదం ఏర్పడదు!

చులకన... పలుచన

సందర్భం వచ్చిన ప్రతిసారీ అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే వచ్చింది. అయితే ట్రంప్ మాదిరి గతంలో అధ్యక్షులుగా పనిచేసినవారు ప్రతి విషయాన్నీ తామే ప్రకటించాలని భావించలేదు. అమెరికా అధ్యక్షుడి నోటి వెంట వెలువడే ప్రతి మాటకూ ఎంతో విలువ ఉంటుంది. ఎందుకంటే, దాని ప్రభావం ప్రపంచ దేశాల మీద ఉంటుంది. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఆయన తన మనసులో ఏది మెదిలితే అది ప్రకటించేస్తున్నారు. తాను చేసిన ప్రకటనలను రోజుల వ్యవధిలోనే సరిదిద్దుకుంటున్నారు. దీంతో ఆయన ప్రకటనలలో సీరియస్‌నెస్ తగ్గిపోయింది. ప్రపంచ దేశాల ముందు ఆయన పలుచనవుతున్నారు. అమెరికా వంటి బలమైన దేశం ఒక పిచ్చివాడి చేతికి చిక్కిందన్న భావన ప్రజల్లో కూడా వ్యాపిస్తోంది. అమెరికా వంటి దేశానికి ఇలాంటి చౌకబారు నాయకుడా? అని ఈసడించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఒక సాదా సీదా నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోని మైనారిటీలను లక్ష్యం చేసుకొని మెజారిటీ ప్రజల మద్దతు కూడగట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నుంచి తమ స్వదేశాలకు డబ్బు పంపే వారిని కూడా టార్గెట్‌గా చేసుకున్నారు. ఇలా పంపే డబ్బుపై ఐదు శాతం పన్ను విధిస్తానని కూడా ప్రకటించారు. ఈ చర్యలన్నీ అమెరికా పట్ల ఇతర దేశాలలో వ్యతిరేక భావాన్ని పెంపొందిస్తున్నాయి. అయితే... స్వదేశంలో ట్రంప్ బలపడినా ఆశ్చర్యం లేదు. ఇప్పటి వరకు అమెరికాను ఆపన్న హస్తం అందించే దేశంగానే భావించే వారికి ఈ పరిణామం వింతగా అనిపిస్తోంది. దీర్ఘకాలంలో ట్రంప్ తన ధోరణితో అమెరికాకు మేలు చేస్తారో? కీడు చేస్తారో వేచి చూడాలి. అయితే మారిన ఆయన వైఖరి వల్ల భారత్‌కు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా? అన్నదే మనకు ముఖ్యం. ఈ నేపథ్యంలో మన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోవలసిన అవసరం ఉందనిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మనకు నమ్మకమైన మిత్ర దేశాలుగా ఉన్నవారు కూడా ఇప్పుడు మనకు దూరమవుతున్నారు. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు వంటి దేశాలు ఇందుకు నిదర్శనం. మన మిత్ర దేశాలను చైనా తనవైపు ఆకర్షిస్తోంది. ఆయా దేశాలకు ఇబ్బడి ముబ్బడిగా ఆర్థిక సహాయం చేయడంతో పాటు పలు ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా మనల్ని ఏకాకిగా మార్చాలని చూస్తున్నది. తాజాగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను కూడా ఈ కోణంలోనే చూడాలి. పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించవచ్చునని మన దేశ ప్రజలు భావిస్తున్నారుగానీ, పాక్ వెనుక చైనా ఉందని విస్మరిస్తున్నారు. యుద్ధం ముదిరితే చైనా ప్రత్యక్షంగా మరింత బలంగా పాక్‌కు బాసటగా నిలిచేది. ఒకప్పటి మన మిత్ర దేశం రష్యా కూడా ఇప్పుడు పూర్తి స్థాయిలో మనకు అండగా నిలవలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ప్రకటించడం మంచిదే. మనం ఏమిటో ప్రపంచానికి చాటి చెప్పగలిగాం. ఉగ్ర మూకలు పాక్‌లో తలదాచుకున్నప్పటికీ వెంటాడి చంపుతామని రుజువు చేయగలిగాం. అయితే, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుకున్నారు. ఇలాంటి కోర్కెలన్నీ భావోద్వేగాల నుంచి పుట్టుకొస్తాయి. దీనికి తోడు అటు ప్రభుత్వం, ఇటు మీడియా కూడా ఆపరేషన్ సిందూర్‌కు విశేష ప్రచారం కల్పించాయి. ఈ కారణంగా ఆపరేషన్ అర్ధంతరంగా ఆగిపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోవడానికి సమయం పడుతోంది. పుండు మీద కారం చల్లుతున్నట్టు ట్రంప్ పోకడలు తోడయ్యాయి. కారణం ఏమైనా, ఎవరైనా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారడం శుభ పరిణామమే అని చెప్పవచ్చు. ట్రంప్ ప్రకటనల వల్ల ప్రధాని మోదీ తాత్కాలికంగా ఆత్మరక్షణలో పడినప్పటికీ దేశంలో బలమైన ప్రత్యామ్నాయ నాయకుడు కనుచూపు మేర కనిపించనందున రాజకీయంగా ఆయనకు వచ్చే నష్టం కూడా ఏదీ లేదని చెప్పవచ్చు.



ఒక సాదా సీదా నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోని మైనారిటీలను లక్ష్యం చేసుకొని మెజారిటీ ప్రజల మద్దతు కూడగట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నుంచి తమ స్వదేశాలకు డబ్బు పంపే వారిని కూడా టార్గెట్‌గా చేసుకున్నారు. ఇలా పంపే డబ్బుపై ఐదు శాతం పన్ను విధిస్తానని కూడా ప్రకటించారు. ఈ చర్యలన్నీ అమెరికా పట్ల ఇతర దేశాలలో వ్యతిరేక భావాన్ని పెంపొందిస్తున్నాయి. అయితే... స్వదేశంలో ట్రంప్ బలపడినా ఆశ్చర్యం లేదు. ఇప్పటివరకు అమెరికాను అపన్న హస్తం అందించే దేశంగానే భావించే వారికి ఈ పరిణామం వింతగా అనిపిస్తోంది. దీర్ఘకాలంలో ట్రంప్ తన ధోరణితో అమెరికాకు మేలు చేస్తారో? కీడు చేస్తారో వేచి చూడాలి. అయితే మారిన ఆయన వైఖరి వల్ల భారత్‌కు మంచి జరుగుతుందా? చెడు జరుగుతుందా? అన్నదే మనకు ముఖ్యం. ఈ నేపథ్యంలో మన విదేశాంగ విధానాన్ని సమీక్షించుకోవలసిన అవసరం ఉందనిపిస్తోంది.

'సుప్రీం' అధికారాలు...

ఈ విషయం అలా ఉంచితే, రాష్ట్రాల చట్టసభలు ఆమోదించిన బిల్లులను నిర్దుష్ట కాల వ్యవధిలోపే గవర్నర్లుగానీ, రాష్ట్రపతి గానీ ఆమోదించడమా లేదా తిరస్కరించడమా? ఏదో ఒకటి చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆక్షేపణ తెలుపుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. రాష్ట్రపతికి గడువు విధించడమా? రాజ్యాంగంలోనే ఆ అధికారం లేనప్పుడు సుప్రీంకోర్టు అలాంటి తీర్పు ఎలా ఇస్తుంది? ఇచ్చినా ఎలా చెల్లుబాటు అవుతుంది? అని రాష్ట్రపతి సుప్రీంకోర్టును నేరుగా ప్రశ్నించారు. రాజ్యాంగంలో కాలపరిమితి లేనప్పుడు సుప్రీంకోర్టు ఎలా కాలపరిమితి విధిస్తుందని కూడా రాష్ట్రపతి ప్రశ్నించారు. ఇదొక అసాధారణ పరిణామం! రాజ్యాంగపరంగా ఉత్పన్నమైన అతి క్లిష్టమైన సమస్య ఇది. ప్రత్యేక పరిస్థితులలో తమకు అసాధారణ అధికారాలను రాజ్యాంగం కల్పించిందని, ఆ అధికారాలతోనే రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తున్నామని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. దీంతో కొంత మంది న్యాయ నిపుణులు సుప్రీంకోర్టుకు మద్దతుగా, మరికొంత మంది రాష్ట్రపతికి మద్దతుగా తమ వాదనలు వినిపిస్తున్నారు. అయితే ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి తలెత్తడానికి ఎవరు కారణమో ముందుగా తెలుసుకోవాలి. తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. రాజ్యాంగం ప్రకారం న్యాయ వ్యవస్థ, చట్టసభలు, గవర్నర్లు, రాష్ట్రపతి ఎవరికి వారు తమ పరిధిలో స్వతంత్రంగా వ్యవహరించాలి. ఒకరి అధికార పరిధిలోకి మరొకరు చొరబడకూడదు. అయితే.. ఇటీవల దేశంలో, ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల చట్టసభల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పవచ్చు. బిల్లుల విషయం అలా ఉంచితే చట్టసభల సభ్యులు తమ సభ్యత్వాలకు రాజీనామా చేసినప్పుడు స్పీకర్లు లేదా చైర్మన్లు వాటిని ఆమోదించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. పార్టీ ఫిరాయించిన సభ్యుల విషయంలో కూడా ఇలాగే జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతమంది కాంగ్రెస్ శాసనసభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేసి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైసీపీలో చేరారు. వారి రాజీనామాలు ఆమోదిస్తే, ఉప ఎన్నికలు వస్తాయి. అదే జరిగితే అప్పటి పరిస్థితులలో వైసీపీ విజయం సాధించేది. ఈ కారణంగా సభ్యుల రాజీనామాలను అప్పటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ పెండింగ్‌లో పెట్టారు. తర్వాత రాష్ట్రం విడిపోయింది. తెలంగాణలో తెలుగుదేశం తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌ను పార్టీలో చేర్చుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంకల్పించారు. అయితే, అప్పటి గవర్నర్ నరసింహన్ తెలుగుదేశం తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో ప్రమాణ స్వీకారం చేయించడానికి నిరాకరించారు. దీంతో ఆయనతో ఉత్తుత్తి రాజీనామాను స్పీకర్‌కు అందజేయించారు. చట్టంలోని లోపాలను అలా వాడుకున్నారు. ఆ తర్వాత ఇదే ట్రిక్కును ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా వాడుకుంది. వైసీపీ తరఫున గెలిచిన భూమా అఖిల ప్రియతో ఉత్తుత్తి రాజీనామా చేయించి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రెండు రాష్ట్రాలలో సదరు రాజీనామాలు ఆమోదం పొందిందీ లేదు– ఉప ఎన్నికలు వచ్చిందీ లేదు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు శాసనమండలికి ఎన్నికైన కొంత మంది సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించి శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే, శాసనమండలి చైర్మన్‌గా ఉన్న ఆయన వైసీపీకి చెందిన వారు కావడంతో ఆయా సభ్యుల రాజీనామాలను ఆమోదించడంలేదు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం పోయి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో భారత రాష్ట్ర సమితి తరఫున గెలిచిన కొంత మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఇలా చేరిన వారిపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ అర్థిస్తూ వచ్చింది. అయినా ఫలితం లేకపోవడంతో వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఇవన్నీ అవాంఛనీయ పరిణామాలే.

ఎవరి బాధ్యత ఎంత?

చట్టసభల స్పీకర్లు, చైర్మన్‌లు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. తమ రాజీనామాలను ఎంతకూ ఆమోదించనప్పుడు సదరు సభ్యులకు ఉన్న ప్రత్యామ్నాయం ఏమిటి? న్యాయ వ్యవస్థనే కదా వారు ఆశ్రయించవలసింది? రాజీనామాల విషయంలోనైనా, ఫిరాయింపుల విషయంలోనైనా సకాలంలో నిర్ణయాలు తీసుకొని ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొనే అవసరం ఏర్పడదు కదా? అలాగే చట్టసభలు ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టుకోవడం కూడా సమర్థనీయం కాదు. అలాంటి బిల్లులు ఏవైనా రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే వాటిని తిప్పి పంపే అధికారం గవర్నర్లకు ఉంటుంది. గవర్నర్లు ఆ పని చేయకుండా నెలలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడితే చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తిని హరించడమే అవుతుంది కదా? ఈ కారణంగానే తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం, నిర్దుష్టంగా మూడు నెలల గడువులోగా బిల్లులను ఆమోదించడమో లేదా తిరస్కరించడమో చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ తీర్పు రాజ్యాంగ విరుద్ధం అని అనుకుంటే తమిళనాడు చట్టసభల స్వతంత్ర ప్రతిపత్తి పరిస్థితి ఏమిటి? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి లేని అధికారం గవర్నర్లకు ఉంటుందా? ఏ వ్యవస్థకైనా రాజ్యాంగమే గీటురాయి. రాజ్యాంగ నిర్మాతలు ఊహించని కొత్త సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. బిల్లులను ఇలా దీర్ఘకాలం ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో పెడతారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు. అలాగే చట్టసభల స్పీకర్లు, చైర్మన్లు రాజీనామాలు, ఫిరాయింపుల విషయంలో నాన్చుతారని అసలే ఊహించి ఉండరు. ఇలాంటి సందర్భాలలో జోక్యం చేసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు లేదనే అనుకుందాం. మరి వివాదాలు ఎలా పరిష్కారమవుతాయి? రాజీనామాలను కూడా ఆమోదించకపోతే సభ్యుల ప్రాథమిక హక్కులను హరించినట్టు కాదా? ఈ నేపథ్యంలో రాష్ట్రపతి సంధించిన లేఖ సంచలనమైంది. ఎవరికి వారు తమ వాదనకు కట్టుబడి ఉంటే సమస్య పరిష్కారం కాదు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు వివాదాలే ఏర్పడకుండా వ్యవహరిస్తే... ఈ పరిణామాలు తలెత్తవు కదా? రాష్ట్రపతి గానీ, గవర్నర్లు గానీ, చట్టసభల అధిపతులు గానీ ముందుగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. చట్టాలను అపహాస్యం చేయకూడదు. సమస్యను పరిష్కరించవలసినవారే సమస్యకు కారకులైనప్పుడు సుప్రీంకోర్టు కూడా పట్టించుకోకపోతే ఎలా? రాష్ట్రపతి లేఖపై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు కావచ్చుగానీ సమస్యలకు కారణమైనవారే పరిష్కారం చెబితే ఇలాంటి సున్నితమైన అంశాలపై వివాదం ఏర్పడదు!


పురుషాధిక్యతపై యుద్ధారావం

స్త్రీ పురుష సమానత్వం కోసం చలం చేసిన అసాధారణ కృషి అవిస్మరణీయమైనది. సాహిత్యంలో పురుషాధిక్య ధోరణిని చీల్చిచెండాడిన భావ యోధుడు చలం. తెలుగు సమాజంలో ఛాందసత్వాన్ని కూకటివేళ్ళతో పెకలించడానికి పూనుకున్న సాంఘిక విప్లవకారుడు. నిత్యం సగటు మనిషిని పీల్చి పిప్పి చేస్తున్న అనేక దురాచారాలను నిష్కర్షగా నిలబెట్టి తన అక్షర జ్వాలలతో నిలువునా తగలబెట్టిన దార్శనికుడు చలం. 'జీవితాన్ని జీవితంగా మొట్టమొదట తెలుగువాళ్ళకి చూపించిన తెలుగు కథకుడు చలం' అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. 'తెల్లారి లేస్తే పప్పు, పిడకలు, మళ్ళు, చీదరలు, అలుకులు, అధికారాలు, మూలుగులు, మురుకులు, ఇవన్నీ వొదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనోవ్యవధి, సంతోషం, ఉత్సాహం ఎప్పుడు కలుగుతుంది మానవులకు?'... ఇలా ఒక జీవితకాలం ప్రశ్నని వేయగల రచయిత నాటికి నేటికీ చలం ఒక్కడే.

1925లో చలం 'Man and Woman' (Excluding The Aspect of Love)' అనే విశిష్ట రచననొకదాన్ని చేశారు. దీన్నే ఆ తర్వాత ఆయన 'స్త్రీ'గా విస్తరించి తెలుగు సమాజంలో ఒక విప్లవాత్మక భావ సంచలనం సృష్టించారు.

చలం 'స్త్రీ' కేవలం స్త్రీలకి మాత్రమే పరిమితం చేసిన రచన కాదు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, లైంగిక, ఆరోగ్య, సాంస్కృతిక అంశాల విశ్లేషణాత్మక శోధన. ఈ నాటికి చలం 'స్త్రీ'లోని విషయాలు ఎంతో అపురూపమైనవిగా అనిపిస్తాయి. ఒక ఆసక్తికర విషయాన్ని ప్రస్తావించాలి. 1925లో ప్రపంచ మేధావి బెర్ట్రాండ్ రస్సెల్ 'వాట్ ఐ బిలీవ్?' అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. స్త్రీ పురుష సంబంధాలు మొదలుకుని మనిషి నైతిక ప్రమాణాలు, సాంఘిక కార్యాచరణ మరెన్నో విషయాల్ని అందులో ఆయన చర్చించాడు. రస్సెల్ రచనకి విశేష ఆదరణ లభించింది. అదే ఏడాది చలం సూటిగా స్పష్టంగా రాసిన 'స్త్రీ' సంగతి మాత్రం కొద్దో గొప్పో చలం సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి మినహా వేరేవరికి సరిగా తెలియను కూడా తెలియదు కదా. 'స్త్రీ' రచనకి మూలమైన, చలం ఏకైక ఆంగ్ల రచన 'Man and Woman'ను 'పురుషుడు–స్త్రీ'గా 2014లో పిఠాపురానికి చెందిన 'ప్రకృతి ప్రచురణలు' తెలుగులోకి తీసుకువచ్చేంత వరకు అసలు అలాటి రచనొకదాన్ని చలం చేశారని చాలా మందికి తెలియదు. పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన చలం రచనలు ఇప్పటికీ చాలా మందికి నిషిద్ధాలుగా ఉన్నాయి. అటు సంప్రదాయవాదులు, ఇటు ఆధునికులు, ఒకవైపు పాలకులు, మరోవైపు మేధావులు కలిసికట్టుగా మౌనం పాటించినా, చలం సాహిత్యాన్ని సమాజం ఆదరిస్తూనే ఉన్నది. ఎందుకంటే, లోకంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలు ఎన్నింటికో సమాధానాలు, పరిష్కారాలు చలమే చెప్పగలడు, చూపగలడు కాబట్టి.

వంద సంవత్సరాల క్రితం వెలుగు చూసిన 'స్త్రీ' చలం సాహిత్య సారాన్ని విశదం చేసే విశిష్ట రచన. తెలుగు సమాజంలోని ప్రగతిశీల ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని ఒక చారిత్రక దార్శనిక పత్రంగా గుర్తించడంలో ఎందుకు విఫలమయ్యారు?




వంద సంవత్సరాల క్రితం వెలుగుచూసిన 'స్త్రీ' చలం సాహిత్య సారాన్ని విశదం చేసే విశిష్ట రచన. మరి తెలుగు సమాజంలోని ప్రగతిశీల ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని ఒక చారిత్రక దార్శనిక పత్రంగా గుర్తించడంలో ఎందుకు విఫలమయ్యారు? వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఎన్నడూ భాగం కాని స్త్రీ స్వేచ్ఛని, స్త్రీ పురుష సమానతని, జీవన సౌందర్యాన్ని, ప్రకృతి పారవశ్యాన్ని అన్నిటికీ మించిన మహోన్నత మానవతావాదాన్ని తన మార్గంగా అమలు చేసిన చలాన్ని కనీసం అర్థం చేసుకోవడంలో కూడా అన్యాయమైన వైఖరిని అవలంబించడం దారుణం. ప్రతీ భారతీయ భాషలోకి తర్జుమా చేయాల్సిన చలం 'స్త్రీ' ఈనాటికీ ఎవరో కొద్దిమందికి మినహా తెలుగువారికే తెలియకపోవడం మన వెనుకబాటుతనానికి నిదర్శనం. కులమతాల కుళ్ళుని, వాదాల గోడలను పూర్తిగా నిరాకరించిన చలం చివరికి ఎవరివాడూ కాకుండా మిగిలిపోయాడు. చలాన్ని మరచిపోతే అది సమాజానికి నష్టం కానీ చలానికి కాదు. ఎందుకంటే తెలుగులో చలం పురోగామి చైతన్యానికి చిహ్నం. ఆ చైతన్యం లోపించిన ఏ సమాజంలో అయినా పురోగతి శూన్యం.

కవిగా, రచయితగా, అనువాదకుడిగా, సామాజిక ఆలోచనపరుడిగా, సంఘసంస్కర్తగా, వ్యంగ్య వ్యాఖ్యాతగా, మహిళా పక్షపాతిగా, తిరుగులేని అధ్యయనవేత్తగా, సమానతా ఉద్యమ నిర్మాతగా అన్నింటికి మించి కళాత్మకత కలిగిన రసైకజీవిగా, గుణాత్మకత రగిలిన స్వాప్నికుడిగా, నిత్య సత్యాన్వేషణా పథంలో పయనించిన మానవీయ సౌందర్యారాధకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా, సౌహార్థిక చింతనశీలిగానే చలాన్ని గుర్తించడం సబబు. అలా, తెలుగులో ఎవరూ గుర్తించని మొదటి కళాత్మక అనార్కిస్టు చలమే.

మనిషి జీవితంలో లైంగికత ఒక దైనందిన వాస్తవం. సెక్స్ గురించిన సరైన అవగాహన లేకపోవడమే మానసిక, శారీరక సమస్యలకు ప్రధాన కారణం. ఈ సత్యాన్ని తెలుగు సమాజంలో గుర్తించిన మొదటి మేధావి చలం. మానవ జీవితంలోని కృత్రిమత్వాన్ని ఎండగట్టి, ఉద్యమ స్థాయిలో స్త్రీ స్వేచ్ఛ కోసం గొంతెత్తిన చలం లాంటి రచయితలు దేశంలోనే అరుదు. ఏ రాజకీయ సామాజిక సిద్ధాంతం జోలికి పోకుండానే ప్రజాస్వామిక విధానాన్ని తనదైన శైలిలో ప్రచారోద్యమంగా తెలుగులో నిర్మించిన ఘనత చలానిదే. మబ్బుల మాటున దాగిన నింగిలో నిబిడీకృతమైన ఎన్నెన్ని అరుదైన రంగురంగుల ఇంద్రధనుస్సుల్ని వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేశాడు? చలం లేని లోకం ఎన్నటికైనా స్వేచ్ఛా గీతాన్ని వినగలిగేదా? సప్తవర్ణాల్ని చూడగలిగేదా? మహిళల్ని, మల్లెపూలను, పిల్లల్ని, పిల్లగాలులను, సూర్యోదయాన్ని, సూక్ష్మమైన జీవిత సారాలను అర్థం చేసుకోగలిగేదా? అందుకనే, చలం వంటి జీవన ఋషి మరెక్కడా కానరాడు. అలాటి చలం, ఆయన రచనలు, జీవితం, చేసిన సుదీర్ఘ పయనం, తప్పొప్పులు అన్నీ తెలుగు జాతి విశిష్ట సంపద. వాటి వెలుగులో అసమానతల గోడల్ని కూలుస్తూ, సమతా మమతల సమాజాన్ని నిర్మించుకోవడమే చలానికి, ఆయన 'స్త్రీ'కి, మన తరం ఇవ్వాల్సిన నివాళి.

▪ గౌరవ్

(నేడు చలం జయంతి. ఈ ఏడాది ఆయన 'స్త్రీ'కి శత వసంతం)





సండే స్పెషల్

రంగస్థలంపై యువ ఇంజనీర్లు!

పద్యనాటకాలకు ఊపిరిలూదుతూ సరికొత్త పాత్ర పోషణ

- తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను చాటుతున్న కళాకారులు
- వృత్తిలో రాణిస్తూ.. ప్రవృత్తికి ప్రాణం పోస్తూ.. ముందుకు

వృత్తిలో రాణిస్తూ.. ప్రవృత్తి(కళారంగం)కి ప్రాణం పోస్తూ ముందుకు సాగుతున్నారు పలువురు యువ ఇంజనీర్లు. మరుగున పడుతున్న పద్య నాటకాలకు ఊపిరిలూదుతూ తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను భావి తరాలకు చాటి చెబుతున్నారు. నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు మన జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్, పి.సాయిసౌమ్య, చింతా డూండీ కృష్ణ.

చింతా డూండీ కృష్ణ

6

నైపుణ్యంతోనే శిఖరాగ్రం

- స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకు ఉపాధి
- ఐటీఐ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్
- 1644 సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- నైపుణ్య శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు

8

బంగారం మాయ!

హోల్‌సేల్ పేరుతో కస్టమర్లకు ఎర

జీఎస్టీ, తక్కువ తరుగు అంటూ అమ్మకాలు

- రంగు రాళ్లు, బంగారం కలిపి బరువు లెక్కిస్తూ ధర వసూలు
- బ్యాంకులో రుణం కోసం ఓ మహిళ వెళ్తే బయటపడ్డ అసలు విషయం
- పోలీసులను ఆశ్రయిస్తే.. రాజీకి వచ్చిన వ్యాపారి!



వన్‌టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): బంగారం అమ్మకాల్లో వ్యాపారులు రకరకాల లెక్కలు చెప్పి ఆభరణాలకు ధరలు నిర్ణయిస్తుంటారు. వీటి హేతబద్ధత గురించి సరైన వివరాలు మాత్రం ఉండవు. కార్పొరేట్ షోరూమ్‌ల్లో బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తే తరుగు, మజూరి, జీఎస్టీ పేరుతో కొంత అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఈ క్రమంలో విజయవాడ హోల్‌సేల్ మార్కెట్‌లో కొత్త దందా నడుస్తోంది. బంగారు ఆభరణాల విక్రయాల్లో విజయవాడ, వన్‌టౌన్, గవర్నర్‌పేట మార్కెట్‌లో తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా గవర్నర్‌పేట జైహింద్ మార్కెట్‌లోని బంగారు దుకాణాలలో బంగారు ఆభరణాలు అత్యధికంగా విక్రయిస్తుంటారు. షోరూమ్‌లలో ఉండే మిగతా 6లో..

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

బంగారు ఆభరణాల తయారీలో తరుగు 18 శాతం వరకు ఉంటుందని, మేకింగ్ చార్జీలు, డిజైనింగ్ చార్జీలు, జీఎస్టీతో పాటు రాళ్ల బరువు క్యారెట్లలో లెక్కించిన తాము హోల్‌సేల్‌గా విక్రయించిన ధర కంటే ఎక్కువే అవుతుందని దుకాణదారుడు బాధితురాలిని నవిస్వించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆభరణాలలో రాళ్ల బరువును విడిగా లెక్కిస్తారని, సాధారణ రంగురాళ్లకు బరువుతో సమానంగా ధర వసూలు చేయరని ప్రముఖ వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు నిరాకరించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

అవినీతి కంపు!

కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ నిర్వాకం!

'మంది ఎక్కువైతే.. మజ్జిగ పలచన' అన్నట్టుగా తయారైంది కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ పరిస్థితి. సిఫార్సులు, డిప్యుటేషన్లు, రికమండేషన్లతో ప్రజారోగ్యశాఖ పరిధిలో తిష్ట వేస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఏ స్థాయిలో అంటే.. మంజూరు చేసిన పోస్టుల సంఖ్య కంటే కూడా అదనంగా ఉంటున్నారు. పోనీ, ఆ స్థాయిలో అయినా ప్రజారోగ్యశాఖ పనితీరు మెరుగు పడిందా అంటే మరింత తీసికట్టుగా మారిపోయింది. విచ్చల విడి అవినీతి, దోపిడీలకు అడ్డాగా తయారైంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మంజూరైన పోస్టులు 150.. పనిచేస్తున్నది 511 మంది
- లీడ్ మేస్త్రీల పేరుతో ఆర్డర్ లేకుండా 154 మంది నియామకం
- సిఫార్సులతో అదనంగా మరో 41 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- సచివాలయ శానిటరీ కార్యదర్శులకు జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా విధులు
- కాసుల వేటలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు!
- ప్రజారోగ్యశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజారోగ్య విభాగంలో ఒక ప్రధాన ఆరోగ్య అధికారి (సీఎంవోహెచ్), ఇద్దరు సహాయ ఆరోగ్య అధికారులు (ఏఎంవోహెచ్‌లు), శానిటరీ సూపర్ వైజర్లు ఆరుగురు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 32 మంది, హెల్త్ అసిస్టెంట్స్-24 మంది, శానిటరీ మేస్త్రీలు 85 మంది పోస్టులు శాంక్షన్‌గా ఉన్నాయి. మొత్తంగా ఈ పోస్టుల్లో 150 మంది సిబ్బంది ఉండాల్సి ఉంటే ప్రస్తుతం 511 మంది పనిచేస్తున్నారు. సుమారు మూడు రెట్లు అదనంగా ఉన్నారు. శానిటరీ మేస్త్రీలు 88 మంది, సచివాలయ కార్యదర్శులు 260 మంది, లీడ్ మేస్త్రీలు 154 మంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 73 మంది చొప్పున పనిచేస్తున్నారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజారోగ్యశాఖలోకి వీరంతా ఎలా వచ్చారో చూస్తే.. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో శానిటరీ కార్యదర్శులను నియమించటం జరిగింది. వీరిని వార్డు సచివాలయాల కోసం నియమిస్తే.. కార్పొరేషన్ అధికారులు వీరిని ప్రజారోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పనులు చేసే విధంగా వాడుకుంటున్నారు. ఒకరకంగా వారి జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా ఉపయోగిస్తున్నారు. వీరంతా కూడా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు. ఒక్కసారిగా 260 మంది వచ్చారనుకుంటే.. ఆ తర్వాత కాలంలో లీడ్ మేస్త్రీల పేరుతో మరో 154 మందిని తీసుకున్నారు. దీనికి ఒక ఆర్డర్ కూడా లేదు. శానిటరీ కార్యదర్శులను పోనీ వారి జాబ్ చార్ట్ ప్రకారం వారిని వార్డు సచివాలయాలలో పనిచేయమని నిర్దేశించారంటే అదీ లేదు.

వసూలు రాజాలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు!

కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అవినీతిమయమైపోయిందని విమర్శలు వస్తున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కాసుల వేటలో పడి ప్రజల ప్రాణాలను కూడా పణంగా పెట్టే పనులు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. భవానీపురంలో ఓ ప్రైవేటు ఎగ్జిబిషన్ నిర్వాహకుల దగ్గర దండిగా మిగతా 6లో..

పైరవీలతో వచ్చేశారు..

లీడ్ మేస్త్రీల పేరుతో రాజకీయ సిఫార్సులు, రికమండేషన్లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు సూచించిన వారందరికీ ఎడాపెడా ఇచ్చేశారు. కనీస అర్హతలు లేని వారినే ఎక్కువగా లీడ్ మేస్త్రీలుగా తీసుకున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా మరో 41 మందిని అదనంగా తీసుకున్నారు. నగరంలో ప్రతి 40 వేల జనాభాకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉండాలన్నది మునిసిపల్ చట్టం చెబుతోంది. విజయవాడ నగర జనాభా 13 లక్షలుగా ఉంది. ఈ లెక్కన చూస్తే.. మంజూరు చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నగరావసరాలకు సరిపోతారు. కానీ అదనంగా 15 లక్షల జనాభాకు అనుగుణంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించుకోవటం గమనార్హం. క్షేత్ర స్థాయిలో శానిటరీ మేస్త్రీలు కూడా 85 మంది ఉంటే సరిపోతుంది. శానిటేషన్, మలేరియా, నైట్ శానిటేషన్, సిల్ట్, జక్కంపూడి, పాతపాడులలో వీరంతా సరిపోను పనిచేస్తున్నారు. లీడ్ వర్కర్ల పేరుతో అదనంగా నియమించుకోవాల్సిన అవసరం లేదు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న శానిటేషన్ సిబ్బంది కారణంగా పని తీరు అయినా మెరుగుపడిందనుకుంటే అత్యంత దారుణంగా తయారైంది.

ప్రాణం తీసిన అరెస్టు భయం

రొయ్యూరు - మద్దూరు లంకలో పేకాట శిబిరం

దాడి చేసిన తోట్లవల్లూరు పోలీసులు

- కృష్ణానదీపాయలోకి పరారవుతూ నీటిమడుగులో దూకిన ఇద్దరు
- మునిగిపోయి ఒకరు మృతి.. మరొకరు క్షేమం
- పోలీస్ స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన

6



గోపాలం(ఫైల్)



జిల్లా రెవెన్యూ ఆఫీసర్, అదనపు మేజిస్ట్రేట్ ఎం.లక్ష్మీనరసింహానికి వినతిపత్రం అందిస్తున్న రైతు నాయకుడు జమలయ్య, బాధిత రైతులు

బాధిత రైతుల్ని ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ ఆఫీసర్, అదనపు మెజిస్ట్రేట్ ఎం.లక్ష్మి నరసింహంను కలిసి జరిగిన విషయాన్ని లిఖిత పూర్వకంగా వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ విత్తన కంపెనీ నాణ్యత లేని విత్తనాలు సాగు చేసిన రైతులంతా కౌలు రైతులని, వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులు లేక బ్యాంకుల నుంచి రుణాలు సైతం లభించక బయట వ్యక్తుల వద్ద రూ.2 ల వడ్డీకి తెచ్చి పంట సాగు చేసి నష్టపోయారన్నారు. బాధిత రైతులు ఐదుగురికి విత్తన కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

విత్తన కంపెనీ మోసం

సీడ్ ఉత్పత్తి చేసేందుకు రైతులతో ఒప్పందం

- వారి సూచనల మేరకే సాగు.. తగ్గిన దిగుబడి
- అగ్రిమెంట్ ప్రకారం పరిహారం ఇవ్వాలన్న రైతులు
- తప్పించుకు తిరుగుతున్న కంపెనీ ప్రతినిధి
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు

ఇబ్రహీంపట్నం/విస్సన్నపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మాయ మాటలతో నమ్మించి నాణ్యత లేని విత్తనాలు అంటగట్టి, దిగుబడి రాకుంటే పరిహారం ఇస్తామని లిఖిత పూర్వకంగా అగ్రిమెంట్ చేసి, చివరకు ముఖం చాటేసి తిరుగుతున్న ఓ విత్తన కంపెనీ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం కొత్త మంగాపురం, పాత మంగాపురం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులతో 54 ఎకరాల్లో విస్సన్నపేటలోని ఓ విత్తన కంపెనీ ఆర్గనైజర్ మన్మథరావు సీడ్ ఉత్పత్తి చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. తమ కంపెనీ సీడ్ విత్తనాలు మీరు సాగు చేస్తే ఎకరానికి మూడు టన్నులు పైగా దిగుబడి వస్తుందని, టన్ను రూ.28 వేలకు కొనుగులు చేస్తామని, ఒక వేళ సక్రమంగా రాకపోతే ఎకరానికి రూ.80 వేలు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి లిఖిత పూర్వకంగా అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆ పత్రాలను తన వద్దే ఉంచుకున్నాడు. మన్మథరావు మాటలు నమ్మి, అగ్రిమెంట్ మీద విశ్వాసంతో కాసాని శ్రీనివాసరావు నాలుగు ఎకరాలు, కొప్పూరి వెంకట నారాయణ ఐదు ఎకరాలు, బండి ధనలక్ష్మి ఎనిమిది ఎకరాలు, కొప్పూరి చంటి 30 ఎకరాలు, గోళ్ల వెంకటేశ్వరరావు ఏడు ఎకరాల్లో పంట పండించేందుకు ఈ ఏడాది రబీలో ఒప్పందం చేసుకున్నారు. కంపెనీ వారే ఎకరానికి రూ.20 వేలు చొప్పున పెట్టుబడి కూడా ఇచ్చారు. ఏప్రిల్‌లో పంట చేసికొచ్చింది. అయితే ఒప్పందంలో పేర్కొన్న దిగుబడి రాలేదు. మన్మథరావు చెప్పిన విధంగా అన్ని రకాల సస్యరక్షణ చర్యలు పాటిస్తూ విత్తనాన్ని సాగు చేసినా దిగుబడి తక్కువే వచ్చింది. ఒకరిద్దరికి మాత్రమే టన్ను నుంచి టన్నున్నర దిగుబడి వచ్చింది. దీంతో రైతులు వారి తీసుకున్న విత్తనం నాణ్యత లేదని గ్రహించారు. దీంతో సీడ్ ఆర్గనైజర్ మన్మథరావుకు ఫోన్ మిగతా 6లో..

తాత్సారం!

వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులో అధికారుల నిర్వాకం

- సాగునీటి పథకాలకు రూ.15 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు
- అంచనాల రూపకల్పనలో అంతులేని జాప్యం చేస్తున్న అధికారులు
- ఖరీఫ్‌కు నీరు అందదేమోనని రైతుల్లో ఆందోళన



అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న వేదాద్రి- కంచల ఎత్తిపోతలు

ముఖ్యమంత్రి నిధులిచ్చినా అధికారుల అలసత్వం ఎత్తిపోతల పథకాలకు శాపంగా మారింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురై పూర్తిగా మూలనపడిన వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.15 కోట్లు ప్రకటించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి రానున్న ఖరీఫ్ సీజన్‌కు నీరందించాలని అధికారులను ఆదేశించారు. కానీ ఆ ఆదేశాలను అమలు చేయడంలో ఐడీసీ అధికారులు ఒకింత నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిధులు సిద్ధంగా ఉన్నా అంచనాలు, రిమార్కులు అంటూ ఫైల్‌ను అక్కడికి ఇక్కడికి తిప్పుతూ తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. ఇదే తీరు కొనసాగితే ఖరీఫ్‌కు నీరందడం అనుమానమేనని రైతులు పేర్కొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, నందిగామ): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక నిర్మాణంగా వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాలను చెప్పవచ్చు. కృష్ణానదిపై వేదాద్రి వద్ద అత్యంత లోతైన ప్రదేశం వద్ద ఈ పథకం నిర్మించారు. నది నుంచి ఇరవై మీటర్ల ఎత్తులో మోటార్లు ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి 110 మీటర్ల ఎత్తు ఉన్న కొండపైకి పైప్‌లైన్ ద్వారా నీటిని తోడి పోస్తారు. అక్కడ నుంచి 4.5 కిలో మీటర్లమే గ్రావిటీతో ప్రయాణించిన నీరు ఎన్ఎస్‌పీ కాలువలో కలుస్తుంది. రెండు దశాబ్దాల క్రితం అత్యంత ఆధునిక, మిగతా 6లో..

వైసీపీ రాకతో మూలనపడ్డ మోటార్లు

ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలను నిర్లక్ష్యం చేసింది. ఈ పథకాల విలువ తెలియని పాలకవర్గం ఉన్న నిధులు కాజేసి పథకాన్ని నిర్వీర్యం చేసింది. నాలుగు మోటార్లు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఫలితంగా ఐదేళ్లుగా ఆయకట్టుకు చుక్క నీరందించని స్థితి నెలకొంది. ఈ తరుణంలో ఏప్రిల్ 5న నియోజకవర్గంలోని ముప్పాళ్ల వచ్చిన చంద్రబాబుకు ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్, పార్టీ ముఖ్యనాయకులు ఈ పథకం గురించి వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు పథకం మరమ్మతులకు రూ.15 కోట్లు కేటాయిస్తూ ప్రకటన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఖరీఫ్ నాటికి నీరందించాలని సూచించారు.



మూలనపడ్డ మోటార్లు

ప్రత్యామ్నాయం అవసరం

వేదాద్రి- కంచల ఆయకట్టుకు పథకం నుంచి సకాలంలో నీరు అందించడం ప్రశ్నార్థకమైన వేళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఐడీసీ అధికారులు ఇక నుంచి వేగంగా పనులు చేపట్టినా సెప్టెంబరు మాసం వరకూ మోటార్ల ఏర్పాటు ప్రక్రియ పడుతుంది. ఈలోగా సాగు అవసరాలకు నీరు అందించే ప్రణాళికను ఎన్ఎస్‌పీ అధికారులు చేపట్టాల్సి ఉంది. గౌరవరం బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న ఈ పథకం ఆయకట్టుకు చెరువు మాధవరం ట్యాంక్ నుంచి నీటిని అందించాల్సి ఉంది. తెలంగాణలో ఉన్న ఈ ట్యాంక్ నుంచి నిబంధనల ప్రకారం ఆగస్టు 20 తర్వాతే నీరు విడుదలవుతుంది. అప్పటి వరకూ నీటి అవసరాలు తీర్చేందుకు గాను తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి మూడు టీఎంసీల నీటిని విడుదల చేయించాల్సి ఉంది. లేని పక్షంలో ఈ ఏడాది కూడా ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలాలేవు.

తిరువూరులో మారుతున్న రాజకీయ సమీకరణాలు

- శుక్రవారం రాత్రి క్యాంప్‌నకు మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు

6

యువతను దేశ సేవకులుగా తీర్చిదిద్దుతాం

- ఆసక్తి ఉన్న యువత వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి
- నోటిఫికేషన్ విడుదల చేసిన నెహ్రూ యువ కేంద్రం

6

కొండపల్లి బొమ్మల ఖ్యాతిని చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

బియ్యం దొంగ పేర్ని నాని

● మంత్రి కొల్లు రవీంద్రపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

● త్వరలో ఆయన జాతకమంతా బయటకొస్తుంది

● టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి పేర్ని నానీ..బియ్యం దొంగ. త్వరలో ఆయన జాతకాన్ని బయటపెడతాం. మంత్రి కొల్లు రవీంద్ర ఇంటి పక్కన బెల్టుషాపు ఉందంటూ ఆయనపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారు. అసత్యప్రచారం మానుకోవాలి'. అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ హితవు పలికారు. శనివారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం లో విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నానీతో కలిసి గోపీచంద్ మాట్లాడారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, ధర్మారెడ్డి మాటలు వినేవారన్నారు. అయినా వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పేర్ని నానీ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బందరు పోర్టు నిర్మించకపోతే రాజకీయాల నుంచి విరమించుకుంటానని చెప్పి మాట తప్పారన్నారు. ఏదో ఒకటి మాట్లాడితే గానీ మీడియాలో గుర్తింపు ఉండదని భావించి కొల్లు రవీంద్రపైన అసత్యాల బురద చల్లుతున్నారన్నారు. వైసీపీ హయాంలో గంజాయి, నాటుసారా విస్తృతంగా అమ్మకాలు జరిగాయని, కొల్లు రవీంద్రను విమర్శించే నైతిక హక్కు పేర్ని నానీకి లేదని కుంచే నాని అన్నారు. మచిలీపట్నాన్ని మంత్రి అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేక పేర్ని నానీ మతిస్థిమితం కోల్పోయారని, ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, కొల్లు రవీంద్రపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు ఖాజా, రత్నాకర్, గోకుల శివ, కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, దేవరపల్లి అనిత డిమాండ్ చేశారు.

పేదల బియ్యం మెక్కింది చాల్లేదా..

నిజాయితీపరుడు రవీంద్రపైనే విమర్శలా?

● పేర్ని నానీ వ్యాఖ్యలపై టీడీపీ అవనిగడ్డ నాయకులు ఆగ్రహం

అవనిగడ్డ, మే 17(ఆంధ్రజ్యోతి): పేదల బియ్యాన్ని మెక్కింది చాలక నిజాయితీపరుడైన మంత్రి కొల్లు రవీంద్రపైనే విమర్శలు చేస్తావా? అంటూ మాజీ మంత్రి పేర్ని నానీపై టీడీపీ అవనిగడ్డ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి రవీంద్రపై శుక్రవారం పేర్ని నాని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం పార్టీ నియోజకవర్గ కార్యాలయం లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా పని చేసి కొల్లు రవీంద్ర అందరి మన్ననలు పొందారని, కూటమి ప్రభుత్వంలోనూ ఎలాంటి ఆరోపణలు లేకుండా పని చేస్తున్నారని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో భార్య పేరుతో గోడౌన్లు తీసుకుని అందులో ప్రభుత్వం నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని దిగమింగిన పేర్ని నాని.. నిజాయితీపరుడైన కొల్లు రవీంద్రపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రవీంద్రను డమ్మీ మంత్రి అని వ్యాఖ్యానించటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. బలహీనవర్గాలపై ఆ పార్టీకి ఉన్న గౌరవాన్ని ఈ వ్యాఖ్యలే తేటతెల్లం చేస్తున్నాయన్నారు. రవీంద్రపై అవినీతి పరుడైన పేర్ని విమర్శలు చేయటం సిగ్గుచేటని, ప్రజలు ఆయన కుమారుడిని, వైసీపీని ఓడించి పక్కన పెట్టినా ఇంకా జ్ఞానోదయం కలగలేదని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ పాలక మండలి మాజీ సభ్యురాలు విశ్వనాథపల్లి పాప విమర్శించారు.

తిరువూరులో మారుతున్న

రాజకీయ సమీకరణాలు

● శుక్రవారం రాత్రి క్యాంప్‌నకు మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): తిరువూరు చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి తన పదవికి రాజీనామా చేయడంతో ఈనెల 19న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక జరగనుంది. దీంతో పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. దీంతో ఏం జరుగుతుందోనని రాజకీయ ఉత్కంఠ పట్టణ ప్రజల్లో ఉంది. ఎవరు చైర్‌పర్సన్‌గా ఎంపికవుతారోనని పట్టణవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజకీయ సమీకరణాల్లో మార్పుల కారణంగా వైసీపీ నాయకత్వం ఇప్పటికే కొందరు కౌన్సిలర్లను పట్టణం దాటించింది. శుక్రవారం రాత్రి మరి కొందరు కౌన్సిలర్లను క్యాంప్‌నకు తరలించింది. బోర్డులో మొత్తం 17 మంది వైసీపీ సభ్యులున్నా ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆపార్టీ బలం తగ్గే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో వైసీపీ అధిష్టానంలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు పార్టీని వీడుతున్నట్టు జరుగుతున్న ప్రచారం ఆ పార్టీలో ప్రకంపనలు పుట్టిస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మునిసిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ, ఇతర పార్టీల నుంచి కొందరు కౌన్సిలర్లుగా పోటీచేసేందుకు నామినేషన్లు వేస్తే అప్పట్లో వైసీపీ నాయకులు, అభ్యర్థుల్ని బెదిరించి పోటీనుంచి విరమింపజేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, వైసీపీ కౌన్సిలర్లు అధికార పార్టీవైపు చూడటం తప్పులేదని కొందరు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

దుర్గగుడిలో ప్రొటోకాల్

దర్శనాలు క్రమబద్ధీకరిస్తాం

● ఈవో శీనా నాయక్ ప్రకటన

ఇంద్రకీలాద్రి, మే 17(ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ప్రొటోకాల్ దర్శనాలు క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఈవో శీనా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరికీ సులభంగా అమ్మవారి దర్శనం కల్పించడం కోసం భద్రత, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఒక క్రమ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వివిధ శాఖల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి వస్తున్న విన్నపాల ప్రకారం ప్రొటోకాల్ దర్శనాలు జరుగుతున్నాయని, అయితే వాటిని మరికొంత మెరుగ్గా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చే వారంతా దరఖాస్తును పూర్తిచేసి దేవస్థానం అధికారులకు ఇవ్వాలని సూచించారు. దర్శనం తేదీ, ఎప్పుడు.. ఎంత మంది వస్తున్నారు. దర్శనానికి వచ్చే ప్రధాన వ్యక్తి పేరు, ఫోన్ నెంబరు, వచ్చే వాహనం వివరాలు పూర్తి చేయాలన్నారు. ఆ మేరకు ప్రొటోకాల్ దర్శనాలను క్రమబద్ధీకరిస్తామని, దీంతో పాటు పారదర్శకత కూడా ఉంటుందని తెలిపారు. భద్రతా కారణాల రీత్యా తప్పనిసరిగా ఈ విధానాన్ని అమలు చేయాలని ఆయన సిబ్బందికి ఆదేశాలిచ్చారు. వచ్చిన విన్నపాల్లో వారి స్థాయి ప్రకారం ప్రొటోకాల్ విభాగం పరిశీలించి దర్శనం ఏర్పాట్లు చూస్తుందన్నారు.

సిలబస్‌లో మార్పులు తీసుకురండి

● ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధకు చరిత్ర అధ్యాపకుల వినతి



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

పాయకాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): చరిత్ర సిలబస్‌లో మార్పులు తీసుకు రావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు శనివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ చరిత్రకు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం చరిత్ర సిలబస్‌లో పలు మార్పులు చేసిందని సభ్యులు ఆమెకు వివరించారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా చరిత్ర సిలబస్‌లో మార్పులు చేసి ప్రాంతీయతకు పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాయింట్ సెక్రటరీ గోవిందు సురేంద్ర, సభ్యులు రాజ్ మహ్మద్, బడే సాహెబ్ పాల్గొన్నారు.

వృత్తిలో రాణిస్తూ..ప్రవృత్తికి ప్రాణం పోస్తూ..



రంగస్థలంపై యువ ఇంజనీర్లు

● పద్యనాటకాలకు ఊపిరిలూదుతూ సరికొత్త పాత్ర పోషణ

● తెలుగు సంస్కృతి మూలాల విశిష్టతను చాటుతున్న కళాకారులు

తెలుగు పద్య నాటకం.. కళారూపం మాత్రమే కాదు. తెలుగు సంస్కృతికి శబ్దస్వరూపం. మన మూలాల చప్పుడు. విలువల పరిమళం. రంగస్థలాలపై వెండితెరలు, సోషల్ మీడియాలు ఆధిపత్యం చేస్తున్న రోజులివి. ఇలాంటి తరుణంలో పద్య నాటకానికి ప్రాణం పోస్తూ తమ భుజాన మోస్తూ కొత్త ప్రపంచానికి దాని గొప్పతనాన్ని పరిచయం చేస్తున్నారు కొందరు యువ ఇంజనీర్లు. ఇంజనీరింగ్ ల్యాబ్‌లు, సాఫ్ట్‌వేర్ బోర్డురూమ్‌లు, యూనివర్సిటీ అధ్యాపకుల గదులు ఇవి వారి జీవన రంగాలు. అయినా ఖాళీ సమయంలో పద్య నాటకాలు సాధన చేస్తూ కళను సజీవంగా ఉంచడం కోసం రంగస్థలాన వారు సరికొత్త పాత్ర పోషిస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్

పద్యనాటకాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పం



కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్

పౌరాణిక పద్యనాటక రంగంలో ఎంతో కీలకమైన సంగీత విభాగానికి హార్మోనిస్టుగా పాతికేళ్లుగా సేవలందిస్తూ కళాసాధన చేస్తున్నారు జొన్నలగడ్డ శ్రవణ్ కుమార్. ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేసి, ప్రస్తుతం చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారాయన. ప్రవృత్తిరీత్యా ఎనిమిదేళ్లుగా డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి అధినేత డాక్టర్ పి.వి.ఎన్. కృష్ణ మార్గదర్శకత్వంలో అనేక పద్యనాటకాలకు సంగీత సహకారం అందించారు. 2023లో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో విజ్ఞాన భారతం సాంఘిక నాటకానికి ఉత్తమ రంగాలంకరణ విభాగంలో నంది అవార్డు వచ్చింది. దూరదర్శన్, ఆకాశవాణి వేదికలపై పౌరాణిక పద్యనాటకాలకు సంగీత దర్శకత్వం వహిస్తూ, హార్మోనియం వాయిస్తుంటారు. తండ్రి, శ్రీ రామకృష్ణ నాట్యమండలి అధినేత జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు ఈ రంగంలో శ్రవణ్‌ను పరిచయం చేసి, సంగీతం నేర్పించి, ఒక హార్మోనిస్టుగా, సంగీత దర్శకుడిగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటి వరకు 20కు పైగా పద్యనాటకాలకు సంగీతం సమకూర్చి, 1000 ప్రదర్శనలకు సంగీత సహకారం అందించారు. డాక్టర్ పి.వి.ఎన్. కృష్ణ శిక్షణలో యువ కళాకారులను తీర్చిదిద్దుతూ, పద్యనాటకాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. సంస్కార భారతి విజయవాడ మహానగర్ ప్రధాన కార్యదర్శిగా, శ్రీ రామకృష్ణ నాట్యమండలి సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శిగా, శ్రీ సాయిబాబా నాట్యమండలి, భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్లకు సహకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సమాజానికి మంచి సందేశం చేరాలనే తపన



టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పి. సాయిసౌమ్య

పి. సాయిసౌమ్య.. పాఠశాలలో చదివే రోజుల్లోనే తన తల్లి ప్రోత్సాహంతో చిన్న చిన్న స్కిట్స్ లో నటించేవారు. అప్పుడే నటనంటే ఆమెకు ప్రత్యేకమైన ఆసక్తి కలిగింది. చదువు పూర్తయ్యాక, టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరారు. కళాకారుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ కుమారుడు, సంగీత నాటక కళాకారుడు పి.సాయిశంకర్‌ను వివాహమాడారు. వివాహం తర్వాత వారి ఇంట్లో తరచూ నాటకాలు, కళాపరమైన కార్యక్రమాలు జరుగుతుండేవి. 'శ్రీ మాధవ వర్మ' నాటకంలో కనక దుర్గమ్మ పాత్ర వేసే అవకాశం ఆమెకు వచ్చింది. ఆ నాటకంలో ప్రేక్షకుల స్పందన చూసినప్పటి నుంచి నటనపై మరింత మక్కువ పెరిగిందామెకు. కుటుంబం సహకారంతో నాటకరంగంలో కొనసాగుతున్న ఆమె ఏ పాత్ర వేసినా, ప్రేక్షకులకు మంచి సందేశం చేరాలని, సమాజానికి ఉపయోగపడాలని చెబుతున్నారు. నటన కేవలం వినోదానికే కాదని.. మనమూ, సమాజమూ మారాలనుకునే ఒక వేదికని నమ్ముతానంటున్నారు.

నాటకాలంటే మమకారం



రైల్వేలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న చింతా డూండీ కృష్ణ

చింతా డూండీ కృష్ణ..ఓ సాధారణ రైతు బిడ్డ. నాటకాలంటే చిన్నప్పటి నుంచి అపారమైన మమకారం. ఊరి పెద్దలు చెప్పిన కథలు, పల్లకీ పాటలు వింటూ పెరిగారు. కళంటే మక్కువ. అదే ఆయనను విజయవాడకు తీసుకొచ్చింది. ఇక్కడ డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్యమండలిలో డాక్టర్ పీవీఎన్ కృష్ణదగ్గర శిక్షణ ప్రారంభించారు. అనేక పద్యనాటకాల్లో దుర్యోధనుడు, ద్రోణుడు, కుంభాండుడు, పృథ్వీరాజ్ రాసోలో ప్రధాన హాస్యనటుడిగా, 'జయహో చత్రపతి శివాజీ మహారాజ్'లో ఫతేఖాన్ పాత్రతో ప్రేక్షకులను మెప్పించారు. ఉద్యోగంలో స్థిరపడాలన్న తపనతో ఇండియన్ రైల్వేస్‌లో టెక్నీషియన్ ఉద్యోగం సంపాదించారు. ఉద్యోగంతో పాటు రంగస్థలాన్నీ వదల్లేదు. ఈ మధ్యే డాక్టర్ ఎం.ఎస్.చౌదరి దర్శకత్వంలో ఇంటర్ రైల్వే హిందీ డ్రామా కాంపిటీషన్‌లో పాల్గొని, జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడు అవార్డు పొందారు. 'రాణా ప్రతాప్' అనే ఏక పాత్ర ప్రదర్శనతో పలు నాటికల పోటీల్లో గుర్తింపు తెచ్చుకున్నారు.

కొండపల్లి బొమ్మల ఖ్యాతిని చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

● పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



కొండపల్లిలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న కొండపల్లి బొమ్మల ఖ్యాతిని నేటి తరానికి చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో శనివారం పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. పర్యాటకంగా జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు అపార అవకాశాలున్నాయని కలెక్టర్ అన్నారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కొండపల్లి బొమ్మల విశిష్టతను తెలిపేలా అందమైన పెయింటింగ్స్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరించాలని ఆదేశించారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుంచి ఖిల్లా వరకు పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకొనేలా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి త్వరితగతిన వినియోగంలోనికి తీసుకువచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ అధికారి ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై ప్రజలను చైతన్యవంతులను చేద్దాం

● అధికారులు, సిబ్బంది విధిగా స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొనాలి: డీఎఫ్ఎస్వో ఎ.రవీంద్రరావు



ఎన్టీఆర్ జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆవరణలో చీపుళ్లతో శుభ్రం చేస్తున్న ఎ.రవీంద్రరావు తదితరులు

కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధిగా స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొని, పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా స్వర్ణాంధ్ర 2047లోని స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను చేరుకోగలుగుతామని జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి (డీఎఫ్ఎస్వో) ఎ.రవీంద్రరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ జె.సుమన్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల డీసీవో ఎ.మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీట్ ది హీట్ ఇతివృత్తంతో ఈనెల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జరుపుతుండడంతో సహచార అధికారులతో కలిసి కార్యాలయ సందర్శకులకు చల్లని తాగునీరు, మజ్జిగను రవీంద్రరావు పంపిణీ చేశారు.

తాత్సారం!

(5వ పేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానంతో కొండల మధ్య ఈ పథకాన్ని నిర్మించి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రికార్డు సృష్టించింది. అదే పంప్‌హౌస్, పైప్‌లైన్లు ఆసరా చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మరో పథకాన్ని అక్కడే నిర్మించింది. వేదాద్రి- కంచల పథకాల నిర్మాణం అనేది ఆనాటి పరిస్థితులకు అంత తేలికగా చెప్పే అంశం కాదు. ఆయా పథకాల కింద 17 వేల ఎకరాల భూమికి సంవృద్ధిగా నీరు అందుతోంది. కావల్సినంత నీటి సరఫరా ఉండడంతో అన్నదాతలు నాణ్యమైన పంటలు పండించారు. ఆర్థికంగా ఎదిగారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వం ఆ పథకాలకు పూర్తి మరమ్మతులు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించింది.

అధికారుల పనితీరుపై విమర్శలు

స్వయంగా ముఖ్యమంత్రి నిధులు కేటాయించినా పనులు చేపడ్డంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. తొలుత ఈ పథకం మరమ్మతులకు రూ.12.5 కోట్లతో అంచనాలు రూపొందించారు. ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత రీఎస్టిమేట్ వేసిన అధికారులు రూ.14.5 కోట్లకు అంచనాలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ జరపడానికే అధికారులు నెల రోజుల సమయం తీసుకున్నారు. రూపొందించిన అంచనాలు ఉన్నతాధికారుల వద్దకు వెళ్లడం, ఆ అంచనాలపై రిమార్కులు సూచిస్తూ ఉన్నతాధికారులు స్థానిక అధికారులను వివరణ కోరడం జరిగింది. ఉన్నతాధికారుల రిమార్కులపై ఇంత వరకూ స్థానిక అధికారులు సమాధానం ఇవ్వలేదు. ఈ ప్రక్రియ పూర్తయి మోటార్లకు ఆర్డర్ ఇవ్వాలంటే ఇంకా నెలరోజులు సమయం పట్టే అవకాశం కనిపిస్తుంది. ముఖ్యమంత్రి నిధులు ఇస్తున్నా పని చేయడడంలో అధికారులు జాప్యం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నీరందవేమో అంటూ ఆందోళన చెందుతున్నారు.

విత్తన కంపెనీ మోసం

(5వ పేజీ తరువాయి)

చేసి ఒప్పందం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వమని అడిగే ముఖం చాటేసి తిరుగుతున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ఎత్తడం మానేశాడు. పరిహారం ఇచ్చేది లేదు ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపులకు దిగుతున్నాడు. దీంతో నష్టపోయిన విషయాన్ని స్థానిక వ్యవసాయశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఫలితం లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు.

అవినీతి కంపు!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు తీసుకున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఎగ్జిబిషన్ నిర్వహణకు ఎన్‌వోసీ తప్పనిసరి. కానీ ఎన్‌వోసీ ఇవ్వకుండా డబ్బులు తీసుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వదిలేశారు. అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో ఎవరూ చనిపోలేదు కాబట్టి సరిపోయింది. అదే ప్రజలు చనిపోయి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారు. ఎన్‌వోసీల పేరుతో అడ్డగోలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు క్షేత్ర స్థాయిలో మేస్త్రీలు మామూళ్లు వసూలు చేసి ఇవ్వాలి. పారిశుధ్య కార్మికుల నుంచి నెలవారీ వాటాలు రావాల్సిందే. లేకపోతే వారికి మస్తర్లు ఉండవు. పర్మినెంట్ కార్మికులు పనిచేయకపోయినా వారికి మస్తర్లు ఇస్తారు. ఎందుకంటే వారి నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటారు. నగరంలో దుకాణాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కళ్యాణ మండపాలు ఇలా ప్రతి చోట అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. శానిటరీ సిబ్బంది చేయాల్సిన పనులను సచివాలయ శానిటరీ కార్యదర్శులతో క్షేత్ర స్థాయిలో చేయిస్తున్నారు. మునిసిపల్ నిబంధనల కంటే అదనంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఏమొచ్చిందో ఉన్నతాధికారులు చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణ ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రాణం తీసిన అరెస్టు భయం

తోట్లవల్లూరు/కంకిపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): రొయ్యూరు కృష్ణానది ఒడ్డున పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేయటంతో అరెస్టు చేస్తారనే భయంతో ఓ వ్యక్తి పారిపోయే క్రమంలో నదీపాయలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం... రొయ్యూరు - మద్దూరు లంకలో ఓ పది మంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న తోట్లవల్లూరు ఎస్సై సీహెచ్.అవినాష్ తన సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేశారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు, కంకిపాడు మండలం మద్దూరు గ్రామాలకు చెందిన పదిమంది పేకాట ఆడుతున్నారు. వారు పోలీసులను చూసి పరారయ్యారు. కంకిపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన వల్లభనేని గోపాలం అలియాస్ గోపి(30), వడుగు వెంకటేశ్వరరావు పేకాట శిబిరం నుంచి కృష్ణానదీపాయలోకి పరారవుతూ నీటి మడుగులోకి దూకారు. గోపాలం నీటిలో మునిగిపోయాడు. మరోవ్యక్తి వెంకటేశ్వరరావు ప్రాణాలతో బయటకు వచ్చాడు. గోపాలం నీటిలో మునిగిపోవటంతో ఘటనా స్థలం నుంచి పోలీసులు వచ్చేశారు. ఆ తర్వాత బంధువులు వచ్చి గోపాలం మృతదేహాన్ని బయటకు తీశారు. మద్దూరు నుంచి గోపాలం బంధువులు తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సైను కలిసి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గోపాలానికి భార్య, ఇద్దరు చిన్నారులు సంతానం. వారికి తగిన న్యాయం చేయాలని రాత్రి పొద్దుపోయే వరకు బంధువులు స్టేషన్ వద్దే ఉన్నారు.

యువతను దేశ సేవకులుగా తీర్చిదిద్దుతాం

● ఆసక్తి ఉన్నవారు వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి

● నోటిఫికేషన్ విడుదల చేసిన నెహ్రూ యువ కేంద్రం

విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి): దేశంపై భక్తి, ప్రేమ ఉన్న యువతను దేశ సేవకులుగా తీర్చిదిద్దుతామని, ఆసక్తి ఉన్నవారు పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు, సైనికంగా, సామాజికంగా దేశంలో అత్యవసర పరిస్థితులు వచ్చినపుడు సివిల్ అడ్మినిస్ట్రేషన్‌కు సహాయపడేలా వలంటీర్ బృందాలను తీర్చిదిద్దుతామని, స్వతహాగా వచ్చిన యువతకు సరైన శిక్షణ ఇస్తామని జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి సుంకరి రాము తెలిపారు. పెద్ద కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, ప్రజాభద్రత, జనాలను నియంత్రించడం, విపత్తులు సంభవించినపుడు ఫస్ట్‌ఎయిడ్ చేయడం, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఉంటుందన్నారు. హెచ్‌టీటీపీఎస్://మైభారత్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు.

బంగారం మాయ!

(5వ పేజీ తరువాయి)

డిజైన్లు కంటే పదుల సంఖ్యలో ఎక్కువగా ఆభరణాలు ఇక్కడ లభిస్తున్నాయి. దీంతో పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఆభరణాలపై పెట్టుబడి పెట్టేవారు హోల్‌సేల్ బంగారు ఆభరణాల దుకాణాలలో నగలను కొనుగోలు చేస్తుంటారు. ఈ దుకాణాలలో ప్రతిరోజూ కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు జరుగుతాయి.

అప్రమత్తంగా లేకపోతే అంతే..

ఇటీవల ఓ మహిళ జైహింద్ కాంప్లెక్స్ హోల్‌సేల్ ఆభరణాల దుకాణంలో సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారు ఆభరణాన్ని కొనుగోలు చేశారు. అయితే ఆమె అవసరాల నిమిత్తం ఆ బంగారు ఆభరణాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకోవటానికి ప్రయత్నించగా, బ్యాంక్ అధికారులు రూ.3 లక్షలకు మించి రుణం ఇవ్వటం కుదరదని చెప్పటంతో ఆమె షాక్‌కు గురైంది. దీంతో ఆమె బంగారాన్ని కొనుగోలు చేసిన దుకాణాదారుడి వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే ఆభరణాల్లో రాళ్ల బరువు మినహాయిస్తే, బంగారం బరువు అంతే ఉంటుందని సదరు వ్యాపారి చెప్పాడు. 52 గ్రాముల బరువు ఉన్న ఆభరణానికి రూ.4.94 లక్షలు ధర నిర్ణయించగా, మహిళకు రూ.4.70 లక్షలకు విక్రయించారు. ఆభరణాన్ని విక్రయించేటప్పుడు రూ.52.5 గ్రాముల బరువుకు రూ.9వేలు చొప్పున ధర వసూలు చేశారు. బ్యాంకులో ఆభరణం విలువను లెక్కించేటప్పుడు ఆభరణంలో సుమారు 13 గ్రాముల రాళ్ల బరువు ఉన్నట్లు అప్రైజర్ తేల్చాడు. బంగారు ఆభరణంలో ఉన్న 9 పెద్ద పూసలు ఒక్కొక్కటి 0.750 మిల్లీ గ్రాములు, మిగిలిన రాళ్లు కలిపి 12 నుంచి 13 గ్రాముల బరువు ఉంటాయని, ఆభరణం బరువు 38 గ్రాముల లోపు ఉంటుందని లెక్కించాడు. ఈ వ్యవహారంలో 13 గ్రాముల రాళ్ల బరువుకు కూడా రూ.9వేల చొప్పున బంగారం ధరను వసూలు చేసిన దుకాణదారుడు వారికి జీఎస్టీ రూపంలో లాభం వచ్చినట్లు నమ్మించాడు. తరుగు 2 శాతంలోపే తీసుకున్నానని చెప్పాడు. కొనుగోలు చేసిన బంగారం ఆభరణం అసలు బరువు లెక్క మాత్రం చెప్పలేదు. బ్యాంక్ లెక్కల్లో 38 గ్రాముల మాత్రమే బరువు తేలటంతో హోల్‌సేల్ లెక్క తేల్చాలని బాధితురాలు దుకాణం యజమానిని నిలదీశారు.

గుట్టుచప్పుడు కాకుండా సెటిల్‌మెంట్

రాళ్ల బరువుతో కలిపి ఆభరణం విలువను లెక్కించటం, హోల్‌సేల్ పేరుతో ఆభరణంలో బంగారం బరువును లెక్కలో చూపకుండా రాళ్ల బరువుతో కలిపి మొత్తం బరువును లెక్కించటంపై పోలీసులు దుకాణదారుడిని ప్రశ్నించారు. దీంతో దుకాణదారుడు బాధితురాలు కొనుగోలు చేసిన డబ్బులను తిరిగి ఇచ్చేస్తానని పోలీసులకు చెప్పటంతో గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారం ముగిసినట్లు తెలిసింది. రోజూ కోట్లాది రూపాయల లావాదేవీలు జరిపే పలువురు వ్యాపారస్తులు జీఎస్టీలు, బిల్లులు లేకుండా ఆభరణాల విక్రయాలు యథేచ్ఛగా జరగటం సందేహాలకు తావిస్తోంది. లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులకు తెలిసే విజయవాడలో బంగారం జీరో వ్యాపారం ప్రతిరోజూ కోట్లలో జరుగుతుందని పలువురు వ్యాపారస్తులే బహిరంగంగా చెబుతున్నారు. సాధారణ రంగు రాళ్లకు బంగారంతో సమానంగా ధర వసూలు చేయటం, అదే ఆభరణం బరువుగా నిర్ధారిస్తూ వాటికి సర్టిఫికెట్లను ఇవ్వటం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడ తూర్పు

ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలకు శిక్షణ తరగతులు 21 నుంచి

పాయకాపురం, మే 17(ఆంధ్రజ్యోతి) : ఏఎల్ఈఏపీ ఇండియా ఆధ్వర్యంలో ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలకు రెండు వారాల పాటు శిక్షణ తరగతులు నిర్వహించను న్నట్టు ఏఎల్ఈ ఏపీ అధ్యక్షుడు కె.రమాదేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈడీపీ(ఎంటర్ప్రేన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)పై శిక్షణ తరగతులు ఉంటాయని బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడం, స్కీములు, సబ్సిడీ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నడవడిక తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 21 నుంచి ప్రాంభంకానున్న శిక్షణకు హాజరు కావాలనుకునే ఔత్సాహికులు 94906 84344, 89789 88002లలో సంప్రదించాలని కోరారు.


13వ డివిజన్‌లో కుండీల్లో నీళ్లు పోస్తున్న గద్దె రామ్మోహన్



సిద్ధార్థ మెడికల్ కళాశాలల్లో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ

స్వచ్ఛ దివస్‌లో బీట్ ది హీట్

పటమట, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో డీ హైడ్రేషన్ జరుగకుండా అవగాహన కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బీట్ ది హీట్ పేరుతో శనివారం 13వ డివిజన్‌లో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రజలకు ఆయన మజ్జిగ, పక్షుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి కుండీల్లో నీటిని పోశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కార్పొరేషన్ జోనల్ కమిషనర్ షఫీ, సామ్రాజ్యం, కోటేశ్వరరావు, గద్దె ప్రసాద్, రమేష్, రాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: శనివారం సర్కిల్ 3 పరిధిలోని ఆటోనగర్‌లో బీట్ ది హీట్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఏ ప్రాణి వేసవి తాపానికి గురి కాకుడదన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.షమీ, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, సర్కిల్-3 సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధార్థ మెడికల్ కళాశాలలో..

ప్రభుత్వాసుపత్రి: విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా బీట్ ది హీట్ ర్యాలీని నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది పర్యావర్ణాన్ని పరిరక్షిస్తామని, మొక్కలు నాటుతామని అందరిచే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రశాంతి, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, పి.మాధవి, వీవీ సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
సీపీ రాజశేఖర్‌బాబు

గుణదల : స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గాను ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విధిగా పాటించడం జరుగుతుందన్నారు. స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటి శ్రద్ధగా పెంచడం వల్ల ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సీపీ తెలిపారు.

ఉమ్మడి స్థల సమస్య త్వరలో పరిష్కరిస్తా : గద్దె రామ్మోహన్

భారతీనగర్, మే17(ఆంధ్రజ్యోతి): తూర్పునియోజకవర్గ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలోని కామన్‌సైట్ రెగ్యులరైజేషన్ సమస్యను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కారిస్తానని కాలనీ వాసులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. తూర్పునియోజకవర్గ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ అంశంపై కాలనీ పెద్దలతో స్థానిక కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ కాలనీలో ఎప్పటి నుంచో ఉన్న కామన్ సైట్ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోందన్నారు. పలుమార్లు అధికారులు, కాలనీ పెద్దలతో సమావేశం నిర్వహించడమే కాకుండా ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు స్వయంగా ఈ ప్రాంతాన్ని సందర్శించారన్నారు. 50ఏళ్ల క్రితం ఉన్న రికార్డులనుసైతం పరిశీలించి ఈ కాలనీలోని కామన్ సైట్‌లకు ఎవరు నగదు చెల్లించారు.. ఎంత చెల్లించారు.. తదితర అంశాలను సైతం పరిశీలించామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరం చూపుతామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, కాలనీ అధ్యక్షులు పాతూరు సాంబశివరావు, గాది అయ్యప్పరెడ్డి, రెడ్డి రాంబాబు, అబ్దుల్ కలాం, పి.సత్యనారాయణ, ఎండీ.జాని, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బృంద నాట్య ప్రదర్శనలు 31న

విజయవాడ కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : విజయనర్తనం పేరిట గ్లోబల్ తెలుగు అకాడమీ, జయహో భారతీయం, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తానా ఆధ్వర్యంలో బృంద నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నాట్యాచార్య ఘంటసాల పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 31న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9 నుంచి రాత్రి 10.30 గంటల వరకు దాదాపుగా వంద బృందాలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చి నాట్య ప్రదర్శనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు నృత్య కృష్ణవేణి పురస్కారం, నాట్యాచార్యులకు విజయనర్తన పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ లక్ష్మీశ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాట్య ఆచార్యులు సి.హెచ్.హవీష చౌదరి, నరేంద్రపావని, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



విజయవాడ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : నున్న వేణుగోపాల స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం చేపట్టిన పూజా కార్యక్రమాల్లో శనివారం అష్టబంధన ప్రయోగం, భాగవత విశిష్టత లను పండితులు భక్తులకు వివరించారు. దేవస్థానం ప్రధాన అర్చకు లు రోంపిచర్ల అప్పలా చార్యులు, శేషాచార్యులు, దత్తకుమార స్వామి వారికి అభిషేకాలు అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం టీటీడీ వేద పండితులు సుదర్శనం సీతారామా చార్యులు భాగవతం విశిష్టతను భక్తులకు వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

హైపర్ టెన్షన్ డేలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. రక్తపోటు (బీపీ), రక్తంలో గ్లూకోజ్ (షుగర్) పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారు విధులను సమర్థంగా నిర్వహించగలుగుతారన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కమిషనర్‌కు బీపీ పరీక్ష

విజయవాడ రైల్వే ఉద్యోగుల తిరంగా యాత్ర



రైల్వే స్టేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో విజయవాడలో తిరంగా యాత్ర నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా రైల్వే సిబ్బంది, ఆర్‌పీఎఫ్, భారత స్కౌట్స్ గైడ్స్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. విజయవాడ తూర్పు బుకింగ్ కార్యాలయం వద్ద ఉన్న క్లాక్ టవర్ గాంధీజీ విగ్రహం వద్ద నుంచి జాక్ అండ్ జిల్ స్కూల్ మీదగా ఈ ర్యాలీని నిర్వహించారు. జాతీయ పతాకాలను చేతబూని భారత మాతకు జై, జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. డీఆర్ఎం మాట్లాడుతూ సాయుధ దళాల ధైర్యాన్ని ప్రశంసించారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్న నిర్మూలించాల్సిందేనన్నారు. ఏడీఆర్ఎం శ్రీనివాసరావు కొండా, అధికారులు పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో..

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభా వంగా రామవరప్పాడు బల్లెంవారి వీధిలో నిర్వహించిన తిరంగా యాత్రలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని దేశభక్తిని చాటారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతకి జై అంటూ నినదించారు. పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన త్రివిధ దళాల సత్తా ఎంటో చూపించారని కొనియాడారు. ఉగ్రవాదం పేరుతో దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు మన దేశాన్ని నిలువరించలేవన్నారు. ఉగ్రవాదులపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. అత్యంత కచ్చితత్వంతో క్షిపణులను ప్రయోగించి దాయాది దేశాన్ని గడగడలాడించారని, ప్రపంచంలో శక్తిమంతమైన సైన్యం మన సొంతమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడు టీడీపీ యువ నాయకులు సర్నాల బాలాజీ, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, కళ్లేపల్లి సాయి రామారాజు, అద్దేపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

విద్యాధరపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనంగా నగదు తీసుకురావాలని వివాహితను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్త, అత్తమామలపై శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం, కామకోటినగర్ కేకే వీధిలో ఉంటున్న కూర పాటి హిమబిందు (22)కు హైదరాబాద్‌కు చెందిన గవసి సాయికృష్ణతో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో హిమబిందు తల్లిదండ్రులు రూ.2 లక్షలు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు, ఇంటి సామగ్రికి రూ.50వేలు సాయికృష్ణ తలిదండ్రులకు ఇచ్చారు. హిమబిందు వివాహం అయిన నాలుగు నెలల వరకు హైదరాబాద్‌లో భర్త, అత్త మామలు బాగానే చూసుకున్నారు. ఆ తరువాత నుంచి పుట్టింటి నుంచి అదనంగా నగదు తీసుకురావాలంటూ భర్తతో పాటు అత్త శ్రావణి, మామ శ్రీరామకృష్ణ వేధిస్తున్నారు. డబ్బు సంపాదించమని భర్త, అత్త మామలు వేధించటంతో ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా చేరింది. సంతానంలేదని సూటిపోటి మాటలతో బాధితురాలిని వేధిస్తుండటంతో విద్యాధరపురంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి వేధింపులను చెప్పుకోవడంతో కుటుంబ సభ్యుల సహాయంతో భవానీపురం పోలీసులకు భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల కమిటీ చైర్మన్‌గా శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం, మే 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రజా ఫిర్యాదులు కమిటీ చైర్మన్‌గా 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానన్నారు.

మినీ మహానాడు విజయవంతం చేయండి

కంకిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిని మహానాడును విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. విలేకరులతో శనివారం మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధ్యక్షతన ఈ నెల 18న పెనమలూరు నియోజకవర్గస్థాయి మిని మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



క్రేన్ సాయంతో రావిచెట్టును వేరే ప్రాంతానికి తరలించి అక్కడ నాటుతున్న ట్రాఫిక్ పోలీసులు

ఇక్కడ పెకిలించారు.. అక్కడ ప్రాణం పోశారు..!

వేళ్లతో చెట్టును తొలగించి మరోచోట నాటిన పోలీసులు

గొల్లపూడి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లవేళలా పచ్చదనంతో మెండైన కొమ్మలతో ఉండే రావిచెట్టును గొల్లపూడి వన్ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న దృష్ట్యా శనివారం తొలగించారు. అయితే మరలా అదే పచ్చదనంతో అవే మెండైన కొమ్మలతో ఉండే రావిచెట్టును ప్రజలకు నీడ నిచ్చేందుకు వేరేచోట దాన్ని నాటి ప్రాణం పోశారు. కూకటివేళ్లతో పెకలించిన అవే వేళ్లను భూమిలోకి చేర్చి సహజ సిద్ధంగా మలిశారు. 30ఏళ్ల నుంచి అక్కడున్న రావిచెట్టును ట్రాఫిక్ పోలీసుల సహకారంతో క్రేన్ ద్వారా తొలగించి సమీపంలోని బస్సు షెల్టర్ పక్కన ఖాళీ ప్రదేశంలో తిరిగి నాటారు. ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు చల్లని నీడను ఇచ్చేందుకు అక్కడ నాటారు. ఉద్యావనం విభాగాధిపతి వి.ఎస్.ధర్మజ ఈ వృక్ష సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, చిత్రంలో జడ్జి పాండురంగారెడ్డి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

● **ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ**

మచిలీపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే వాటి నిర్వాహకులపై కఠిన చర్య లు తీసుకుంటామని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో శనివారం ప్రీ కన్షెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్డీటి) సమావేశం జిల్లా 6వ అదనపు జడ్జి పీ పాండురంగారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో స్కానింగ్ కేంద్రాల ఏర్పాటు, రెన్యువల్‌కు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. ఈ పరీక్షలు చేయాలని అడిగిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తికి సంబంధించిన వివరాలను జడ్జి పాండురంగారెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 89 స్కానింగ్ కేంద్రాలుండగా, వాటిలో 17 ప్రభుత్వ, 72 ప్రైవేటు కేంద్రాలున్నాయని తెలిపారు. పునరుద్ధరణకు మూడు, రద్దు కోసం ఒక స్కానింగ్ కేంద్రం నుంచి దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, కవిఎటీ సభ్యులు ధర్మతేజ, పీ వెంకటేశ్వరరావు, సీహెచ్ వాణిశ్రీ పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభించి కళావేదికకు హారతి ఇస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధమ్మ

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

● **ఉత్సవ పందిరి, కళావేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని సతీమణి**

హనుమాన్‌జంక్షన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం 24వ హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధమ్మ ఉత్సవ పందిరికి రిబ్బన్ కట్‌చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం హారతి ఇచ్చి కళావేదికను ప్రారంభించగా దాసాంజనేయ భజన సమాజం బృందం 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యుల స్వామికి సుప్రభాత సేవ, అర్చన, గోత్ర నామాలతో పూజలు జరిపారు. 1008 గులాబీలతో ప్రత్యేక పూజా నిర్వహించారు. మొదటి రోజు స్వామి అలంకరణకు కర్నాటక, సింధనూరుకు చెందిన కంకటా ల రామసుబ్బారావు, ఉమాదేవి దంపతులు పుష్ప వితరణ చేశారు. ఉత్సవాలు సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం భక్తులకు మజ్జిగ పంపిణీని రామాలయం వద్ద ఏర్పాటు చేసింది. ఈవో పీ తారకేశ్వరరావు పర్యవేక్షణలో కూటమి నేతలు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు, పావులూరి రామారావు, గారపాటి రామసీత, వడ్డి వాసవి, మూల్పూరి గోపీచంద్,గరికపాటి నాగేశ్వరరావు, పాబోలు ర మేశ్, కలిపిండి అప్పారావు, ఆర్యవైశ్య సంఘం నేతలు పైడి సుధాకర్, కొనకళ్ల రాజశేఖర్, పాబోలు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

వేసిన తాళాలు వేసినట్టే..!

● **తెరుచుకోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్**

మచిలీపట్నం టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుట్టాయిపేటలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ తాళాలు శనివారం కూడా తెరుచుకోలేదు. ఖాతాదారు దీప్తి 2002లో కుదువపెట్టిన బంగారం మాయమైందంటూ శుక్రవారం ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. బాధితురాలు శుక్రవారం తాళం వేసి వెళ్లి పోయింది. మేనేజర్ ఆ సమస్యను పరిష్కరించలేకపోయారు. 2002లో ఉన్న మేనేజర్ ఇందుకు బాధ్యుడని ఉన్నతాధికారులకు బంగారం గోల్‌మాల్ అయిన సంగతి ఫిర్యాదు చేశామన్నారు. కాగా శనివారం పలువురు ఖాతాదారులు బాకీ చెల్లించేందుకు వచ్చి



మణప్పురం ఫైనాన్స్ కార్యాలయానికి వేసి ఉన్న తాళం

వెనుతిరిగారు. ఈ నేపథ్యంలో మేనేజర్ విధులకు ఆటంకం కలిగిందంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం బాకీ తీర్చినప్పటికీ తన బంగారం తిరిగి ఇవ్వలేదంటూ బాధితురాలు దీప్తి శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ఎదుటకు ఈ సమస్యను తీసుకుని వెళ్లేందుకు దీప్తి మేనేజర్ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవరికి తొలి ప్రాధాన్యత

'పేదలకే తమ తొలి ప్రాధాన్యత' ప్రజా ప్రతినిధుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఊదరగొట్టే డైలాగ్ ఇది. మరి వాళ్లు ఈ చిత్రాన్ని చూస్తే ఏమంటారో..! వైద్య కోసం వచ్చే అభాగ్యులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన స్ట్రెచర్స్ ఉద్యోగుల తమ సొంత పనులకు, బెడ్‌షీట్స్, వైద్య పరికరాలు తరలించడానికి ఉపయోగిస్తున్నారు. దీంతో వాటి అవసరమున్నవారికి అవి దొరక్క అనేక అవస్థలు పడుతూనో, వేరేవారి సాయంతో ఆసుపత్రి లోపలికి వస్తున్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కనిపించిన దృశ్యాలివి..



నైపుణ్యంతోనే శిఖరాగ్రం

స్కిల్ డెవలప్‌మెంట్‌తో యువతకు ఉపాధి

● ఐటీఐ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్ ● 1644 సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
● నైపుణ్య శిక్షణ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు

ఆంధ్రజ్యోతి, భారతీనగర్: యువతకు వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్య శిక్షణను అందించి స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడంలో పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లు కావాల్సిన భరోసా ఇస్తున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ రంగప్రవేశం చేయటంతో ఐటీఐ మళ్లీ పునరుజ్జీవం పోసుకోవటంతో పాటు ఏకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనే ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదుగుతోంది. ఐటీఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాయి. మెలకువలపై పట్టుసాధించడం, కోర్సులు పూర్తికాగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభించడంతో స్వల్పకాలిక వ్యవధిలోనే యువత జీవితాల్లో స్థిరపడి కుటుంబాలకు అండగా ఉంటున్నారు. ఇటీవల టెన్త్ ఫలితాలు రావడంతో టెక్నికల్ కోర్సులు చదువుకొనే విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐలో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. టెన్త్ విద్యార్హతతో రెండేళ్ల కోర్సులు చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఒక ప్రభుత్వ ఐటీఐ కళాశాల, 10 ప్రైవేట్ కళాశాలు అందుబాటులో ఉన్నాయి 2025-25 విద్యా సంవత్సరానికి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశించడానికి 1644 సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు.



రాయల్ ఎన్‌ఫీల్డ్ ల్యాబ్ శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఐటీఐలో ట్రేడులు వివరాలు

ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), ఎలక్ట్రీషియన్, మెకానిక్ (మోటర్ వెహికల్) మిషనిస్ట్, టర్నర్, ఫిట్టర్, వైర్‌మెట్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్ టెక్నీషియన్ వంటి రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. టెన్త్ విద్యార్హతతో ఏడాది కోర్సులు చేయడానికి కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, మెకానికల్ డీజిల్ వంటి కోర్సులు, 8వ తరగతి విద్యార్హతతో సూయింగ్ టెక్నాలజీ, వెల్డర్ వంటి ఏడాది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐలో ప్రత్యేక శిక్షణ ట్రేడ్‌లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ ల్యాబ్, మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ పెయింటింగ్, అండ్ టెస్టింగ్ ల్యాబ్, ఏఆర్‌అండ్ వీఆర్ ల్యాబ్‌లు ఏడాది నుంచి అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులకు డ్రైవింగ్ శిక్షణలో మెళుకువలు నేర్పడంతో పాటు నేరుగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు మినీ వాహనం కూడా ఉంది.

స్కిల్ డెవలప్‌మెంట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా విద్యార్థులకు 3 నెలల శిక్షణ అందించిన వెంటనే ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఐదేళ్లలో ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిటర్, టర్నర్, మెకానికల్ డీజిల్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థల్లో 35శాతం ఉద్యోగాలు సాధించారు.

నేరుగా పాలిటెక్నిక్ సెకెండియర్‌లోకి..

ఐటీఐలో రెండేళ్ల కోర్సును పూర్తిచేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో అదే (ఐటీఐలో ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి తదితర కోర్సులో పూర్తి చేసిన) కోర్సుల్లో రెండో సంవత్సరంలోకి ప్రవేశించి విద్యను అభ్యసించవచ్చు.

ఉద్యోగ, అప్రెంటిస్ షిప్

ఐటీఐ కళాశాలల్లో శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ, అప్రెంటిస్‌షిప్‌కు ప్రాధాన్యత కల్పిస్తున్నాయి. ఏటా జిల్లాలో ఐటీఐ పూర్తి చేసి అర్హులైన విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ, అప్రెంటిస్ షిప్ అవకాశాలు కల్పిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఒక ప్రభుత్వ ఐటీఐ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలున్నాయి. వీటిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్లలో 680 సీట్లు, ప్రైవేట్ ఐటీఐ కళాశాల్లో వివిధ ట్రేడ్లలో 944 సీట్లున్నాయి. ఈ విద్యాసంవత్సరం జిల్లాలోని అన్ని కళాశాలల్లో 1624 సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 24లోపు దరఖాస్తు పూర్తి చేసుకోవాలి.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేకశిక్షణ

ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కనకారావు



ఐటీఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం అవసరమైన మెలకువలపై పట్టుసాధించడంతో పాటు కోర్సులు పూర్తికాగానే ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తాం. ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిటర్, టర్నర్, మెకానికల్ డీజిల్ తదితర కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. కాబట్టి ఐటీఐలో వివిధ ట్రేడుల్లో చేరేందుకు ఆసక్తికలిగినవారంతా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

నూతన క్రీడాపాలసీ క్రీడాకారులకు వరం

● కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ ● నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ స్పోర్ట్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు ఒక వరమని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ నూతన అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైందని, ఈ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విధంగా కబడ్డీ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని, కూటమి ప్రభుత్వంలో క్రీడల్లో రాజకీయాలు ఉండవని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు మణికంఠకు రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యవర్గం ఎన్నికకు ఎకేఎఫ్ఐ అబ్జర్వర్‌గా వీరేష్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలిగా ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ, కార్యదర్శిగా యలమంచిలి శ్రీకాంత్‌లు ఎన్నికకగా, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు సన్నద్ధం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

బస్‌స్టేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం ప్రకటనపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు విజనరీ లీడర్ షిప్ రాష్ట్రంలో మహిళలకు ఎన్నో ఏళ్లుగా సాధికారిత కల్పిస్తూ వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకువెళుతుందన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి మరో గొప్ప చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రం అంతటా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించటం చాలా సంతోషించాల్సిన విషయమన్నారు. ఉచిత బస్సు పథకం రాష్ట్రంలో మహిళలందరికీ ఎంతో మేలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేస్తుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం అందించటం ద్వారా ప్రభుత్వం మహిళల పై ఆర్థిక భారాన్ని తగ్గించటమే కాకుండా, వారి భద్రతను, సౌలభ్యాన్ని, గౌరవాన్ని పెంచుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న అచంచలమైన అంకిత భావానికి అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పటానికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒక ఉదాహరణ అన్నారు. ఉచిత బస్సు పథకం రాష్ట్ర వ్యాప్తంగా మహిళల జీవితాల్లో సానుకూల మార్పులను తీసుకువస్తుందని, వారి ఆకాంక్షలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ఆగస్టు 15వతేదీ నుంచి ఈ పథకం అమలు చేయటానికి ఆర్టీసీ సర్వసన్నద్ధంగా ఉంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత

● **రక్తపోటును అధిగమిద్దాం: కలెక్టర్ లక్ష్మీశ**

కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు దోహదమైన యోగాసనాలు, ధ్యానంతో ఒత్తిడిని తట్టుకొని రక్తపోటుని నివారించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రక్తపోటు శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించి రక్తపోటు పరీక్షలను చేయించుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్ల నియంత్రణ, శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతత చేకూర్చే యోగాసనాలు, ధ్యానం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తపోటును చూపించుకొంటున్న కలెక్టర్ లక్ష్మీశ

మహిళపై అత్యాచారం కేసులో విచారణ చేపట్టిన సీఐ

బంటుమిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారం కేసు విషయంలో సీఐ నాగేంద్రకుమార్ శనివారం బంటుమిల్లిలో విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన మహిళ బంటుమిల్లి కేవీఆర్ కాలనీలోని అమ్మగారింటికి వద్దకు తరచూ వస్తుండేది. బంటుమిల్లికి చెందిన ఇద్దరు అబ్బాయిలు విజయవాడలో తనపై అత్యాచారం చేశారంటూ గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు సీఐ నాగేంద్రకుమార్, బంటుమిల్లి రెవెన్యూ సిబ్బంది పంచనామా నిర్వహించి దర్యాప్తు చేపట్టారు. తరచూగా అబ్బాయిలు ఆ అమ్మాయిని వేధించడంతో తల్లితండ్రుల దృష్టికి వెళ్లగా అసలు విషయం బయటకొచ్చినట్లు తెలుస్తుంది.

మా పిల్లల చదువుల దృష్ట్యా ఏపీకి వచ్చేలా చర్యలు తీసుకోండి

● **తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ హోంగార్డులు**

గాంధీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీకి చెందిన హోంగార్డులు శనివారం ఒక ప్రకటన ద్వారా కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 11 ఏళ్లుగా సొంత రాష్ట్రానికి రావాలని ఎదురుచూస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చారని హోంగార్డులను మాత్రం మార్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు ఏపీలో ఉండగా తాము తెలంగాణలో విధులు నిర్వర్తిస్తూ ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు తెలంగాణలో చదువుతున్నారని భవిష్యత్‌లో వారు ఏపీ స్థానికత కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పాఠశాలలు, కాలేజీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో తమ పిల్లల చదువుల కోసం మానవతా దృక్పదంతో ఏపీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేందుకు సుమారు 400 మంది, ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లేదుకు సుమారు 400 మంది హోంగార్డులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఏవీవీఎల్ నారాయణరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధు కోరారు.

పాకిస్థాన్‌తో చర్చలు మావోయిస్టులపై కాల్పులా..!

● **మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్**

గాంధీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో చర్యలు జరిపేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి ఎందుకు ఆసక్తి చూపడం లేదని సుప్రంకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆదివాసీల భూసమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తే ఈ దేశంలో ఆదివాసీలు తుపాకులు పట్టుకునే అవకాశం ఉండేది కాదన్నారు. మావోయిస్టులు, పోలీసులు ఇద్దరివి ప్రాణాలేనని ఎవరి ప్రాణాలు పోగుడదన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి ప్రాణ నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చించేందుకు సిద్ధమన్న మావోయిస్టుల ప్రకటనను స్వాగతించకుండా ఆఖరి మావోయిస్టును చంపేదాక ఆపరేషన్ కగార్ ఆగదని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైందికాదన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఏపీపీఎస్ కమిటీ నేత పిచ్చుక శ్రీనివాస్, పౌరమక్కుల సంఘం నేతలు టి.ఆంజనేయులు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ పాల్గొన్నారు.

నగరానికి అంతర్జాతీయ విమాన సర్వీసులు

● **ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు**

విజయవాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపారం, పర్యాటక రంగంలో గణనీయంగా వృద్ధి చెందిందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో మూడు ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలకు అంతర్జాతీయ విమానాలను అనుసంధానం చేయాలని కేంద్ర విమానయానశాఖ మంత్రికి లేఖలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెద్ద విమానాల నిర్వహణ చేయడానికి తగిన మౌలిక సదుపాయాలున్నప్పటికీ డైరెక్ట్ కనెక్టవిటీ లేదన్నారు. రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం కావడంతో విద్య, ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా ఎదుగుతోందని, దీంతో విజయవాడ కేంద్రంగా విమాన ప్రయాణాలు పెరుగుతున్నాయన్నారు. దుబాయ్ అనేక అంతర్జాతీయ గమ్యస్థానాలకు అనుసంధానంగా ఉన్నందున విజయవాడ నుంచి దుబాయ్, సింగపూర్‌కు డైరెక్ట్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని ఏపీ ఛాంబర్స్ కొన్నేళ్లుగా కోరుతోందని మంత్రికి ఈ లేఖ ద్వారా తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానశ్రయాలకు అంతర్జాతీయ విమానాలను అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పొట్లూరి భాస్కరరావు కోరారు.





హైదరాబాద్‌లో జరుగుతున్న 'ప్రపంచ సుందరి' పోటీలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్నాయి. వందకుపైగా దేశాల నుంచి సుందరీమణులు హాజరవుతున్న ఈ పోటీలకు సంబంధించిన వీడియోలను కోట్ల మంది వీక్షిస్తున్నారు. తాజాగా 55 దేశాల అందగత్తెలు రామప్ప దేవాలయాన్ని, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు కట్టుకున్న చీరలు, ఓణీలు, లెహంగాలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. వాటిని రూపొందించిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ **గౌరంగ్ షా**... వాటి వెనుక ఉన్న కథను 'నవ్య'కు వివరించారు.

విశ్వ సుందరీమణుల చేనేత సింగారం



"సుమారు రెండు నెలల క్రితం- అప్పటి పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ నాకు ఫోన్ చేశారు. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్నాయని, వాటిలో పాల్గొనే సుందరీమణులు రామప్ప దేవాలయాన్ని, వేయి స్తంభాల గుడిని సందర్శిస్తారని.. వారికి తగిన దుస్తులను డిజైన్ చేయాలని కోరారు. తెలంగాణ చేనేత వస్త్రాలతోనే వీరి దుస్తులను రూపొందించాలని షరతు విధించారు. తెలంగాణలో చేనేతలకు సంబంధించి మూడు ముఖ్యమైన ప్రాంతాలు ప్రసిద్ధి. వీటిలో మొదటిది పోచంపల్లి. రెండోది గద్వాల్. మూడోది నారాయణపేట. ఈ మూడు చేనేతలతోనే వీరికి చీరలు, బ్లౌజులు, లంగా ఓణీలు, లెహంగాలు రూపొందించాం. బోర్డర్ల కోసం ఇతర ప్రాంతాలకు చెందిన రకరకాల హస్తకళల సాయం కూడా తీసుకున్నాం.

పది రోజుల ముందే...

సాధారణంగా మేము ఫ్యాషన్ షోల కోసం డిజైన్ చేసేటప్పుడు- మూడు యూనివర్సల్ సైజులలో కుడతాం. మోడల్స్ వచ్చి, వాటిని ధరించాక... చిన్న చిన్న మార్పులు ఉంటే అప్పటికప్పుడు చేస్తాం. ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనేవారి కొలతలు కూడా ఈ మూడు యూనివర్సల్ సైజుల్లోనే ఉంటాయని ముందే ఊహించి, దానికి తగ్గట్టుగా డిజైనింగ్‌ను చేయటం మొదలుపెట్టాం. మాకు ఈ పోటీల్లో పాల్గొనేవారి వివరాలు ముందే అందించారు. ఈ నెల ఒకటి నాటికి వారి కొలతలు కూడా తెలిసాయి. వీటికి తగ్గట్టుగా దుస్తులను డిజైన్ చేయటం మొదలుపెట్టాం. ఈ నెల 10కి అందరూ హైదరాబాద్ వచ్చేశారు. 11న వారందరికీ దుస్తుల ట్రయల్ వేశాం. ముందుగా అనుకున్నట్లే అన్ని సరిగ్గా కుదిరాయి. వారిలో చాలామందికి చీరలు, లెహంగాలు కట్టుకోవటం తొలిసారి. కానీ ఏ ఒక్కరు వాటిని ధరించి ఇబ్బంది పడలేదు. చాలా బావున్నాయని మెచ్చుకున్నారు.

పోచంపల్లికి మళ్లీ వైభవం...

రామప్ప గుడికి, వెయ్యి స్తంభాల గుడికి వెళ్లిన సుందరీమణులు తమ ఇన్‌స్టా అకౌంట్లలో ఆ ఫోటోలను షేర్ చేశారు. దీనివల్ల ఈ దుస్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించింది. ఈ మధ్య కాలంలో పోచంపల్లి వస్త్రాలకు కొద్దిగా డిమాండ్ తగ్గింది. సుందరీమణుల పర్యటన తర్వాత మళ్లీ వీటికి ఆదరణ పుంజుకుంది. అనేకమంది చేనేత కార్మికులు నాకు కూడా ఫోన్లు చేసి మా దగ్గర కూడా ఈ తరహా దుస్తులు ఉన్నాయని చెబుతున్నారు.

మూడు రకాలుగా...

సుందరీమణులందరూ గుడికి వెళ్తున్నారు కాబట్టి ఆ సందర్భానికి తగినట్టుగా దుస్తులు, అలంకరణ ఉండాలి. మన భారతీయ సంస్కృతిలోని అత్యంత అందమైన దుస్తుల్లో చీర ఒకటి. ఇది అన్ని సందర్భాలకు పనికొస్తుంది. సందర్భానుసారంగా దాన్ని కట్టుకుంటే చాలు! అందుకే సుమారు 20 మందికి చీరలు, వాటికి తగిన బ్లౌజులు కుట్టాం. మిగిలిన వారిలో 20 మందికి లెహంగాలు.. మరో 15 మందికి లంగా ఓణీలు కుట్టాం. వీటన్నింటినీ పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట చేనేతలతోనే రూపొందించాం. తెలుపు-నలుపు కలనేత, నీలం, ఎరుపు, గంధం రంగు- నేపథ్యంలోనే మొత్తం దుస్తులు కనిపిస్తాయి. ఇక కొన్ని దుపట్టాలు, బోర్డర్లు ఇతర చేనేతలకు సంబంధించినవి కూడా ఉన్నాయి. తెలంగాణ చేనేతలను సహజసిద్ధమైన రంగులతో తయారు చేస్తారు. ఒకో చేనేతకు ఒకో ప్రత్యేకత ఉంది. పోచంపల్లి ఇక్కత్, డబుల్ ఇక్కత్‌ల డిజైన్‌లు భిన్నంగా ఉంటాయి. గద్వాల్ సిల్క్ కట్టుకున్నవారికి హుందాతనాన్ని ఇస్తాయి. నారాయణపేట చేనేతలు కట్టుకొన్నవారికి సరికొత్త రూపాన్ని ఇస్తాయి. వీటి మూడింటినీ కలగలిపితే సరికొత్త అందం ఏర్పడుతుంది.





నందినీ గుప్తా

మిస్ ఇండియా వరల్డ్ కోసం...

ఈసారి పోటీల ప్రారంభోత్సవంలో మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తాకు కూడా దుస్తులను నేనే డిజైన్ చేశాను. దీని వెనక ఒక చిన్న కథ ఉంది. ఈసారి పోటీలు దక్షిణ భారత దేశంలో జరుగుతున్నాయి కాబట్టి చీర కట్టుకోవాలని నందిని భావించారు. నందిని నా దగ్గరకు వచ్చినప్పుడు ఆమె టీమ్ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. నేను వారికి కొన్ని చీరలు చూపించాను. నందిని కట్టుకుంటే అవి చాలా బావున్నాయి. కానీ నందిని కేవలం దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించటం లేదు. మొత్తం భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. కాబట్టి ఆమె ధరించే దుస్తులు కూడా ఆ విధంగానే ఉండాలి. అందుకోసం నేను సుమారు మూడు ఏళ్ల నుంచి తయారుచేస్తున్న జమ్దాని లెహంగాను ఆమెకు చూపించాను. దీనికి మేము వాడిన బోర్డర్ తయారుచేయటానికి దాదాపు రెండేళ్లు పట్టింది. దీనితో పాటుగా ఆమె దుప్పట్టా కోసం పొందూరు ఖద్దరును వాడాము. ప్రారంభోత్సవ వేళ నందిని వేసుకున్న ఈ దుస్తులకు ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రశంసలు లభించాయి."



ఎవరికైనా ఒకటే...

సాధారణంగా మోడల్స్ చాలా సన్నగా ఉంటారని., వారికి చీరలు బావుండవనే అపోహ చాలామందిలో ఉంటుంది. కానీ చీరకు కట్టే పద్ధతి వల్ల అందం వస్తుంది. సరైన రీతిలో కడితే ఏ ఖండం వారికైనా చీర బావుంటుంది. అంతేకాదు, చీరలు తెల్లగా ఉన్నవారికే బావుంటాయని భావన కొందరిలో ఉంటుంది. అది కూడా నిజం కాదు. నా ఉద్దేశంలో తెలుపు, నలుపు అనేవి అందాన్ని నిర్ణయించే అంశమే కాదు. చీర కట్టుకున్న తర్వాత వారు ఎలా ప్రవర్తిస్తున్నారు? ఎంత హుందాగా ఉన్నారనే విషయంపైనే అందం ఆధారపడి ఉంటుంది.



గౌరంగ్ షా
ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			**జియో హాట్‌స్టార్**		
సారా సిల్వర్‌మాన్	హాలీవుడ్ మూవీ	మే 20	ల్యాండ్‌మాన్	వెబ్‌సిరీస్	మే 21
రియల్ మెన్	వెబ్‌సిరీస్	మే 21	హార్ట్‌బీట్ 2	తెలుగు సిరీస్	మే 22
ది వైల్డ్ రోబో	యానిమేషన్ మూవీ	మే 24	ఫైండ్ ది ఫర్జీ	హిందీ రియాలిటీ షో	మే 23
అమెజాన్ ప్రైమ్			**ఈటీవి విన్**		
మోటార్‌హెడ్స్	వెబ్‌సిరీస్	మే 20	కథాసుధ: కాలింగ్‌బెల్	తెలుగు సిరీస్	మే 18

హార్ట్ అదే బీట్ వేరే

గతేడాది విడుదలై ప్రేక్షకాదరణ పొందిన మెడికల్ డ్రామా వెబ్‌సిరీస్ 'హార్ట్‌బీట్'. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగిన ఈ సిరీస్‌కు సీజన్ 2 త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అబ్దుల్ కబీజ్ దర్శకుడు. కార్పొరేట్ హాస్పిటల్ ఇతివృత్తంగా తెరకెక్కిన సిరీస్ ఇది. హాస్పిటల్ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రీనా జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా కథ సాగుతుంది. పేషంట్లకు చికిత్స అందించే క్రమంలో అక్కడి వైద్యుల భావోద్వేగాలు, వారి మధ్య అనుబంధాన్ని వినోదాత్మకంగా చూపించారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



ఇటీవల లండన్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన అనుభూతులను **మెగాస్టార్ చిరంజీవి** 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్నారు..

పుత్రోత్సాహము తండ్రికి...



"నేను 1983లో మోకాలి ఆపరేషన్ కోసం లండన్ వెళ్లాను. అప్పటికి ఇంకా చరణ్ పుట్టలేదు. ఆపరేషన్ జరిగే ముందు నేను, సురేఖ లండన్‌లో కొన్ని ఆసక్తికరమైన ప్రాంతాలు చూడాలనుకున్నాం. వాటిలో 'మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం' కూడా ఒకటి. ప్రపంచంలో లబ్ధప్రతిష్టులైనవారి మైనపు బొమ్మలను తొలిసారి నేను అక్కడ చూశాను. అవన్నీ జీవం ఉట్టిపడుతున్నాయి. సినీ రంగంలో నాకు అత్యంత ఇష్టమైన చార్లీ చాప్లిన్, నేను స్ఫూర్తిగా భావించే గాంధీజీ, అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ.. ఇలా అనేకమంది విగ్రహాలను చూసినప్పుడు చరిత్ర నా కళ్లముందు వచ్చి నిలిచినట్లు అనిపించింది. వారెవ్వరినీ నేను ప్రత్యక్షంగా చూడలేదు. కానీ వారి మైనపు విగ్రహాలను చూస్తే కాలం వెనక్కి తిరిగి... 'వారు నా ముందుకు వచ్చి నిలబడ్డారా?' అనేటంత సజీవంగా ఉన్నాయి. గాంధీజీ, ఇందిరాగాంధీ, చార్లీ చాప్లిన్‌ల విగ్రహాల ముందు నేను, సురేఖ ఫోటోలు తీసుకున్నాం. ఆ సమయంలో నాకు గుర్తున్నంత వరకు తుస్సాడ్స్ మ్యూజియంలో భారతీయుల విగ్రహాలు గాంధీ, ఇందిరాగాంధీలవి మాత్రమే ఉండేవి. 'వీరు చాలా అదృష్టవంతులు కదా! పూర్వజన్మ సుకృతం చేసుకోవటంవల్లే వాళ్లందరూ ఆ మ్యూజియంలో ఉన్నారు. మనల్ని బ్రిటీష్‌వారు 200 ఏళ్లు పాలించారు. తర్వాత వదిలేయాల్సి వచ్చింది.. వాస్తవానికి తమను వెళ్లగొట్టినందుకు బ్రిటిష్ వారికి గాంధీగారి మీద విపరీతమైన కోపం ఉండాలి. కానీ బ్రిటిష్ వారి రాజధానిలో ఆయన విగ్రహం పెట్టుకోక తప్పలేదు' అనుకున్నాను. ఆయన విగ్రహం చూసి నాకు చాలా గర్వంగా కూడా అనిపించింది. ఆ మ్యూజియంను చూడటం మాకు మరపురాని అనుభవం. మన దేశానికి తిరిగి వచ్చిన తర్వాత స్నేహితులు, బంధువులు అందరూ ఆ ఫొటోలను చాలా ముచ్చటగా చూశారు. ఆ తర్వాత మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం బ్రాంచీలను హాలీవుడ్‌లో, దుబాయ్‌లో, సింగపూర్‌లో పెట్టారనే వార్తలు వింటూనే ఉన్నాను.

> 'గత తరంవారు ఏం సాధించారు?' అనే విషయాన్ని చెప్పటానికి, స్ఫూర్తి పొందటానికి విగ్రహాలు అవసరం. కొన్ని సార్లు కాల ప్రవాహంలో, చరిత్రలో కొందరు మరుగున పడిపోతూ ఉంటారు. అలాంటివారి జ్ఞాపకాలను వెలికి తీసేవి విగ్రహాలే! ప్రస్తుత తరం వారు వెనక్కి తిరిగి చూసుకోవటానికి, భవిష్యత్ తరంవారు తమ వారసత్వం గురించి తెలుసుకోవటానికి విగ్రహాల అవసరం ఉందనేది నా అభిప్రాయం!

క్వీన్ ఎలిజబెత్ తరువాత చరణే...

ఒక రోజు చరణ్ వచ్చి- తుస్సాడ్స్‌లో తన బొమ్మ పెట్టాలనే ప్రతిపాదన వచ్చిందని చెప్పాడు. నాకు 1983 నాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. నా బొమ్మే ఆ మ్యూజియంలో పెడుతున్నారన్నంత ఆనందం కలిగింది. సురేఖలో కనిపించిన సంతోషాన్ని వర్ణించలేను. "అప్పుడు మనం ఫోటోలు తీయించుకున్నాం గుర్తుందా? ఆ సమయంలో చరణ్ నీ కడుపులో కూడా పడలేదు. అప్పుడు మనకు ఒక పిల్లాడు పుడతాడని, వాడికి 35 ఏళ్లు వచ్చే సరికి తుస్సాడ్స్‌లో విగ్రహం పెడతారని అనుకున్నామా? ఇదంతా అద్భుతమనిపిస్తోంది. ఈసారి మనం అక్కడకు వెళ్లి చరణ్‌తో ఫొటో తీయించుకుందాం" అని తనతో అన్నాను. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. 1983 తర్వాత బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన కొందరు నటుల విగ్రహాలు దుబాయ్‌లో, సింగపూర్‌లలో పెట్టారు. వారిలో చరణ్ సహనటులు కూడా కొందరున్నారు. కానీ చరణ్ విగ్రహం విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. చరణ్ దగ్గరకు విగ్రహ ప్రతిపాదన వచ్చినప్పుడు- తన కుక్క అయిన రైమ్ విగ్రహం కూడా ఉండాలని ఒక షరతు పెట్టాడు. ఇప్పటిదాకా క్వీన్ ఎలిజిబిత్‌తో పాటు ఆవిడ పెంపుడు కుక్క విగ్రహం మాత్రమే పెట్టారు. అంటే తుస్సాడ్స్‌లో ఈ తరహా విగ్రహం పెట్టడం ఈ మ్యూజియం చరిత్రలో ఇది రెండోసారి. వాస్తవానికి ఇలా విగ్రహం పెట్టాలంటే మామూలు కన్నా ఎక్కువ ఖర్చు అవుతుంది. దానికి కూడా వారు అంగీకరించారు. సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడో విషయం చెప్పాలి. తుస్సాడ్స్ మ్యూజియంలో విగ్రహాలకు జీవం ఉండదు కానీ ఆ బొమ్మలకు అమర్చేవన్నీ నిజమైనవే అయి ఉంటాయి. ఉదాహరణకు రైమ్ మైనపు విగ్రహంపై బొచ్చు అంతా నిజమైనదే! ఒకో వెంట్రుక తీసుకొని దాన్ని ఆ విగ్రహానికి జాగ్రత్తగా అమర్చారు.

ఆ పద్యం గుర్తుకొచ్చింది...

ఈ విగ్రహం ఆవిష్కరణకు లండన్‌కు రమ్మని ఆహ్వానం వచ్చినప్పుడు 'పుత్రోత్సాహము తండ్రికి... పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగ పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ' అనే పద్యం గుర్తుకొచ్చింది. చాలా గర్వంగా అనిపించింది. ఇక విగ్రహాన్ని చూసినప్పుడు ఎందుకో తెలియదు కానీ నా కళ్లు చెమర్చాయి. కొడుకులు లబ్ధప్రతిష్టులు అయినప్పుడు బహుశా గర్వంతో తండ్రులకు అలాంటి భావనే కలుగుతుందేమో! సురేఖ తన కొడుకు విగ్రహాన్ని మురిపెంగా చూసుకుంటూ ఉండిపోయింది. వచ్చేటప్పుడు... "అచ్చంగా చరణ్‌లాగే ఉన్నాడు. మనం వెళ్లిపోతే వాడు ఒంటరిగా ఉండిపోతున్నాడండి. వాడి ఆలనా పాలన ఎవరు చూసుకుంటారు?" అంది. "ఉపాసనను అక్కడ వదిలి వచ్చేయ్" అని సరదాగా నవ్వుతూ అన్నాను కానీ కొడుకు విగ్రహాన్ని చూసినా తల్లికి అంత ప్రేమ కలుగుతుందా? అనిపించింది. నా జీవితంలో నేను సాధించిన విజయాల్లో అక్కడ చరణ్ విగ్రహం పెట్టడం కూడా ఒకటని కచ్చితంగా చెప్పగలను. ఇక ఈ విగ్రహాన్ని చూసి క్లింకారకు ఇద్దరు నాన్నలు ఎలా ఉన్నారో అర్థం కాలేదు. మేము ఎంత ఆపినా వినకుండా విగ్రహంవైపు వెళ్లిపోయింది. రైమ్‌కు తనలాంటిదే మరొక జీవి వచ్చిందనుకొని- విగ్రహాన్ని నాకడం మొదలుపెట్టింది. మొత్తంగా చూస్తే- ఉత్సుకత అంతా ఉపాసనది, క్లింకారది. ఎమోషనల్ జర్నీ అంతా సురేఖది. ఇక చరణ్‌కు ఎలాంటి ఫీలింగ్ ఉందో మాకు ఇంకా తెలీదు. సాధారణంగా ఏ విషయంపైనైనా తన ఎక్సైట్‌మెంట్ బయటకు కనిపించదు. బహుశా తనకు నా పోలికే వచ్చిందనుకుంటా! గతంలో నా ఫ్రెండ్స్- "మీ సినిమా సూపర్ హిట్ అయింది. మీకు ఉత్సాహంగా ఉండదా? హుషారు ఉండదా?" అని అడుగుతూ ఉండేవారు. "నాది ప్రసవ వేదన లాంటిది. కష్టపడి అలసిపోతాం కదా! అప్పుడు వచ్చే విజయం ఆనందంగానే ఉంటుంది. కానీ అది అలసట వల్ల బయటకు కనిపించదు" అనేవాడిని. చరణ్‌కు కూడా అదే వచ్చిందనుకుంటా! చివరగా... ఈ విగ్రహం గురించి ఆలోచిస్తున్నప్పుడు 'అది శాశ్వతంగా ఉండిపోతుంది కదా.. భవిష్యత్ తరాల వారికి కూడా చరణ్ విగ్రహం ద్వారానే నా జ్ఞాపకాలు అందుతాయి కదా! ఎంతైనా వాడు నాకు ఒక ఎక్స్‌టెన్షన్ కదా' అనిపిస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్





మయాంక్ కెరీర్‌తో 'ఆట'లా?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)




యువ పేసర్ మయాంక్ యాదవ్ క్రికెట్ ప్రవేశం ఓ సంచలనం. బ్యాటర్ల గుండెల్లో గుబులు పుట్టించే వేగంతో బంతులు వేయడం ఈ ఢిల్లీ పేసర్ సొంతం. కానీ తరచూ గాయాల పాలవుతుండడంతో ఈ కుర్ర క్రికెటర్ కెరీరే ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. 2023లో మయాంక్‌ను రూ. 23 లక్షలకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది. కానీ గాయంతో ఆ ఏడాది ఐపీఎల్‌లో అతడు ఆడలేకపోయాడు. కోలుకొని 2024 ఐపీఎల్ అరంగ్రేటంలోనే ప్రకంపనలు సృష్టించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై అతడు 156.7 కి.మీ.వేగంతో బంతి వేసి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ఆ సీజన్‌లో అద్భుత బౌలింగ్‌తో వరుసగా రెండు పోటీల్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. తర్వాత వెన్నుగాయం తిరగబెట్టడంతో లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. ఆపై బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ)లో నెలలపాటు నిపుణుల పర్యవేక్షణలో కోలుకొని తిరిగి బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ద్వారా అరంగేట్రం చేశాడు. అయితే ఈ సిరీస్ ముగిసే సరికి మళ్లీ వెన్ను నొప్పి తిరగబెట్టడంతో తిరిగి సీఓఈకి మయాంక్ వెళ్లక తప్పలేదు. చికిత్స తీసుకొని ఈసారి ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌ల్లో ఆడాడో లేదో మళ్లీ అదే వెన్నుగాయానికి లోనయ్యాడు.

లఖ్‌నవూ ఒత్తిడి చేసిందా?

పేసర్లకు గాయాలు సహజమే అయినా.. 22 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ ఇలా తరచూ గాయపడడం మన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలోని స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుల పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. మయాంక్ మరోసారి గాయపడడం ఈ సందేహాలకు తావిచ్చింది. ఇక..రూ. 11 కోట్లతో రిటెన్షన్ చేసుకున్న మయాంక్‌ను ఈసారి ఐపీఎల్‌లో ఆడించాలని లఖ్‌నవూ బీసీసీఐపై ఒత్తిడి తెచ్చిందా..అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్‌లో బరిలో దిగడానికి ముందు సీఓఈలో మయాంక్ కేవలం 10-12 బౌలింగ్ సెషన్లలోనే పాల్గొన్నట్టు సమాచారం. సుదీర్ఘకాలం బౌలింగ్‌కు దూరంగా ఉన్న పేసర్ సామర్థ్యాన్ని అలా కొన్ని సెషన్లలోనే పరిశీలించి పోటీ క్రికెట్ ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సబబు కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు..ఈ సీజన్‌కు లఖ్‌నవూ శిబిరంలో చేరేటప్పటికే అతడి వెన్నులో వాపు ఉన్నట్టు సమాచారం.

అభిమానుల జోష్‌పై 'నీళ్లు'



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	12	8	3	1	17	0.482
గుజరాత్	11	8	3	0	16	0.793
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

- ఐపీఎల్ పునఃప్రారంభ మ్యాచ్ రద్దు
- ఏకధాటిగా కురిసిన వర్షం
- కోహ్లీకి మద్దతుగా తెలుపు జెర్సీల సందడి

కోల్‌కతా అవుట్

ప్లేఆఫ్స్‌కు మ్యాచ్ దూరంలో బెంగళూరు

బెంగళూరు: తొమ్మిది రోజుల విరామం తర్వాత.. అభిమానుల సందడి మధ్య ఆరంభం కావాల్సిన ఐపీఎల్‌కు వరుణుడు షాకిచ్చాడు. శనివారం సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు-కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య ఇక్కడ జరగాల్సిన కీలక మ్యాచ్ రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్‌ను కేటాయించారు. ఫలితంగా 13 మ్యాచ్‌లాడి 12 పాయింట్లతో ఉన్న డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. అటు బెంగళూరు 17 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే రజత్ పటీదార్ సారథ్యంలోని బెంగళూరు నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్లేది. అంతకుముందు సాయంత్రం ఆరు గంటల నుంచే భారీ వర్షం ఆరంభమైంది. దీంతో టాస్ కూడా వీలు పడలేదు. అయితే స్థానిక చిన్నస్వామి స్టేడియంలో అత్యాధునిక డ్రైనేజి సిస్టం ఉండడంతో మ్యాచ్‌పై ఆశలు పెట్టుకున్నారు. కాసేపు వర్షం ఆగడంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా మైదానం సిబ్బంది రంగంలోకి దిగారు. కాసేపటికే తిరిగి వాన పుంజుకోవడంతో చేసేదేమీ లేకపోయింది. చివరకు రాత్రి 10.23కి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఇదిలావుండగా విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాక బరిలోకి దిగడం ఇదే తొలిసారి కావడంతో చాలామంది ఫ్యాన్స్ తెలుపు జెర్సీలతో కనిపించారు. తమ అభిమాన క్రికెటర్ ప్రదర్శనను తిలకిద్దామనుకున్న వారికి నిరాశే ఎదురైంది. బెంగళూరు తర్వాతి మ్యాచ్‌ను సొంత మైదానంలోనే ఈనెల 23న సన్‌రైజర్స్‌తో ఆడనుంది. అందులో గెలిస్తే అధికారికంగా ప్లేఆఫ్స్‌కు చేరుతుంది.

నేటి మ్యాచ్‌లు

రాజస్థాన్ x పంజాబ్ — మ.3.30 నుంచి, వేదిక: జైపూర్

ఢిల్లీ x గుజరాత్ — రా.7.30 నుంచి, వేదిక: ఢిల్లీ

సచిన్.. 'ఎస్ఆర్‌టీ'100



ముంబై: క్రికెట్ దిగ్గజాలను బీసీసీఐ ప్రత్యేకంగా గౌరవిస్తోంది. భారత క్రికెట్‌కు అందించిన సేవలకు గుర్తుగా సునీల్ గవాస్కర్ పేరిట ఇటీవలే ప్రత్యేక బోర్డు రూమ్ ఏర్పాటుచేసిన బీసీసీఐ.. తాజాగా సచిన్ టెండూల్కర్ కోసం మరో గదిని కేటాయించింది. సచిన్ వంద శతకాలకు గుర్తుగా 'ఎస్ఆర్‌టీ100' పేరుతో ముంబైలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఓ గదిని ఏర్పాటు చేసింది. స్వయంగా సచిన్ చేతులమీదుగా ఆ గదిని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన సచిన్.. జీవితంలో తొలిసారి ఇలాంటి ప్రత్యేక గౌరవాన్ని అందుకుంటున్నా అని వ్యాఖ్యానించాడు.

సుతీర్థ జోడీ ముందంజ

ప్రపంచ టీటీలో శ్రీజకు నిరాశ

దోహా: టేబుల్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత జోడీ ఐహిక ముఖర్జీ/సుతీర్థ ముఖర్జీ మహిళల డబుల్స్‌లో శుభారంభం చేసింది. ఆరంభ రౌండ్లో సుతీర్థ ద్వయం 3-2తో టర్కీ జంటను ఓడించింది. మరో భారత జంట దియా/యశస్విని 3-1తో ఉజ్బెకిస్థాన్ జోడీని ఓడించి రెండోరౌండ్ చేరింది. పురుషుల డబుల్స్ తొలిరౌండ్లో భారత్‌కు చెందిన మానవ్ టక్కర్/మానుష్ షా ద్వయం 3-0తో స్లోవేనియా జోడీని చిత్తుచేసింది. సింగిల్స్‌లో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ 1-4తో సుతసిని (థాయ్‌లాండ్) చేతిలో ఓడి ఆరంభంలోనే వెనుదిరిగింది.

ఫైనల్లో యుకీ జోడీ

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ.. ఫ్రాన్స్‌లో జరుగుతున్న బార్డాక్స్ చాలెంజర్ టోర్నీలో డబుల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో రెండోసీడ్ యుకీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-3, 7-6 (7-3)తో బ్రెజిల్‌కు చెందిన మూడోసీడ్ మాటోస్/మార్సెలో జంటను ఓడించింది.

తదుపరి లక్ష్యం.. మరింత 'దూరం'!



నీరజ్ చోప్రా

దోహా: చాలా కాలంగా ఊరిస్తున్న 90 మీటర్ల మార్క్‌ను అధిగమించడంతో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. ఇక తాను మరింత దూరం జావెలిన్‌ను విసరడంపై దృష్టి సారిస్తానన్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో 90.23 మీటర్ల దూరం ఈటెను విసిరిన నీరజ్ తన చిరకాల లక్ష్యాన్ని చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే అంత దూరం విసిరినా..జర్మన్ అథ్లెట్ జులియన్ వెబర్ (91.06 మీ.) తర్వాత చోప్రా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. '90 మీ. మార్క్ చేరుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కాకపోతే తీపి, చేదు కలబోత. అయినా పర్వాలేదు. నేను, కోచ్ జాన్ జెలెజ్నీ నా త్రోలోని కొన్ని అంశాలను మెరుగుపరుచుకోవడంపై పని చేస్తున్నాం' అని నీరజ్ శనివారం తెలిపాడు. కాగా..పురుషుల జావెలిన్ త్రోలో వరల్డ్ రికార్డు (98.48 మీ.) చెక్ రిపబ్లిక్‌కు చెందిన జెలెజ్నీ పేరిట ఉండడం గమనార్హం.

ప్రధాని అభినందన

నీరజ్ చోప్రాను ప్రధాని మోదీ అభినందించారు. 'అద్భుత ఫీట్ సాధించావు. 90మీ. మార్క్‌ను అధిగమించిన నీరజ్‌కు అభినందనలు. ఆటపట్ల అనురక్తి, నిరంతర పరిశ్రమ, అంకితభావానికి దక్కిన ఫలితం ఇది' అని ప్రధాని ఎక్స్‌లో కొనియాడారు.

కెప్టెన్‌గా గిల్ ఖాయమేనా?

గంభీర్, అగార్కర్‌తో సమావేశాలు



న్యూఢిల్లీ: రోహిత్ శర్మ రిటైర్ కావడంతో భారత టెస్టు జట్టు నూతన కెప్టెన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నా.. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్ అందరికంటే ముందున్నాడు. జూన్ 20 నుంచి సాగే ఇంగ్లండ్ పర్యటన కోసం అతడికే పగ్గాలు అప్పగిస్తారనే కథనాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఇటీవల గిల్‌ను జట్టు ప్రధాన కోచ్ గంభీర్ తన నివాసానికి ఆహ్వానించినట్టు తెలిసింది. ఇద్దరి మధ్య సుదీర్ఘంగా ఐదు గంటలపాటు ఇదే విషయమై చర్చ సాగినట్టు సమాచారం. దీంతో భవిష్యత్ కెప్టెన్‌గా గిల్‌ను ప్రకటించడం ఖాయమని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాకుండా ఈనెల 6న ముంబైలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తోనూ గిల్ సమావేశమయ్యాడట. భారత్ క్రికెట్‌లో ఈ ఇద్దరి ముఖ్యులతో అతడి భేటీ కారణంగా బీసీసీఐ త్వరలోనే అధికారిక ప్రకటన చేయబోతున్నట్టు తెలుస్తోంది. బుమ్రా, పంత్, రాహుల్ పోటీలో ఉన్నా సెలెక్టర్లు కూడా గిల్‌కే మద్దతిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే సీనియర్లను తోసిరాజని గిల్‌కు అనూహ్యంగా పరపతి పెరగడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బోర్డులోని ముఖ్యులు కూడా ఈ విషయంలో అసంతృప్తితో ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంత త్వరగా అతడికి టెస్టు బాధ్యతలు అప్పగించడం సరికాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బుమ్రా, జడేజాలలో ఒకరికి కెప్టెన్సీ ఇచ్చి గిల్‌ను డిప్యూటీగా చేస్తే బాగుంటుందని మాజీ స్పిన్నర్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

భారత్ 'ఎ' జట్టు కోచ్ కనిత్కర్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ 'ఎ' జట్టు ప్రధాన కోచ్‌గా హృషికేష్ కనిత్కర్‌ను బీసీసీఐ నియమించింది. బౌలింగ్ కోచ్‌గా ట్రాయ్ కూలీ, ఫీల్డింగ్ కోచ్‌గా శుభోదీప్ ఘోష్ వ్యవహరించనున్నారు. ఈ నెల 30 నుంచి జరిగే షాడో టూర్‌లో అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వంలోని భారత్ 'ఎ'.. ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు, భారత సీనియర్‌తో జట్టుతో ఓ అనధికార టెస్ట్ ఆడనుంది.

కార్ల్‌సన్ X ద వరల్డ్



బెర్లిన్: 'మాగ్నస్ కార్ల్‌సన్ వర్సెస్ ద వరల్డ్' మెగా గేమ్ మరికొద్ది రోజుల్లో డ్రాగా ముగిసే అవకాశాలున్నాయి. ఫ్రీస్టయిల్ ఫార్మాట్‌లో జరుగుతున్న సింగిల్ గేమ్‌లో ప్రపంచవ్యాప్తంగా 1,40,000 మందితో కార్ల్‌సన్ తలపడుతున్నాడు. గతనెల 4న మొదలైన ఈ మెగా గేమ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ సునాయాసంగా గెలిచి సరికొత్త చరిత్ర సృష్టిస్తాడని అంచనా వేశారు. కానీ, వరల్డ్ జట్టు ఆడుతున్న తీరు చూస్తుంటే గేమ్ డ్రాగా ముగిసే అవకాశాలున్నాయి. ఈ గేమ్‌లో ప్రత్యర్థులు ఒక్కో ఎత్తు వేసేందుకు 24 గంటల సమయం ఉంటుంది. ఓటింగ్ ద్వారా వరల్డ్ టీమ్ ఎలాంటి ఎత్తు వేయాలో నిర్ణయించుకొంటుంది. 1999లో మైక్రోసాఫ్ట్ నెట్‌వర్క్‌పై నాలుగు నెలలపాటు సాగిన గేమ్‌లో రష్యన్ గ్రాండ్ మాస్టర్ కాస్పారోవ్ 50వేల మందితో ఆడి గెలిచాడు. కాగా, గతేడాది చెస్.కామ్‌లో 70 వేల మందితో తలపడిన భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్.. ఆ గేమ్‌లో గెలిచి కాస్పారోవ్ రికార్డును తిరగరాశాడు. కాగా.. ఈ రికార్డును అధిగమించాలనే ఉద్దేశంతో కార్ల్‌సన్ మెగా గేమ్‌ను ఆరంభించినా.. అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

బిజినెస్ ప్లస్

దివీస్ లాభంలో 23% వృద్ధి

క్యూ4లో రూ.662 కోట్లు
ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్

దివీస్ లేబొరేటరీస్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో రూ.2,671 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.662 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 23 శాతం, ఆదాయం 12 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో ఫారెక్స్ లాభాలు రూ.10 కోట్లుగా ఉన్నట్లు దివీస్ పేర్కొంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.9,712 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.2,191 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ కాలంలో ఫారెక్స్ లాభాలు రూ.30 కోట్ల నుంచి రూ.48 కోట్లకు పెరిగాయని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.30 (1,500 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

జెన్ టెక్నాలజీస్ ఆదాయం రూ.350 కోట్లు

గడచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో జెన్ టెక్నాలజీస్ రూ.113.74 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.37.58 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.144.04 కోట్ల నుంచి రూ.349.74 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,032.02 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.299.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2 (200 శాతం) తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

సోలార్ వేఫర్స్ తయారీకి ప్రీమియర్ ఎనర్జీ-ఎస్ఏఎస్ జేవీ

హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, తైవాన్‌కు చెందిన సినో- అమెరికన్ సిలికాన్ ప్రొడక్ట్స్ (ఎస్ఏఎస్) జట్టు కట్టాయి. ఇందులో భాగంగా ఇరు సంస్థలు సోలార్ వేఫర్ తయారీ కోసం భాగస్వామ్య సంస్థ (జేవీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ జేవీ భారత్‌లో ఏటా 2 గిగావాట్ల సామర్థ్యం గల తయారీ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. ఫొటోవోల్టాయిక్ సెల్స్, మాడ్యూల్స్ కోసం అవసరమైన సిలికాన్ వేఫర్స్‌ను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 18వ తేదీ



హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	72

పీపీఎఫ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏది బెటర్?



చేతిలో నాలుగు డబ్బులు ఉంటే ప్రతి ఒక్కరు వాటిని ఎలా మదుపు చేయాలా అని చూస్తారు. నష్ట భయానికి (రిస్క్) సిద్ధపడితే స్టాక్ మార్కెట్లో మదుపు చేస్తారు. ఎందుకొచ్చిన రిస్క్ అనుకుంటే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) లేదా పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్)ను ఆశ్రయిస్తారు. అయితే ఇందులో ఏది ఎవరికి అనుకూలమంటే అది ఆయా వ్యక్తుల అవసరాలు, లక్ష్యాలను బట్టి ఉంటుంది.

అసలుకు ఢోకా లేకుండా స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే ప్రతి మదుపరికి ముందుగా గుర్తుకు వచ్చేది బ్యాంకు ఎఫ్‌డీలు లేదా పీపీఎఫ్. ఎందుకంటే ఈ రెండింటిలో చెల్లింపులకు పెద్దగా ఢోకా లేదు. పీపీఎఫ్ చెల్లింపులకైతే కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అయితే ఈ రెండు పథకాలు అందరికీ ఒకేలా వర్తించవు. ఆర్థిక లక్ష్యాలు, నగదు అవసరాలు, ఆదాయ పన్ను (ఐటీ) భారాన్ని బట్టి ఈ పథకాలను ఎంచుకోవాలి. ఇందులో ఒక్కో పథకానికి సంబంధించిన అనుకూల, ప్రతికూలతలను పరిశీలిద్దాం.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ).. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) ఆఫర్ చేస్తాయి. ఈ ఎఫ్‌డీల కాలపరిమితి ఏడు రోజుల నుంచి పదేళ్ల వరకు ఉంటుంది. కాలపరిమితిని బట్టి వడ్డీ రేటు మారుతుంది. ప్రస్తుతం కాలపరిమితి.. బ్యాంకులను బట్టి ఎఫ్‌డీలపై 6 నుంచి 8 శాతం వరకు వడ్డీ లభిస్తోంది. ఈ వడ్డీ చెల్లింపులను ఎఫ్‌డీ కాలపరిమితి తీరిన తర్వాతనా? లేదా నిర్ణీత గడువులోగా అనే విషయాన్ని మదుపరులే నిర్ణయించుకోవాలి.

పీపీఎఫ్

ఇది 15 ఏళ్ల కాలపరిమితితో కూడిన కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకం. ఈ పథకంపై చెల్లించే వడ్డీ రేటును కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మూడు నెలలకు ఒకసారి సవరిస్తుంటుంది. ప్రస్తుతం ఈ పథకంపై 7.1 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఎవరైనా ఈ పథకంలో సంవత్సరానికి రూ.500 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. పీపీఎఫ్ పెట్టుబడులకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద రూ..1.5 లక్షల వరకు మినహాయింపు కూడా లభిస్తుంది.

రాబడులు, పన్ను పోటు

పీపీఎఫ్‌తో పోలిస్తే ఎఫ్‌డీలపై వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువ. ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ ఆదాయంపై ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను పోటు ఉంటుంది. పీపీఎఫ్‌కు మాత్రం ఎలాంటి పన్ను పోటు ఉండదు. పీపీఎఫ్‌లో పెట్టుబడులు, వాటిపై వచ్చే వడ్డీ ఆదాయం, 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత వచ్చే మొత్తాలన్నింటి పైనా ఎలాంటి పన్ను పోటు ఉండదు.

రెండింటిలో ఏది మంచిదంటే

రాబడులపరంగా చూస్తే ఎఫ్‌డీలతో పోలిస్తే పీపీఎఫ్ పెట్టుబడులే బెటర్. ఎలాగంటే, 30 శాతం టాక్స్ బ్రాకెట్‌లో ఉన్న వ్యక్తి ఎఫ్‌డీలో మదుపు చేస్తే 7 శాతం వడ్డీ వస్తుందనుకుందాం. పన్ను పోటు పోయే సరికి అతడికి నికరంగా లభించే వడ్డీ రేటు 5 శాతం లోపే ఉంటుంది. అదే పీపీఎఫ్‌ను తీసుకుంటే ప్రస్తుతం చెల్లిస్తున్న 7.1 శాతం మొత్తం మదుపరి ఖాతాలోనే పడుతుంది. పైగా ఈ పథకంపై చెల్లించే వడ్డీని ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం చక్రవడ్డీ పద్ధతిలో లెక్కిస్తారు. కాకపోతే ఈ పథకంలో సంవత్సరానికి రూ.1.5 లక్షలకు మించి మదుపు చేసేందుకు వీల్లేదు.

లిక్విడిటీ-వెసులుబాటు

పీపీఎఫ్‌తో పోలిస్తే ఎఫ్‌డీలకు లిక్విడిటీ ఎక్కువ. అంటే వీటిని నిర్ణీత గడువు కంటే ముందే వెనక్కి తీసుకోవచ్చు. కాకపోతే అందుకు కొద్దిగా ఫీజు చెల్లించాలి. పైగా ఎఫ్‌డీలు హామీగా చూపి రుణాలు కూడా తీసుకోవచ్చు. అదే పీపీఎఫ్ పెట్టుబడులను 15 ఏళ్ల కంటే ముందే వెనక్కి తీసుకోవాలంటే అనేక షరతులు వర్తిస్తాయి. ఏడేళ్లు పూర్తి అయితే గానీ పీపీఎఫ్ పెట్టుబడులను అది కూడా పాక్షికంగా మాత్రమే వెనక్కి తీసుకోవడం సాధ్యపడుతుంది. అదే పీపీఎఫ్ మొత్తాన్ని హామీగా చూపి రుణాలు తీసుకోవాలంటే మూడు నుంచి ఆరేళ్ల లోపు మాత్రమే సాధ్యం. హామీతో కూడిన సురక్షిత రాబడుల కోసం చూసే దీర్ఘకాలిక మదుపరులకు మాత్రమే పీపీఎఫ్ మంచి ఆప్షన్ అని చెప్పక తప్పదు.

నష్ట భయం- భద్రత

రెండూ సురక్షిత పథకాలే. కాకపోతే ఎఫ్‌డీలతో పోలిస్తే పీపీఎఫ్ మరింత సురక్షితం. ఎందుకంటే ఈ పథకం చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ పూచీకత్తు ఉంటుంది. మంచి పెద్ద బ్యాంకుల్లో చేసే ఎఫ్‌డీల చెల్లింపులకూ పెద్దగా ఢోకా ఉండదు. ఒకవేళ ఏదైనా బ్యాంకు దివాలా తీసినా రూ.5 లక్షల వరకు ఉండే ఎఫ్‌డీల చెల్లింపులకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ కార్పొరేషన్ (డీఐసీజీసీ) హామీ ఉంటుంది.

ఎఫ్‌డీలు ఎవరికి?

స్వల్ప, మధ్యకాలిక అవసరాలు ఉన్న మదుపరులు, ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెనక్కు తీసుకోవాలనుకునే వారు, తక్కువ ట్యాక్స్ బ్రాకెట్‌లో ఉన్న మదుపరులు ఎఫ్‌డీలను ఎంచుకోవడం మంచిది.

పీపీఎఫ్ ఎవరికి?

పన్ను పోటు లేకుండా దీర్ఘకాలిక ఆస్తుల కల్పన కోసం చూసే వ్యక్తులు, రిటైర్మెంట్, పిల్లల విద్య, వివాహ ఖర్చుల కోసం చూసే మదుపరులు, అధిక ట్యాక్స్ బ్రాకెట్‌లో ఉండి సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా కోసం చూసే వ్యక్తులు పీపీఎఫ్‌ను ఎంచుకోవడం మంచిది. ఆర్థికంగా స్థితిమంతులైన వ్యక్తులు తమ పెట్టుబడుల పోర్టుఫోలియోలో ఎఫ్‌డీలతో పాటు పీపీఎఫ్‌ను ఉంచుకోవడం మంచిది. అయితే వారి పెట్టుబడుల లక్ష్యం, కాలపరిమితి, పన్ను పోటు ఆధారంగా ఉండాలి.

2024-25 ఆర్థిక సంవత్సరం లావాదేవీలను సరి చేసుకోవటం ఎలా?

ఈ మార్చితో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఇప్పటి వరకు వివిధ రకాల రిటర్నులు దాఖలు చేసినప్పటికీ, వార్షిక రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ఇన్‌కమ్ టాక్స్‌కి సంబంధించిన రిటర్నులు కూడా దాఖలు చేయాల్సి ఉంది. కాబట్టి ముందుగా వ్యాపార సంస్థలు తమ అన్ని రకాలైన లావాదేవీలను మరొకసారి సరి చూసుకోవాలి. పొరపాట్లు ఏమైనా ఉంటే వార్షిక రిటర్న్‌లో లేదా ఈలోపు గానీ సరి చేసుకోవచ్చు. నిబంధనల మేర కొంతమందికి వార్షిక రిటర్నుల నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ, ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను సరిచేసుకోవటం అందరికీ అవసరం. వీటికి సంబంధించిన ముఖ్య విషయాలు మీకోసం..

మొదటగా, అమ్మకాల విషయాన్ని పరిశీలించాలి. బుక్స్‌లో చూపిన అమ్మకాలు, మీరు దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ రిటర్నుల్లో చూపిన అమ్మకాలతో సరిపోతున్నాయా లేదా చూడాలి. అలాగే జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ మధ్య లావాదేవీల్లో ఏమైనా తేడాలున్నాయో చూసుకోవాలి. అన్ని ఇన్వాయిస్‌లు, క్రెడిట్/డెబిట్ నోట్స్ రిటర్నుల్లో చూపబడ్డాయా లేదా ధ్రువీకరించుకోవాలి. రాష్ట్ర అంతర్గత సరఫరాలు, అంతర్ రాష్ట్ర సరఫరాలు సరిగ్గా చూపారా.. అంటే ప్లేస్ ఆఫ్ సప్లయ్ సరిగ్గా చూపించారా నిర్ధారించుకోవాలి.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) విషయానికొస్తే.. జీఎస్‌టీఆర్-2బీ లో కనిపించే ఇన్వాయిస్‌ల ఆధారంగానే ఐటీసీ తీసుకోవాలి. అలాగే అర్హత ఉన్న మేరకే (జీఎస్‌టీఆర్-2బీలో కనిపించినప్పటికీ) ఐటీసీ తీసుకోవాలి. ముఖ్యంగా పొందిన సరఫరాలలో వ్యక్తిగత వినియోగం కోసం లేదా వ్యాపారేతర అవసరాల కోసం ఏమైనా వాడితే ఆ మేరకు ఐటీసీ తీసుకోరాదు. అలాగే ఫుడ్, వాహనాలు, ఉద్యోగుల ఇన్సూరెన్స్ లాంటి వాటిని వ్యాపార అవసరాల కోసం వాడినప్పటికీ ఐటీసీ కోసం అదనపు నిబంధనలు పొందుపరచటం జరిగింది. కాబట్టి ఇలాంటి వాటి మీద ఐటీసీ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా అర్హత ఉందో లేదో చెక్ చేసుకోవాలి. కామన్ ఇన్‌పుట్స్‌ను పన్ను చెల్లించే సరఫరాలు, పన్ను మినహాయింపు పొందిన సరఫరాలకు వాడినట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం పన్ను మినహాయింపు పొందిన సరఫరాల మేరకు రివర్స్ చేయాలి. ముఖ్యంగా 180 రోజుల లోపు సరఫరాదారులకు సంబంధిత మొత్తం చెల్లించని బిల్లులపై ఐటీసీ రివర్స్ చేయాలి.

జీఎస్‌టీ క్యాష్, క్రెడిట్ లెడ్జర్లు కూడా బుక్స్‌తో పోల్చుకుని ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయేమో చూడాలి. చెల్లించాల్సిన పన్నుకు, చెల్లించిన పన్నుకు మధ్య తేడాలు ఏమైనా ఉన్నాయో గమనించాలి.



రాంబాబు గొండాల

ఇంకా, పన్ను చెల్లింపులు నిర్ధారిత సమయంలో అంటే 'టైమ్ ఆఫ్ సప్లయ్' నిబంధనల మేర జరిగినట్లు ధ్రువీకరించుకోవాలి. ముఖ్యంగా సర్వీస్‌ల విషయంలో అడ్వాన్సులు పొందినప్పుడు లేదా ఇన్వాయిస్‌లు తదుపరి నెలలో ఇచ్చినప్పుడు పన్ను చెల్లింపులను జాగ్రత్తగా చూసుకోవాలి.

రివర్స్ చార్జీ విషయంలో కూడా జాగ్రత్తలు అవసరం. లీగల్ ఫీజులు, డైరెక్టర్ రెమ్యునరేషన్, సేవల దిగుమతులు వంటి వాటిపై జీఎస్‌టీ చెల్లించి ఆ మేరకు ఐటీసీ క్లెయిమ్ చేశారా లేదా తెలుసుకోవాలి. బుక్స్‌లో చేసిన ఎంట్రీలు, రిటర్నుల్లో చూపిన ఆర్‌సీఎం వివరాలతో సరిపోతున్నాయా ధ్రువీకరించుకోవాలి.

క్రెడిట్ నోట్, డెబిట్ నోట్స్ జారీ విషయంలో, సంబంధిత పన్ను, ఐటీసీ సర్దుబాట్లు నిబంధనల మేర జరిగేటట్లు చూసుకోవాలి. మొత్తంగా చెప్పాలంటే అమ్మకాలు, ఐటీసీ, ఆర్‌సీఎం, లెడ్జర్లు, వివాదాలకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ఖాతాలకు తుది రూపమివ్వటం వల్ల పన్నులపరంగా సమస్యలు, వివాదాలు రానివ్వకుండా ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులకు, జీఎస్‌టీ రిటర్నులకు మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	120
కర్నూలు	125	నెల్లూరు	125
విశాఖపట్నం	121	అనంతపురం	125
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,180 ▲	87,250 ▲	1,08,000 ▲
విజయవాడ	96,350 ▼	90,500 ▲	98,150 ▼
విశాఖపట్నం	95,130 ▼	87,200 ▲	1,08,000 ▼
రాజమండ్రి	95,130 ▲	87,200 ▲	98,400 ▲
ప్రొద్దుటూరు	95,300 ▼	87,680 ▼	98,300 ▲
ముంబై	92,301 ▼	84,548 ▼	94,606 ▲



సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం!



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించే చిత్రం త్వరలో సెట్స్‌కు వెళ్లనుంది. పూర్తి స్థాయి వినోదభరితంగా రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో చాలా కాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరెస్ రోల్ చేయనున్నారు. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటించనున్నట్లు వెల్లడిస్తూ ఓ వీడియో విడుదల చేశారు దర్శకుడు అనిల్ రావిపూడి ఈ వీడియాలో నయనతార తన టీమ్‌తో తెలుగులో మాట్లాడడం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, చివరికి దర్శకుడు అనిల్ రావిపూడితో కలసి 'సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం' అని చెప్పడం ఆకట్టుకుంది. అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచి సాంకేతిక బృందాన్ని పరిచయం చేయడం, నయనతారను లీడ్ యాక్ట్రెస్‌గా ప్రకటించడం.. వరకూ జరిగిన ప్రతి ప్రమోషన్ వినూత్నంగా, ఆకట్టుకొనేలా సాగింది. 2026 సంక్రాంతికి సినిమా విడుదల చేయడానికి నిర్ణయించుకొన్నట్లు శనివారం విడుదల చేసిన వీడియోలో మరోసారి స్పష్టం చేశారు అనిల్ రావిపూడి.

తెలుగులోకి విజయ్ సేతుపతి 'ఏస్'



విజయ్ సేతుపతి సినిమా అనగానే తమిళంలోనే కాదు తెలుగు ప్రేక్షకులకు కూడా ఆసక్తే. మంచి కాన్సెప్ట్, ఎమోషనల్ కంటెంట్ ఉంటాయని భావిస్తుంటారంతా. ఆయన తాజా చిత్రం 'ఏస్' ఇప్పుడు తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల కానుంది. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం కోసం ప్రముఖ సంస్థలు పోటీ పడినా ఫ్యాన్సీ రేటు ఇచ్చి పద్మినీ సినిమాస్ సంస్థ అధినేత బి.శివప్రసాద్ హక్కులు సొంతం చేసుకున్నారు. ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది

- విజయ్ కనకమేడల



"'భైరవం' అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి యాక్షన్ థ్రిల్లర్. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు ఉత్కంఠకు, భావోద్వేగాలకు గురవుతారు. కచ్చితంగా ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని అన్నారు దర్శకుడు విజయ్ కనకమేడల. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రం 'భైరవం'. డా.జయంతిలాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కథ కమర్షియల్‌గా నాకు చాలా నచ్చింది. అలాగే ముగ్గురు హీరోలతో పనిచేసే అవకాశం కూడా కలిగింది. ఇది రీమేక్ చిత్రమైనప్పటికీ ఒరిజినల్‌లో ఉన్న ఆర్గానిక్ ఎమోషన్ ఇందులో ఉంటుంది. క్యారెక్టరైజేషన్ ప్రజెంటేషన్ నా స్టయిల్‌లో ఉంటుంది. మంచి నటుల నుంచి సినిమా వస్తే ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్‌కి వస్తారనే నమ్మకం ఉంది. నా గత సినిమాలతో పోల్చుకుంటే ఈ చిత్రం ఎక్కువ ఆహ్లాదకరంగా ఉంటుంది' అని తెలిపారు.







వీరే ప్రధాన కుట్రదారులు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయానికి కారులో తరచూ వెళ్లి మద్యం సొమ్ములు తెచ్చుకునేవారని వెల్లడించారు. ముడుపులను తెచ్చుకోవడంలో మరో ముఖ్య నిందితుడు, జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప సహా ముగ్గురూ పోటీపడేవారని చెప్పారు. కానీ, విచారణలో ఆ విషయాలేవీ ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి బయట పెట్టలేదని వారి రిమాండ్ రిపోర్టులో 'సిట్' వెల్లడించింది. మద్యం స్కామ్‌లో రిటైర్డు ఐఏఎస్ అధికారి, సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి (ఏ31) జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి(ఏ32)ని శుక్రవారం సిట్ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విజయవాడ ఏసీబీ కోర్టులో శనివారం వారిని ప్రవేశ పెట్టిన సిట్ అధికారులు అరెస్టు ఎందుకు చేశారో రిమాండ్ రిపోర్టులో కోర్టుకు వివరించారు.

దందాలో కీలకం..

రిమాండ్ రిపోర్టును అనుసరించి.. భారతదేశంలోనే అతి పెద్ద మద్యం కుంభకోణం 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీ పాలనలో జరిగింది. మద్యం పాలసీని స్వప్రయోజనాలకు అనువుగా రూపొందించడం దగ్గర నుంచి ఉత్పత్తి, సరఫరా, బ్రాండ్లు, విక్రయాలు, కమీషన్ల వసూలు, అంతిమంగా ప్రధాన లబ్ధిదారుకు చేర్చడం వరకూ ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ప్రతి చోటా ఉన్నారు. 2019 ద్వితియార్థంలో లిక్కర్ పాలసీ రూపొందించడం నుంచి కమీషన్ల వసూలు వరకూ ఏది ఎలా ఉండాలనే విషయమై ఇతర నిందితులతో జరిగిన సమావేశాల్లో వారు పాల్గొన్నారు. ఈ సమావేశాలు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకు వెనుక ఉన్న ఇంట్లోనూ.. విజయవాడ ఎలమంచిలి హైట్స్‌లోని మూడో అంతస్తులోనూ తరచూ జరిగేవి. ప్రభుత్వమే మద్యం విక్రయాలు జరిపేలా పాలసీ రూపొందించిన తర్వాత ఏ బ్రాండ్లు విక్రయించాలి.. ఏవి అణగ దొక్కాలి.. అనే బాధ్యత చూసుకోవడానికి డిప్యుటేషన్‌పై కొందరిని ఏపీకి తెచ్చి కీలక స్థానాల్లో నియమించారు. అలా కేంద్ర సర్వీసుల్లో ఉన్న వాసుదేవ రెడ్డిని, ఏపీ అబ్కారీ శాఖ అధికారి సత్య ప్రసాద్‌ను ధనుంజయ్ రెడ్డి సూచనతోనే రాష్ట్రానికి తెచ్చారు. ఆ తర్వాత మద్యం బ్రాండ్లు అనుకున్నట్లు వెళుతున్నాయా...ప్రతి వారం కలెక్షన్లు వస్తున్నాయా.. ఏపీఎస్‌బీసీఎల్ బిల్లు ఇచ్చిన వెంటనే నగదు రూపంలో మద్యం వ్యాపారులు కమీషన్లు అనుకున్నంత ఇస్తున్నారా...అనే పర్యవేక్షణ జగన్ కుటుంబంతో సన్నిహితంగా ఉండే ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డే పర్యవేక్షించారు. రాజ్ కసిరెడ్డి కార్యాలయానికి ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తరచూ వెళ్లి కార్ల డిక్కీల్లో నగదు సంచులు పెట్టుకుని వచ్చేవారు. ప్రధాన లబ్ధిదారుకు చేర్చాల్సిన సింహభాగం చేర్చేసి వారిద్దరు భారీగానే లబ్ధి పొందారు. ఐదేళ్లలో మూడున్నర వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఈ సిండికేట్‌లో మాజీ సీఎం కార్యదర్శి, ఓఎస్డీతోపాటు బాలాజీ గోవిందప్ప ముఖ్యులు. ఈ కేసులో ఇతర నిందితులు, సాక్షులు, ఎక్సైజ్ అధికారులు, మద్యం వ్యాపారులను విచారించాం. వారిలో మెజారిటీ వ్యక్తుల వేళ్లు ఈ ముగ్గురి వైపే చూపించాయి. రాజ్ కసిరెడ్డి నుంచి ఈ ముగ్గురే తరచూ డబ్బులు తీసుకెళ్లే వారని క్యాష్ హ్యాండ్లర్స్‌లో కీలక వ్యక్తి బూనేటి చాణక్య వెల్లడించారు. దీనిపై ఆధారాలతో సహా ప్రశ్నించినా ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఏ మాత్రం సహకరించలేదు. ప్రతి నెలా యాభై నుంచి అరవై కోట్ల రూపాయల మద్యం ముడుపులు వసూలు చేసిన ఈ వ్యక్తులు అత్యంత శక్తివంతులు. వీరు బయట ఉంటే విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నందున అరెస్టు చేశాం. ఈ కుంభకోణంలో ఈ ఇద్దరిని విచారించి మరిన్ని కీలక అంశాలు వెలికి తీయాల్సి ఉందని కోర్టుకు సిట్ తెలిపింది.

కమీషన్ రాజ్ నడిపారు..

మద్యం బ్రాండు, నాణ్యతతో సంబంధం లేకుండా ఎవరు కమీషన్లు ఇస్తే వారికి ఆర్డర్లు ఇచ్చారని సిట్ తన రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. అలా చేసేందుకే తన మనుషులను ఏపీఎస్‌బీసీఎల్‌లో ధనుంజయ్ రెడ్డి నియమించుకున్నారని వెల్లడించింది. ఈ వ్యవహారంలో ధనుంజయ్ రెడ్డి రూ. వందల కోట్లు గడించి, ఆ సొమ్ముతో ఆస్తులు, విలాసవంతమైన వాహనాలు కొన్నారని స్పష్టంచేసింది. మరోవైపు ఇదే సిండికేట్‌లో కీలకంగా వ్యవహరించిన కృష్ణమోహన్ రెడ్డి లిక్కర్ బ్రాండ్ల ఎంపిక, సరఫరాదారులతో సంప్రదింపులు చేపట్టేవారు. తన పాత్ర తాను పోషించి తాను తీసుకున్న సొమ్మును రియల్ ఎస్టేట్, బులియన్ మార్కెట్లలో ఆయన పెట్టారని తెలిపింది.



కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డిలను విజయవాడ జైలుకు తీసుకువెళుతున్న పోలీసులు

అధికార విధులు దాటి అక్రమాలు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ విచారణకు కాంపిటెంట్ అథారిటీ అనుమతి అక్కర్లేదు

- ఇది సాధారణ కేసు కాదు : ప్రాసిక్యూషన్
- కేసు ఏసీబీ కోర్టు పరిధిలోకి రాదు: నిందితులు
- 20 వరకు రిమాండ్.. జైలులో పడక, దిండు, దుప్పటి
- సౌకర్యాలు కల్పించాలని కోర్టు ఆదేశం

విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి) : సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి , జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అధికార విధులను దాటి మద్యం పాలసీలో వేలు పెట్టి అక్రమాలు చేశారని ప్రాసిక్యూషన్ తరఫు ఏడీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వైసీపీ హయాంలో మద్యం కంపెనీలనుంచి ముడుపులను భారీగా పొందడానికి ప్రణాళికను రూపొందించడంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా ఉంటూ అధికార దుర్వినియోగం చేశారన్నారు. దోచుకున్న రూ.3500 కోట్లు అంతిమంగా ఎక్కడికి ఏ ఏ మార్గాల్లో చేరిందో తేల్చడానికి కస్టడీలోకి తీసుకుని విచారించాల్సి ఉందని తెలిపారు. నిందితుల తరఫున మాజీ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో దీనికి ప్రత్యేక పోలీసు స్టేషన్ కల్పించారన్నారు. దానిప్రకారం సిట్ దర్యాప్తు చేసిన కేసు విచారణ ఏసీబీ కోర్టు పరిధిలోకి రాదన్నారు. సిట్, సీఐడీ ఒకటి కావని తెలిపారు. కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని చెబుతున్న సిట్ దానికి సంబంధించి ఆధారాలను చూపించడం లేదన్నారు. ధనంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ అధికారులుగా పనిచేశారని, వారిని విచారించడానికి సిట్ కాంపిటెంట్ అథారిటీ అనుమతి తీసుకోలేదని వివరించారు. సిట్ అధికారులు రిమాండ్ రిపోర్టును తప్పుగా రూపొందించారన్నారు. పోలీసుల కస్టడీలో ఉండగానే కస్టడీకి ఇవ్వాలని రాశారన్నారు. దీనిపై ఏడీ రాజేంద్ర ప్రసాద్ స్పందిస్తూ.. వారిని విచారించడానికి కాంపిటెంట్ అథారిటీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం న్యాయాధికారి పి.భాస్కరరావు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి ఈనెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఈ సమయంలో నిందితులు.. తమకు జైలులో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు వారికి పడక, దిండు, దుప్పటి, కమోడ్ సముదాయాలు ఇవ్వాలని న్యాయాధికారి ఆదేశించారు. తామిద్దరికీ ఒకే గది కేటాయించాలని కోరగా, ఆ విషయం అక్కడి పరిస్థితులను బట్టి జైలు అధికారులు నిర్ణయిస్తారని కోర్టు తెలిపింది. అనంతరం వారిద్దరిని విజయవాడ జైలుకు తరలించారు. పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా అని ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని న్యాయాధికారి పి.భాస్కరరావు ప్రశ్నించారు. దానికి వారు లేదని సమాధానం ఇచ్చారు. తాము అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. మూడు రోజులుగా సిట్ అధికారుల ముం దు విచారణకు హాజరయ్యామని, తెలియని అంశాలపై పదే పదే ప్రశ్నించారని న్యాయాధికారికి వివరించారు.



కోర్టుకు హాజరైన సజ్జల శ్రీధర్‌రెడ్డి

ముగిసిన 'సజ్జల' కస్టడీ

విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి): మద్యం స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి కస్టడీ శనివారంతో ముగిసింది. విచారణ ముగిసిన అనంతరం ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి ఏసీబీ కోర్టుకు తీసుకొచ్చారు. విచారణలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా? అని న్యాయాధికారి ప్రశ్నించారు. అలాంటిదేమీ లేదని ఆయన సమాధానం ఇచ్చారు. మద్యం కేసుతో తనకి ఎలాంటి సంబంధం లేదని శ్రీధర్‌రెడ్డి న్యాయాధికారి భాస్కరరావుకు వివరించారు. 20వ తేదీన తనకు రిమాండ్ పొడిగింపు ఉందని, అప్పుడు ఐదు నిమిషాలు సమయం ఇవ్వాలని కోరారు. తాను చెప్పుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయని, అందుకోసమే ఈ విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. చెప్పాలనుకున్న విషయాలను రాతపూర్వకంగా అందజేయాలని న్యాయాధికారి ఆదేశించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని జిల్లా జైలుకు తరలించారు.

గోవిందప్పకు ప్రత్యేక సదుపాయాలు

- ఏసీబీ కోర్టు ఆదేశం



విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి, విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న గోవిందప్ప బాలాజీకి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు శనివారం ఆదేశాలు జారీచేశారు. తనకు ఏ లేదా బీ క్లాస్ బ్యారక్ కేటాయించాలని, ఇంటి నుంచి భోజన సదుపాయం, న్యాయవాదితో ములాఖత్‌లు పెంచాలని కోరుతూ గోవిందప్ప పిటిషన్ వేశారు. దీనిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. గోవిందప్ప బాలాజీ నిద్రపోవడానికి మంచం, దిండు, దుప్పటి ఏర్పాటు చేయాలని అందులో పేర్కొన్నారు. ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించే విషయంపై జైలు అధికారి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏ లేదా బీ క్లాస్ కేటగిరి బ్యారక్‌ను కేటాయించే అంశాన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు.



ఏసీబీ కోర్టు హాలు వద్దకు వెళుతున్న విడదల రజని, అప్పిరెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు

నాడు.. నేడు అదే క్యూ!

- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను కలిసేందుకు భారీగా వైసీపీ నేతలు
- ఏసీబీ కోర్టు హాలు నిండా వాళ్లే
- వారిద్దరిని జైలుకు తరలించే వరకు అక్కడే..
- నల్లకోటు ధరించిన చెవిరెడ్డి, గౌతంరెడ్డి

విజయవాడ, మే 17(ఆంధ్రజ్యోతి): ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి... ఈ ఇద్దరి దర్శనం కోసం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు తాడేపల్లిలోని జగన్ ఇంటి వద్ద క్యూ కట్టేవారు. ఆ ఇద్దరిని ఇప్పుడు మద్యం కుంభకోణంలో సిట్ అరెస్టు చేసింది. వైసీపీ నేతలు నాటిలాగే ఇప్పుడు కూడా క్యూ కట్టారు. సిట్ అధికారులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో విచారించారు. అక్కడికి వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవినేని అవినాశ్ వచ్చారు. వారిద్దరిని అరెస్టు చేసిన తర్వాత సిట్ అధికారులు శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. దీనికి ముందు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ఈ రెండు చోట్లకు కూడా వైసీపీ నేతలు భారీగా వచ్చారు. వారిని కోర్టుకు తీసుకురాగానే మాజీ మంత్రులు విడదల రజని, వెల్లంపల్లి శ్రీనివాసరావుతో పాటు రఘురాం, అరుణ్‌కుమార్, లేళ్ల అప్పిరెడ్డి, మల్లాది, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌తోపాటు మరికొంతమంది కోర్టు హాలు వద్దకు చేరుకున్నారు. న్యాయాధికారి రావడానికి ముందు నిందితులను కోర్టు హాలు బయట కూర్చోబెట్టారు. అక్కడికి వాళ్లంతా వెళ్లారు. రజని వారిని కలిసి కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. తలశిల, మల్లాది, అవినాశ్, అప్పిరెడ్డి మాత్రం వారికి రిమాండ్ విధించిన తర్వాత జైలుకు తరలించే వరకు ఉన్నారు. చివరి నిమిషంలో మాజీ మంత్రి జోగి రమేశ్ వచ్చారు. మద్యం కేసులో ఇప్పటి వరకు ఏడుగురు అరెస్టయ్యారు. విగతా వారిని కోర్టులో హాజరుపరిచినప్పుడు రాని ఈ వైసీపీ నేతలంతా ఇప్పుడు రావడంతో వారిద్దరి హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. 'ధనుంజయ్‌రెడ్డి అప్పటి సీఎంఓలో ఉన్నప్పుడు కలవడానికి ఈ విధంగానే గంటల కొద్దీ కుర్చీల్లో కూర్చునేవాళ్లం. ఇప్పుడూ అదే పరిస్థితి ఉంది' అని కోర్టు హాలులో ఓ నాయకుడు వ్యాఖ్యానించడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, గౌతంరెడ్డి నల్లకోటు ధరించి న్యాయవాదులుగా కోర్టు హాల్లో కూర్చున్నారు.



మాతానందగిరిస్వామిని ఆలయంలోకి భుజాలపై మోసుకెళుతున్న ఉంగరాల సుబ్రహ్మణ్య శాస్త్రి

సనాతన ధర్మ రక్షణకు మునివాహన సేవ

- దళిత పీఠాధిపతిని భుజాలపై మోసిన బ్రాహ్మణ పీఠాధిపతి
- తిరుపతి జిల్లా రాయలచెరువుపేటలో నిర్వహణ

రామచంద్రాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ రక్షణ కోసం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువుపేట ఛాయామార్తాండ శనైశ్చర దేవస్థానం వద్ద శనివారం మునివాహన సేవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లిలో దళిత వర్గానికి చెందిన మాతంగి మహాపీఠం పీఠాధిపతి మాతానందగిరి స్వామిని ఛాయా మార్తాండ పీఠాధిపతి ఉంగరాల సుబ్రహ్మణ్య శాస్త్రి తన భుజాలపై మోసుకుంటూ ఆలయంలోకి తీసుకెళ్లి సత్కరించారు. అంతకుముందు మాతానందగిరిస్వామికి పాదపూజ చేశారు. మహాభక్తుడిని భగవంతుడిగా పూజించడమే ముని వాహనసేవ అని పేర్కొన్నారు. సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె. శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, సనాతన ధర్మ రక్షణ కోసం ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. మన దేశంలో 2,700 సంవత్సరాల క్రితం ఈసేవ ఉండేదన్నారు. మాతానందగిరి స్వామి మాట్లాడుతూ.. రామానుజాచార్యులు, ఆది శంకరాచార్యుల పరంపరంగా హిందూ చైతన్యాన్ని పెంపొందిస్తున్నామన్నారు. సమరసత సేవ ఫౌండేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎం.లీలాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.మన్మథరావు, కన్వీనర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుజనాకు చంద్రబాబు పరామర్శ



సుజనాను పరామర్శిస్తున్న చంద్రబాబు

హైదరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరిని సీఎం చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఇటీవలే సింగపూర్‌కు వెళ్లిన సుజనా చౌదరి అక్కడ ప్రమాదవశాత్తు జారిపడ్డారు. హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. పరామర్శ అనంతరం సుజనా, చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. 'వారి ఆదరణ, ఆశీస్సులు నాకు ఎల్లప్పుడూ బలాన్నిస్తాయి. భగవంతుని ఆశీస్సులతో త్వరలో కోలుకుని ప్రజాసేవకు పునరంకితం అవుతా' అని అన్నారు.

బదిలీల్లో తేడాలు జరిగితే అధికారులదే బాధ్యత

- వ్యవసాయశాఖ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో వ్యవసాయశాఖలోనూ బదిలీలకు చర్యలు మొదలయ్యాయి. జిల్లా, జోనల్, స్టేట్ లెవల్ పోస్టులను ఉటంకిస్తూ, ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన శాఖాపరమైన మార్గదర్శకాలను డైరెక్టర్ ఢిల్లీరావు శనివారం జారీ చేశారు. బదిలీల్లో ఏవైనా వ్యత్యాసాలు జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 2025 మే 31నాటికి ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగుల జాబితాను కేడర్ వారీగా పూర్వ జిల్లాల వ్యవసాయ అధికారులందరూ ఈనెల 19లోపు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా డైరెక్టరేట్‌కు అందించాలని ఆదేశించారు.

సీజనొస్తున్నా.. సరఫరా చేయరా?

- రాయితీ విత్తన పంపిణీలో తాత్సారం
- బడ్జెట్‌లో 240 కోట్లు కేటాయింపు
- 40శాతం కోత పెట్టాలంటున్న ఆర్థిక శాఖ?
- ఇంకా నిధులు విడుదల చేయని వైనం
- విత్తన సరఫరాదారులకు గత ప్రభుత్వం 800 కోట్లు బకాయి
- రాష్ట్రానికి రుతుపవనాలు వచ్చేసరికి విత్తనాలు అందించాలంటున్న రైతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయి. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. కానీ రైతులకు రాయితీ విత్తనాల సరఫరాలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయి. ఏటా ఈపాటికే ఏపీ సీడ్స్ నుంచి వరి, వినుము, పెసర, కంది, వేరుశనగ, ఉలవ, సజ్జ, రాగి విత్తనాలు రైతులకు పంపిణీ కోసం మండల కేంద్రాలకు చేరేవి. ఈ ఏడాది ఇంత వరకు వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ కూడా పెట్టలేదు. విత్తన రాయితీకి సంబంధించిన నిధులు ఆర్థిక శాఖ నుంచి ఇంకా విడుదల కాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 2024 ఖరీఫ్‌లో రూ.200 కోట్ల రాయితీతో వరి, అపరాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు కలిపి 6.32 లక్షల క్వింటాళ్లు రైతులకు సరఫరా చేశారు. 2024-25 రబీలో విత్తన రాయితీకి ప్రభుత్వం రూ.130 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్ల విత్తన రాయితీకి బడ్జెట్‌లో రూ.240 కోట్లు కేటాయించారు. ఈ మేరకు విత్తన పంపిణీకి వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. కానీ ఆర్థిక శాఖ ఇంత వరకు నిధులు విడుదల చేయలేదు. పైగా ఖజానాపై అనేక రకాలుగా భారం పడుతుండటంతో రాయితీ విత్తన సరఫరాను 40 శాతానికి కుదించాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది. ప్రస్తుత ఖరీఫ్‌లో రాయితీ విత్తన పంపిణీకి రూ.150 కోట్లకు పైగా అవసరం ఉండగా, నిధుల విడుదలపై ఆర్థిక శాఖ నుంచి స్పందన లేదు. కనీసం మొదటి త్రైమాసికానికి ఇవ్వాల్సిన నిధులు కూడా రాక.. వ్యవసాయ శాఖ కూడా అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బకాయి, వడ్డీల భారం

గత ప్రభుత్వం ఐదేళ్లలో విత్తన సరఫరాదారులకు రూ.800 కోట్లు బకాయిలు పెట్టింది. ఈ బకాయికి నెలకు రూ.8 కోట్లు దాకా వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. బకాయి పేరుకుపోవడంతో సరఫరాదారులు మళ్లీ అప్పు ఇచ్చేందుకు ముందుకు రావట్లేదు. మరోవైపు పాత బకాయిలకు వడ్డీలకు నిధులు సర్దుబాటు చేయలేక వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. నిధుల కొరత సాకుతో ఆర్థిక శాఖ ఈ ఏడాది ఇంత వరకు విత్తన రాయితీకి నిధులు విడుదల చేయకపోవడం.. కొత్త అప్పు పుట్టకపోవడంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తలలు బాదుకుంటున్నారు. మరోవైపు పంటల సాగు సీజన్ ప్రారంభం కానుండటంతో



రైతులు రాయితీ విత్తనాల కోసం కొన్ని రోజులుగా స్థానిక వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమ రైతులు వేరుశనగ, రాగి, సజ్జ వంటి రాయితీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. సకాలంలో విత్తనాలను రైతులకు అందించలేకపోతే అనేక సమస్యలు వస్తాయని క్షేత్రస్థాయి సిబ్బంది కూడా భావిస్తున్నారు. ఏటా విత్తనాల ధరలు పెరిగిపోతుండటంతో రాయితీపై విత్తనాలు అందితేనే పంట వేసే పరిస్థితి ఉంటుందని వెనుకబడిన ప్రాంతాల సన్న, చిన్నకారు రైతులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాయితీ విత్తన పంపిణీపై ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

భూసారం పెంపుదలకు ఉపయోగపడే, పచ్చిరొట్ట ఎరువులుగా వాడే జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను వ్యవసాయ శాఖ డీ కృషి యాప్ ద్వారా రైతులకు పంపిణీ చేస్తోంది. ఒక్కో రైతుకు ఐదెకరాలకు సరిపడా విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తోంది. తొలిసారిగా 10 కిలోల పచ్చిరొట్ట విత్తనాల మిశ్రమ సంచులను అందిస్తోంది. ఒక్కో ప్యాకెట్ ధర రూ.1,296 కాగా, రాయితీపై రూ.648కే ఇస్తోంది. కాగా ఈ ఏడాది రాష్ట్రానికి 1,736 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాల సరఫరాకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మరికొన్ని ప్రాంతాలకు 'నైరుతి' విస్తరణ

- రాష్ట్రంలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు
- 22న అరేబియా సముద్రంలో అల్పపీడనం
- నేడూ, రేపూ వానలు
- ముందస్తు రుతుపవనాలతో అప్రమత్తం:సీఎస్
- విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



విశాఖపట్నం, అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతంలో పలు ప్రాంతాలు, అండమాన్ దీవులు, అండమాన్ సముద్రంలో మిగిలిన భాగాలు, తూర్పుమధ్య బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాల వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో దక్షిణ మధ్య, ఈశాన్య బంగాళాఖాతం, అరేబియా సముద్రం, కొమరిన్‌లో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని శనివారం భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ నెల 21వ తేదీకల్లా కర్ణాటకను ఆనుకొని తూర్పు మధ్య అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరిస్తుందని, దాని ప్రభావంతో 22న అల్పపీడనం ఏర్పడుతుందని, ఆ తరువాత ఇది బలపడి వాయవ్యదిశగా పయనిస్తుందని తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం నుంచి మధ్య కోస్తాంధ్ర వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. చిత్తూరు జిల్లా దామోదర మహారాజపురంలో 49, ప్రకాశం జిల్లా డీజీపేటలో 47.7, కర్నూలులో 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనేకచోట్ల ఉక్కపోత పెరిగింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 41.3, ప్రకాశం జిల్లా కొనకనమిట్ల, పల్నాడు జిల్లా రావిపాడులో 40.3, ఏలూరు జిల్లా ఎస్ రాఘవాపురంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని, ఎండతీవ్రత కొనసాగుతుందని ఐఎండీ తెలిపింది. రానున్న రెండు రోజులు అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కరించండి: సీఎస్

ముందస్తు రుతుపవనాల ప్రభావంతో కురిసే గాలివాన పట్ల విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ కె.విజయానంద్ ఆదేశించారు. ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల అధికారులతో సీఎస్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలం ముగిసేంత వరకూ డిస్కమ్‌ల సీఎండీలు రోజువారీ సమీక్షలు కొనసాగాలని నిర్దేశించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి రోజంతా విద్యుత్ సరఫరాను సమీక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్, సంతోషరావు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



7,715 గ్రూపులుగా సచివాలయాలు

- భౌగోళిక పరిస్థితులను బట్టి గ్రూపింగ్
- 15,004 గ్రామ, వార్డు సచివాలయాల విభజన
- ఉద్యోగులూ వర్గీకరణ.. జనాభాను బట్టి నియామకం
- ప్రతి గ్రామ సచివాలయానికి ఒక ఏఎన్‌ఎం
- ప్రతి 'వార్డు'కు హెల్త్, శానిటేషన్ సెక్రటరీలు

అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను గ్రూపులుగా విభజించి, ఆయా సచివాలయాల్లోని ఉద్యోగులను వర్గీకరించారు. శనివారం గ్రామ, వార్డు సచివాలయ శాఖ దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. భౌగోళిక పరిస్థితులను బట్టి రెండు లేక మూడు సచివాలయాలను ఒక గ్రూపుగా.. మొత్తం 15,004 సచివాలయాలను 7,715 గ్రూపులుగా విభజించాలని ఇదివరకే కలెక్టర్లు ప్రతిపాదనలు చేయగా, వాటికి ఆమోదముద్ర వేసింది. ఆయా సచివాలయాల్లో జనాభాను బట్టి ఏయే కేటగిరి పోస్టులు నియమించాలో, ఏయే కేటగిరి టెక్నికల్ సిబ్బంది ఉండాలో నిర్ణయించింది. ప్రతి గ్రామ సచివాలయానికి ఒక ఏఎన్‌ఎంను తప్పనిసరి చేశారు. అదే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేక ఎనర్జీ అసిస్టెంట్‌ను, వీఆర్వో లేక సర్వే అసిస్టెంట్‌ను నియమించారు. గ్రూపులో ఆయా ప్రాంతాల్లో సాగు పరిస్థితిని బట్టి అగ్రికల్చర్/హార్టికల్చర్/సెరికల్చర్ అసిస్టెంట్లలో ఒకరిని, అదేవిధంగా పశు సంపదను బట్టి ఫిషరీస్/వెటర్నరీ అసిస్టెంట్ ఒకరిని నియమించారు. ప్రతి వార్డు సచివాలయానికి వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు అమెనిటీస్ సెక్రటరీ/వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ, వార్డు రెవెన్యూ సెక్రటరీ/వార్డు ఎనర్జీ సెక్రటరీలను నియమించారు. ఆయా సచివాలయాల గ్రూపునకు అవసరాన్ని బట్టి అదనపు టెక్నికల్ సిబ్బందిని నియమించారు. అగ్రికల్చర్/హార్టికల్చర్/సెరికల్చర్ అసిస్టెంట్లను ఆయా ప్రాంతాల సాగును బట్టి అదనంగా నియమించారు. పశుసంపదను బట్టి ఫిషరీస్ అసిస్టెంట్/వెటర్నరీ అసిస్టెంట్‌లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సచివాలయాల గ్రూపులుండి, అక్కడ టెక్నికల్ సిబ్బందిని తగిన సంఖ్యలో నియమించకుండా ఉంటే.. ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్/వీఆర్వో/సర్వే అసిస్టెంట్లను అవసరమైన సంఖ్యలో నియమించారు. అదేవిధంగా వార్డు సచివాలయాల్లో వార్డు అమెనిటీస్ సెక్రటరీలను అదనంగా నియమించారు. అదనపు సిబ్బంది ఉద్యోగ పరిధిని స్థానికంగా నిర్ణయిస్తారు. గ్రామ, వార్డు సచివాలయాల గ్రూపింగ్, గ్రామ, వార్డు సచివాలయాల టెక్నికల్ సిబ్బంది వివరాలను గ్రామ, వార్డు సచివాలయ శాఖ విడుదల చేసింది.

పాక్‌కు సైనిక రహస్యాలు

న్యూఢిల్లీ, మే 17 : హరియాణాలోని హిస్సార్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా ఓ యూట్యూబర్... ఆమెను అనుసరించేవారు లక్షల మంది... ట్రావెల్ బ్లాగర్‌గా పాక్ వెళ్లిన ఆమె గూఢచర్యం బాట పట్టారు... పంజాబ్, హరియాణా, రాజస్థాన్, లద్దాఖ్‌లలోని భారత సైనిక పోస్టుల ముందు, వైమానిక దళ బేస్‌ల ముందు, డీఆర్‌డీవో టెస్ట్ రేంజిల ముందు దేశ భక్తి గీతాలు పాడుతూ... వందనం చేస్తూ ఏడాదిగా వీడియోలను అప్‌లోడ్ చేసింది. వీటిని చూస్తే ఎవరికీ ఆమె మీద అనుమానం రాదు.. వీటిలో జాతీయ జెండా ఎగురవేయడం, బీటింగ్ రిట్రీట్ కార్యక్రమాలు, గన్ సెల్యూట్‌ల వంటివి కనిపిస్తాయి. కాని వీటన్నిటి వెనుకా లోతైన గూఢచర్యం ఉందని హరియాణా పోలీసులు తెలిపారు. హై రిజిల్యూషన్‌తో సైనికంగా సున్నిత ప్రాంతమంతా కనిపించేలా చిత్రీకరించడం, జీపీఎస్ ట్యాగ్‌లు, డ్రోన్‌లతో ఆయా సైనిక, వైమానిక బేస్‌లను, సైనిక వాహనాల బేలను, అక్కడి ఎలక్ట్రానిక్ సెన్సార్లను చిత్రీకరించి వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లకు చేరవేసిందని పేర్కొన్నారు. ఈ కేసులో జ్యోతి మల్హోత్రాని శనివారం అరెస్టు చేయగా న్యాయస్థానం ఐదు రోజుల రిమాండ్ విధించింది.

ఇలా పట్టేశారు...

చిత్రీకరించిన సైనికపరంగా సున్నితమైన వీడియోల ఫుటేజీ మొత్తాన్ని ఆమె వెంటనే పాక్ హై కమిషన్ కార్యాలయం నుంచి భారత్ బహిష్కరించిన ఉద్యోగి అహ్‌సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ నంబరుకు పంపిస్తోందని హరియాణా-పంజాబ్ సైబర్ సెల్ పోలీసులు గుర్తించారు. పోలీసులు అరెస్టు చేసిన మరో ఐదుగురి వద్దా ఆ నెంబరును గుర్తించారు. 'ఆపరేషన్ గోస్ట్ సిమ్' పేరిట చేసిన పరిశోధనలో వీరందరిని గుర్తించి అధికారిక రహస్యాలు అక్రమంగా చేరవేసిన కేసులో అరెస్టు చేశారు.


ఇఫ్తార్ విందులో...

మల్హోత్రా గత ఏడాది మార్చిలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం కనిపిస్తోంది. ఇందులో అక్కడి ఏర్పాట్లను ఆమె ఎంతో మెచ్చుకున్నారు. పాకిస్థాన్ మరెన్నోసార్లు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంభాషిస్తూ ఆమె ఆ వీడియోలో కనిపించారు. గతంలో తాము కలుసుకున్న సందర్భాలనూ ప్రస్తావించారు. అతడి భార్యతోనూ చనువుగా మాట్లాడారు. సాధారణ పరిచయాన్ని మించిన సన్నిహితత్వం వారి మధ్య కనిపించింది. కాగా జ్యోతి మల్హోత్రాతో పాటు మరో ఇద్దరు మహిళలు, ముగ్గురు యువకులను హరియాణా పోలీసులు ఈ కేసులో అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తర భారతమంతా విస్తరించినట్లు భావిస్తున్నారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతోన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్థాన్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. ఇతడు జ్యోతికి పలువురు పాకిస్థాన్ ఏజెంట్లను పరిచయం చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా జ్యోతి వారితో టచ్‌లో ఉంది. షకీర్ అలియాస్ రాణా షహబాజ్ అనే పాక్ ఏజెంట్ వారిలో ఒకడు. అతడి నంబరును జాట్ రణ్‌ధావా పేరుతో జ్యోతి సేవ్ చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో పాక్ గురించి మంచిగా ప్రచారం చేసేందుకు ఈమెను ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక పాక్ ఏజెంట్‌కు బాగా దగ్గరయిన జ్యోతి అతడితో ఇండోనేషియా పర్యటనకూ వెళ్లింది. కాగా డానిష్‌ను ఈ నెల 13న కేంద్రం అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించింది. జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన మరో వితంతు మహిళ గుజాల(32) కూడా ఈ కేసులో కీలక నిందితురాలు. వీసా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో పాక్ హై కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆమెకు డానిష్ పరిచయమయ్యాడు. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. పెళ్లి చేసుకుంటానని డానిష్ ఆమెకు దగ్గర అయ్యాడు. ఏప్రిల్ 23న గుజాల మలేర్‌కోట్లకే చెందిన వితంతు మహిళ బాను నస్రీనను పాక్ హై కమిషన్ కార్యాలయానికి తీసుకువెళ్లగా డానిష్ ఆమెకు మరుసటి రోజే పాక్ వీసా ఇప్పించాడు. కాగా ఈ కేసులో అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు మలేర్‌కోట్లకు చెందిన యమీన్ మహమ్మద్, పటియాలలోని ఖల్సా కళాశాల విద్యార్థి దేవిందర్ సింగ్ ధిల్లాన్, నుహ్‌కు చెందిన అర్మాన్. యమీన్ డానిష్‌తో కలిసి ఆర్థిక, వీసా జారీ వ్యవహారాలు నడిపాడు. ధిల్లాన్ మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టల్ చిత్రాలను పోస్ట్ చేశాడు. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు పలు కీలక వివరాలు రాబట్టారు. గత ఏడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ వెళ్లిన అతడు అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేశానని వెల్లడించాడు. అందుకు తనకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టిందని చెప్పాడు. పటియాల కంటోన్మెంట్ వీడియోలూ ఇతడు పాక్‌కు పంపినట్లు గుర్తించారు. అర్మాన్ సిమ్ కార్డులు సమకూర్చడం, డబ్బు పంపిణీ వ్యవహారాలు చేశాడు. అంతేగాక పాక్ ఏజెంట్ల సూచనల మేరకు డిఫెన్స్ ఎక్స్‌పో-2025ని కూడా సందర్శించాడు. కాగా నిందితులంతా తమ నేరాలను అంగీకరించారు. పాక్ ఏజెంట్లు సమాజంలో మతపరంగా, సామాజికంగా సున్నిత మనస్తత్వం గలవారిని గుర్తించి డబ్బు, ప్రేమ, పెళ్లి పేరిట వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

వాషింగ్టన్, మే 17: ఇజ్రాయెల్ దాడుల్లో కకావికలమైన గాజా ప్రాంతం నుంచి పాలస్తీనీయులను ఖాళీ చేయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సుమారు పది లక్షల మంది పాలస్తీనా ప్రజలను శాశ్వతంగా లిబియాకు తరలించనున్నట్టుగా అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ.. ఎన్‌బీసీ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. దీనికి సంబంధించి లిబియా ప్రభుత్వంతో అమెరికా సీనియర్ అధికారులు చర్చలు జరుపుతున్నారని పేర్కొంది. పాలస్తీనా ప్రజల తరలింపునకు బదులుగా అమెరికా ఫ్రీజ్ చేసిన వేల కోట్ల రూపాయల లిబియా నిధులను విడుదల చేస్తామని ప్రతిపాదించినట్టు తెలిపింది. పూర్తిగా విధ్వంసమైన గాజా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి.. దానిని స్వేచ్ఛా ప్రాంతం(ఫ్రీడమ్ జోన్)గా అభివృద్ధి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు పాలస్తీనా తమ మాతృభూమి అని, దాన్ని రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పాలస్తీనా హమాస్ అధికారి బసెమ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ 'గిడియాన్స్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మంది మరణించారు.

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్ మాట!




న్యూయార్క్, మే 17: భారత సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100 శాతం సుంకాలను తగ్గించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ మళ్లీ మొదటికొచ్చారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం తానేమి తొందరపడటం లేదని చెప్పారు. తాజాగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు వ్యాపారాలు చేయడాన్ని దాదాపు అసాధ్యం చేస్తున్నారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో అమెరికాకు 100% సుంకాలు తగ్గించుకునేందు (జీరో టారిఫ్‌ల) కు సిద్ధంగా ఉన్నారు. ఆ దేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ విషయంలో నాకేం తొందరలేదు. మాతో ఒప్పందానికి చాలా దేశాలు ముందుకొస్తున్నాయి. అందరితో ఒప్పందాలంటే మా వల్ల కాదు. ప్రస్తుతం భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఇదివరకు ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. భారత్ తోసిపుచ్చింది.

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, మే 17(ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల విడుదలపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మే 4న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ తిరువళ్లూర్, రాణిపేట జిల్లాలకు చెందిన 13మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... ఫలితాల విడుదలపై స్టే విధించింది.

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది



నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి చేసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం ఆర్మీచీఫ్ అర్ధరాత్రి తెలిపారు
- ధ్రువీకరించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్

న్యూఢిల్లీ, మే 17 : ఆపరేషన్ సిందూర్ దెబ్బ బలంగా తగిలిన విషయం ఎట్టకేలకు దాయాది దేశం అంగీకరించింది. తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని పాకిస్థాన్ తొలిసారి ఒప్పుకొంది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ సహా పలు ప్రాంతాల్లోని ఎయిర్‌బేస్‌లపై ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా ధ్రువీకరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తమ ఎయిర్‌బేస్‌లు లక్ష్యంగా దాడులు జరిగినట్టు ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున, 2.30 గంటలకు, ఆర్మీ చీఫ్ మునీర్ ఫోన్‌చేసి తనకు తెలిపారని షెహబాజ్ వివరించారు. ఆయన ప్రకటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోను అనుసరించి.. ప్రధాని షరీఫ్ శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత క్షిపణులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఆయన అంగీకరించారని పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్‌ను ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. భారత్ దాడులను ఎదుర్కొనేందుకు స్వదేశీ సాంకేతికతతోపాటు చైనా తయారీ జెట్లను వైమానిక దళం ఉపయోగించిందని తెలిపారు. కాగా, పాక్ ప్రధాని వ్యాఖ్యల వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయా 'ఎక్స్'లో పంచుకున్నారు. "నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర స్థావరాలను భారత్ పేల్చివేసిందని స్వయంగా పాకిస్థాన్ అంగీకరించింది. పాక్‌లో బాగా లోపలకు చొచ్చుకెళ్లి మనం జరిపిన క్షిపణి దాడుల వార్తలతో అర్ధరాత్రి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిద్రలేశారు. ఆపరేషన్ సిందూర్ విధ్వంస విస్తృతి ఏ స్థాయిలో ఉన్నదనేది ఇది తెలియజేస్తోంది" అని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌ను కాదని థరూర్‌కు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని.. అఖిలపక్షం బృందాలకు పేర్లను పంపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్ పేర్లను రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. కేంద్రం మాత్రం ఏకపక్షంగా శశిథరూర్ పేరును ప్రకటించింది. దీన్ని బట్టి, ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, నామమాత్రంగా ఖర్గే, రాహుల్‌ను పేర్లివ్వాలని అడిగారని స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనపై మోదీ మౌనం వీడడం లేదని ఎద్దేవా చేశారు.



థరూర్, రవిశంకర్, బైజయంత్, సంజయ్‌కుమార్ ఝా, కనిమొళి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే

ఆ ఏడుగురు ఎంపీలు వీరే..

ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే సందేశాన్ని ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలోని సభ్య దేశాలతోపాటు.. ఇతర ప్రధాన భాగస్వామ్య దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఆరేడుగురు ఎంపీలతో పాటు.. సీనియర్ దౌత్యవేత్తలు, మాజీ రాయబారులుంటారు. ఈ బృందాలకు.. ఏడుగురు ఎంపీలు నేతృత్వం వహిస్తారు. వీరిలో నలుగురు అధికార ఎన్డీయే కూటమి, మరో ముగ్గురు విపక్ష ఇండియా కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు. ఈ జాబితాలో శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్‌ప్రసాద్(బీజేపీ), బైజయంత్ పాండా(బీజేపీ), సంజయ్‌కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-శరద్‌పవార్), శ్రీకాంత్ శిందే(శివసేన) ఉన్నారు. ఈ నెల 22 తర్వాత ఈ బృందాలు విదేశాలలో పర్యటించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం, పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఈ బృందాలు విదేశాలలో ప్రచారం చేస్తాయి.


పీవీ బాటలో మోదీ!

దౌత్య యుద్ధంపై మాజీ ప్రధాని పీవీ బాటనే ఇప్పుడు మోదీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 1994లో కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్ దుష్ప్రచారం చేసింది. జెనీవాలోని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పీవీ అప్పటి విపక్ష నేత వాజ్‌పేయి నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందాన్ని జెనీవాకు పంపించారు. ఆ బృందంలో అప్పటి జమ్మూకశ్మీర్ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షీద్, హామీద్ అన్సారీ ఉన్నారు. వీరి దౌత్య నీతితో పాక్ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. 2008లో కూడా ముంబై ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయముందనే సందేశాన్ని ప్రపంచదేశాలకు అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బృందాలను పంపారు. ఇప్పుడు మోదీ కూడా.. పాక్ కుతంత్రాలపై ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

డీ4 వ్యవస్థ కోసం బీఈఎల్, ఆర్మీ మధ్య ఒప్పందం

డ్రోన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దోహదపడే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ (ఐడీడీఐఎస్ లేదా డీ4)కు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ వ్యవస్థను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో, బీఈఎల్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. శత్రు డ్రోన్లను గుర్తించడంతోపాటు ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడానికి ఐడీడీఐఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇది గగనతల ముప్పుల నుంచి రక్షణ కల్పించడంలో కీలకంగా మారుతోంది. గత ఏప్రిల్ 7 తర్వాతి నుంచి అదనంగా రూ.572 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు బీఈఎల్ వెల్లడించింది. సంస్థ పొందిన ప్రధాన ఆర్డర్లలో ఐడీడీఐఎస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో(ఎస్‌డీఆర్), జామర్లు, విడిభాగాలు వంటివి ఉన్నాయి.

లోకం తీరు



తుర్కియేకు 'బ్యాండ్' పడింది

డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికలు రద్దు

న్యూఢిల్లీ/బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియేకు భారతీయుల నుంచి ఎడాపెడా దెబ్బలు తగులుతున్నాయి. బాయ్‌కాట్ తుర్కియే నిరసన ప్రభావం ఆదేశంపై గట్టిగా పడుతోంది. ఇప్పుడు డెస్టినేషన్ వెడ్డింగ్‌తో పాటు వస్త్ర వ్యాపారాన్ని బాయ్‌కాట్ ఎఫెక్ట్ తాకింది. ఆ దేశంలో వివాహాలను ప్లాన్ చేసుకున్న భారతీయ కుటుంబాలు మనసు మార్చుకున్నాయి. తుర్కియేలో వివాహ వేదికల బుకింగ్స్‌ను రద్దు చేసుకుంటున్నాయి. దీంతో ఆ పాకిస్థాన్ మిత్రదేశం ఈ ఏడాది సుమారు రూ.770 కోట్ల ఆదాయాన్ని కోల్పోనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్ ద్వారా ఏటా భారతీయుల నుంచి తుర్కియే పర్యాటకానికి సుమారు రూ.1,198 కోట్లు సమకూరుతున్నాయని, ఇప్పుడు అది ఆగిపోవడం వారికి భూకంపం లాంటి దెబ్బేనని ప్రముఖ వెడ్డింగ్ ప్లానింగ్ కంపెనీ ప్రతినిధి నికిల్ మహాజన్ చెప్పారు. కాగా ఇటీవల కాలంలో భారతీయుల డెస్టినేషన్ వెడ్డింగ్‌కు తుర్కియే హాట్‌స్పాట్‌గా మారింది. ఇస్తాంబుల్‌లోని పురాతన ప్యాలెస్‌లు, బోడ్రమ్‌లోని తీర ప్రాంత అందాలు కాబోయే జంటలను బాగా ఆకర్షిస్తున్నాయి. ఇప్పుడు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత పాక్‌కు తుర్కియే మద్దతు ఇచ్చిన నేపథ్యంలో ఆ దేశంలో 30 డెస్టినేషన్ వివాహాల బుకింగ్స్‌ను భారతీయులు రద్దు చేసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపు చూస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఆ దేశం 90 మిలియన్ డాలర్లు (రూ.770 కోట్లు) నేరుగా నష్టపోతుందని విశ్లేషిస్తున్నారు. కాగా, తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలతో దుస్తుల వ్యాపారం కొనసాగించకూడదని బెంగళూరు హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (బీడబ్ల్యూసీఎంఏ) తీర్మానించింది. తుర్కియే నుంచి వస్త్రాల దిగుమతులను రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. వ్యాపారులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది.

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!



2016లో రెండు మెమోలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 17: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు ఆమోదముద్ర వేయాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటం మీద రాష్ట్రపతి తాజాగా ఆక్షేపణ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, బిల్లుల ఆమోదం గడువు విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ చెప్పలేదని, కేంద్రప్రభుత్వం గతంలో స్వయంగా విడుదల చేసిన కొన్ని అధికారిక ఉత్తర్వులనే ప్రస్తావించి, వాటిని అమలు చేయాలని నిర్దేశించిందని తాజాగా వెల్లడైంది. ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించటం కోసం.. బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోపు ఆమోదించాలని సూచిస్తూ కేంద్ర హోంశాఖ 2016లో రెండు మెమోలు జారీ చేసింది. తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ జేబీ పార్థివాలా వీటి గురించి ప్రస్తావిస్తూ.. 'గవర్నర్ సిఫార్సు మేరకు అందిన బిల్లుల మీద మూడు నెలల్లోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొన్న గడువు సముచితమైనదేనని భావిస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర హోంశాఖ జారీ చేసిన తొలి మెమోను సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. 'స్పష్టమైన నిబంధనలున్నప్పటికీ, రాష్ట్రాల బిల్లులకు సంబంధించి అనవసర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించటానికి, రాష్ట్రాల నుంచి బిల్లు అందిన మూడు నెలల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. దీనిని కచ్చితంగా పాటించాలి' అని ఈ మెమో స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. అంతేకాదు, రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్లులలోని అంశాల ఆధారంగా సదరు బిల్లులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపటంలో కేంద్రహోంశాఖ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని, బిల్లులోని భాష, పదాల కూర్పు, రాజ్యాంగపరమైన ఆమోదాన్ని కలిగి ఉందా? అన్నవాటిని పరిశీలించటానికి కేంద్ర న్యాయ శాఖకు పంపాలని ఆ మెమో పేర్కొంది. బిల్లును అందుకున్న మంత్రిత్వశాఖ 15 రోజుల్లోపు తన స్పందన హోంశాఖకు తెలియజేయాలని, జాప్యం జరిగితే అందుకు కారణాలు తెలపాలని స్పష్టం చేసింది. నెలలోపు ఎటువంటి స్పందన లేకపోతే, సదరు శాఖకు ఆ బిల్లు మీద అభ్యంతరాలు లేవని భావించాలని తెలిపింది.

నెలలోపు రాష్ట్రాలు వివరణ ఇవ్వాలి

2016 ఫిబ్రవరి 4వ తేదీనే కేంద్రహోంశాఖ జారీ చేసిన రెండో మెమోను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. బిల్లు మీద సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు ఏమైనా అభ్యంతరాలున్నా, మరిన్ని వివరాలు కావాలని భావించినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితంగా తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలు నెలలోపు వివరణ ఇవ్వాలని ఈ మెమో పేర్కొంది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఉన్న వివిధ భాగస్వాములకు గడువు విధించటం అనేది.. రాజ్యాంగ విధులను నిర్దేశించే ఆర్టికల్ 201కు ఏ రకంగానూ విరుద్ధం కాదని జస్టిస్ పార్థివాలా స్పష్టం చేశారు. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపిన బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో వచ్చిన సర్కారియా, పూంఛీ కమిషన్లు చేసిన సిఫార్సులకు తగినట్లుగానే 2016లో కేంద్రం జారీ చేసిన మెమోలు ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

నేడు నింగిలోకి నిఘా నేత్రం



- పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నేడు నింగిలోకి మోసుకెళ్లనుంది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. ఒకటో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. కాగా, రాకెట్‌లో ద్రవ ఇంధనం, హీలియం, నైట్రోజన్ గ్యాస్‌ను నింపే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ వేదిక పైనున్న పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్‌ను పరిశీలించారు. రీశాట్-1బీ ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దేశ భద్రత, సైనిక అవసరాల కోసం దీన్ని ప్రయోగిస్తున్నారు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటితో జత కలవనుంది. ఇప్పటికే కార్టోశాట్-1 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ చిత్రాలు అందిస్తోంది. అయితే అది రాత్రివేళల్లో ప్రతికూల వాతావరణంలో ఉపయోగపడటం లేదు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ద్వారా ప్రయోగించే ఈవోఎస్-09 ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్స్ ఎపర్చర్ రాడార్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రెజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలు లభిస్తాయి.

ఐదేళ్ల దాకా సేవలు

ఈ ఉపగ్రహం ఐదేళ్లు సేవలందించనుంది. పాకిస్థాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని సున్నిత ప్రదేశాలపై ఈ ఉపగ్రహం కన్ను ఉంటుంది. దేశ సరిహద్దు రక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భం, ప్రకృతి వైపరీత్యాలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుంది. రీశాట్-1బీ ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 101 నిమిషాల తరువాత తన పని ప్రారంభిస్తుంది.

ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, మే 17: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థకు చెందిన నిద్రాణ దళాల(స్లీపర్ మాడ్యుల్)తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ 2023లో మహారాష్ట్రలోని పుణెలో ఐఈడీ తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో నిందితులు. రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. వీరి సమాచారం ఇచ్చిన వారికి ఎన్ఐఏ రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రకటించింది. తాజాగా వీరిద్దరూ ఇండోనేషియా రాజధాని జకర్తాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ.. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ సాయంతో అరెస్టు చేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్ఐఏ వీరిని అదుపులోకి తీసుకుంది.

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి!

- అమెరికాలో 7 నెలల చిన్నారికి అరుదైన 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ ముసునూరు కీలకపాత్ర



కిరణ్, రెబెక్కా

వాషింగ్టన్, మే 17: అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన చిన్నారి కేజే మల్డూన్. పుట్టుకతోనే ఏదో అనారోగ్యం. పరీక్షలు చేసిన వైద్యులు 'సీపీఎస్ 1'గా పిలిచే అరుదైన జన్యులోపంగా గుర్తించారు. సగటున ప్రతి 13 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే సమస్య. ఇలా పుట్టిన చిన్నారుల్లో చాలా మంది కొన్ని నెలల్లోనే చనిపోతారు. ఒకవేళ బతికినా మానసిక, శారీరక ఎదుగుదల సరిగా ఉండక.. జీవచ్ఛవంలా బతకాల్సిందే. లక్షల మందిలో ఒకరికి వచ్చే సమస్య కాబట్టి.. దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధనలు, ఔషధాల తయారీ వంటివేవీ లేవు. కానీ.. అమెరికా వైద్య నిపుణులు అత్యంత అరుదైన జన్యు సమస్యకు.. అంతే వినూత్నమైన 'జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్)' చికిత్స చేసి కేజే ప్రాణాలు నిలబెట్టారు. జన్యుమార్పిడి చికిత్సల్లో ఉపయోగించే క్రిస్పర్ విధానం సాయంతో.. ఆ చిన్నారిలోని జన్యువులోని రసాయనాల అమరికలో ఉన్న లోపాన్ని సవరించారు. ఇలా 'ఓ వ్యక్తిలోని జన్యులోపాన్ని వారికే ప్రత్యేకించిన (పర్సనలైజ్డ్/ కస్టమైజ్డ్ జీన్ ఎడిటింగ్ థెరపీ) చికిత్స'తో నయం చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

సరికొత్త విధానంలో రూపొందించి..


కేజే పుట్టిన రెండు వారాలకే అతడి కాలేయ కణాల్లోని ఓ జన్యువులో లోపాన్ని వైద్యులు గుర్తించారు. జీవక్రియల్లో భాగంగా మన శరీరంలో ఉత్పత్తయ్యే అమ్మోనియా, ఇతర విష పదార్థాలను నిర్వీర్యం చేసే ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేయడానికి ఆ జన్యువే కీలకం. దానిలో లోపం వల్ల ఆ ఎంజైమ్ సరిగా ఉత్పత్తిగాక.. శరీరంలో విష పదార్థాలు పేరుకుపోయి.. మెదడు దెబ్బతింటుంది. కోమాలోకి వెళ్లిపోయి, చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై ఫిలడెల్ఫియా పిల్లల ఆస్పత్రి నిపుణురాలు రెబెక్కా ఆర్లెన్స్ నిక్లాస్, పెన్సిల్వేనియా యూనివర్సిటీ వైద్య నిపుణుడు, భారత సంతతికి చెందిన కిరణ్ ముసునూరు బృందం ఫోకస్ చేసింది. వినూత్నమైన ప్రయోగాత్మక చికిత్స చేసేందుకు కేజే తల్లిదండ్రులు నికోల్, కైల్‌లను ఒప్పించింది. కణాల్లోని జన్యువులను కత్తిరించి.. ఏదైనా భాగాన్ని తొలగించడానికి, అవసరమైతే అతికించడానికి వీలయ్యే 'క్రిస్పర్ కాస్9' విధానాన్ని వినియోగించింది. కేజే కాలేయ కణాలను సేకరించి పరిశోధన చేసింది. అతడి కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి.. లోపం ఉన్న జన్యుభాగాన్ని మార్చేలా ఆదేశాలు ఇచ్చే పదార్థాన్ని రూపొందించింది. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజే (అప్పటికి ఏడు నెలల వయసు)కు దానితో చికిత్స చేసింది. రెండు నెలల పాటు పూర్తిగా పర్యవేక్షణ చేసి, చికిత్స విజయవంతమైందని తేల్చింది. ఇప్పుడు కేజే పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రత్యేకించిన చికిత్సలు చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మహిళలకు పంద్రాగస్టు కానుక

> వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ విశాఖకు రానున్నారు. ప్రపంచ దేశాలు గుర్తుంచుకునేలా, భారతదేశం గర్వించేలా యోగా ఉత్సవాలు నిర్వహిస్తాం.
> - ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజా వేదికకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలి. గత ప్రభుత్వం పట్టణాల్లో 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసిపోయింది. ఇప్పటికి 55 లక్షల టన్నులు తొలగించాం. ఇంకా 30 లక్షల చెత్త రోడ్లపైనే ఉంది. అక్టోబరు 2నాటికి రాష్ట్రంలో చెత్త లేకుండా చేయాలని మంత్రి నారాయణకు చెప్పాను. జపాన్‌లో రోడ్లపై చిన్న పేపర్ ముక్క కూడా వేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తారు. మనం కూడా అలవాటు చేసుకోవాలి. చెత్త నుంచి ఎనర్జీ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు రాష్ట్రంలో రెండు ఉన్నాయి. రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కడపలో కూడా ఈ ప్రాజెక్టులు రాబోతున్నాయి. వీటివల్ల పట్టణాల్లో 90 శాతం చెత్త విద్యుత్‌గా మారుతుంది. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తాం' అని అన్నారు.

175 రైతు బజార్లు

రైతుకు మంచి ధర, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలని 1998లో రైతు బజార్లను నేనే ప్రారంభించా. కూరగాయలు తీసుకువచ్చేందుకు పల్లెవెలుగు బస్సులు ప్రారంభించా. దళారి బెడద లేకుండా చేశాను. రూ.6 కోట్లతో కర్నూలు సీ క్యాంపు రైతుబజార్‌ను ఆధునీకరిస్తాం. రాష్ట్రంలో 125 రైతుబజార్లు ఉన్నాయి. వీటిని ఆదర్శ రైతుబజార్లుగా తయారు చేస్తాం. 175 నియోజకవర్గాల్లో 175 రైతుబజార్లు ఏర్పాటుచేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు అందిస్తాం' అని చంద్రబాబు అన్నారు.

పల్లెల్లో పుష్కరిణి కార్యక్రమం

'పల్లెల్లో పుష్కరిణి కార్యక్రమానికి శ్రీకారంచుడుతూ చెరువులను శుభ్రం చేయబోతున్నాం. చెరువుల గట్లపై పచ్చదనం పెంపకంతో పాటు వాకింగ్ ట్రాక్‌లుగా ఆధునికీకరిస్తాం. 123 మున్సిపాలిటీల్లో ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేశాం. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఓడీఎఫ్ ప్లస్‌గా నిలిచాయి. 15,995 గ్రామాలను 2026 మార్చి నాటికి ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాయలసీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే పలు పరిశ్రమలు వచ్చాయి. కరువు రక్కసి నుంచి సీమ ప్రజలను కాపాడాలంటే ఉద్యాన పంటలకు పెద్దపీట వేయాలి. ప్రస్తుతం 15 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఐదేళ్లలో 36 లక్షల హెక్టార్లకు పెంచుతాం. మైక్రో ఇరిగేషన్ కోసం ప్రతి రైతుకు 10 ఎకరాల వరకు 90శాతం సబ్సిడీ ఇస్తాం' అని చంద్రబాబు వివరించారు.

గ్రీన్ ఎనర్జీ హబ్‌గా సీమ

'రాయలసీమ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారబోతోంది. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి ఈ ప్రాంతంలో చేస్తున్నాం. పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో రూ.5 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించబోతున్నాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నాం' అని అన్నారు. 'పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేస్తే రాయలసీమకు గేమ్ చేంజర్ అవుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో 76 ప్రాజెక్టులు తెచ్చాం. రూ.4.96 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 4.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.పల్లెల్లో సోలార్ వెలుగులు నింపుతాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇళ్లపై సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. డ్వాక్రా, పొదుపు మహిళను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం. చెత్త నుంచీ కంపోస్టు ఎరువు తయారు చేయాలి. తద్వారా సంపదను సృష్టించాలి' అని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్ పాల్గొన్నారు.

కీరదోస కొని.. ఫోన్‌పే

కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌లో చంద్రబాబు పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి గంటకు పైగా రైతుబజార్ మొత్తం కలియతిరిగారు. రైతులు, వ్యాపారులతో ముచ్చటించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలను పరిశీలించారు. ఓ మహిళా రైతు వద్దకు వెళ్లి కిలో కీరదోసను కొనుగోలు చేసి ఫోన్‌పే ద్వారా రూ.40 చెల్లించారు. 'ఏమ్మా.. ఫోన్ పే ద్వారా డబ్బు పంపించా. వచ్చిందో.. లేదో? చూసుకో' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ధనలక్ష్మినగర్‌లో రూ.50లక్షలతో జయరాజ్ ఇస్పాత్ సంస్థ నిర్మించనున్న స్వచ్ఛాంధ్ర పార్కుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటారు.



సి.క్యాంపు రైతు బజార్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వ్యర్థానికి అర్థం

వ్యర్థాల రీ సైక్లింగ్‌పై బుద్ధుడి కథ కనువిప్పు కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. సభలో సీఎం చెప్పిన కథను సభికులు ఆసక్తిగా విన్నారు. 'ఓ రోజు బుద్ధుడు తన శిష్యులతో సమావేశం అవుతారు. ప్రపంచంలో అందరి గురించి ఆలోచించే మీరు.. మీ శిష్యుల సంక్షేమంపై కొంచెం దృష్టి పెట్టాలని ఓ శిష్యుడు కోరుతాడు. నీకేం కావాలని బుద్ధుడు అడగానే.. తన దుస్తులు పూర్తిగా చిరిగిపోయాయని, బయటకు వెళితే అందరు హేళనగా చూస్తున్నారని, తనకు కొత్త బట్టలు కావాలని శిష్యుడు కోరుతాడు. సరే అని బుద్ధుడు కొత్త దుస్తులు ఇవ్వగా.. శిష్యుడు తీసుకొని ఇంటికి వెళ్లిపోతాడు. కొన్నాళ్లకు శిష్యుడిని పిలిపించి తాను ఇచ్చిన కొత్త దుస్తుల గురించి బుద్ధుడు అడుగుతారు' అని చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా బుద్ధుడు, శిష్యుడి మధ్య జరిగిన సంభాషణ చంద్రబాబు మాటల్లోనే...

బుద్ధుడు: కొత్త బట్టలు ఎలా ఉన్నాయి?

శిష్యుడు: చాలా బాగున్నాయి.. ఆనందంగా ఉంది.

బుద్ధుడు: పాత బట్టలు ఏం చేశావు?

శిష్యుడు: నా పడక బొంతగా చేసి వాడుతున్నాను.

బుద్ధుడు: పాత బొంత ఏమైంది?

శిష్యుడు: వంట గదిలో వేడి పాత్రలు దించేందుకు మసిగుడ్డగా వాడుతున్నాను.

బుద్ధుడు: అప్పటి వరకు ఉన్న మసిగుడ్డను ఏం చేశావు?

శిష్యుడు: గదిలో బండలు తుడిచేందుకు వాడుతున్నా.

బుద్ధుడు: ఇదివరకే ఉన్న బండలు తుడిచే గుడ్డ ఏమైంది?

శిష్యుడు: ఆ గుడ్డ పూర్తిగా చిరిగిపోవడంతో దారాలు తీసి.. ఒత్తిగా చేసి దీపం వెలిగిస్తున్నాను. గురువా..! మీ ముందు వెలుగుతున్న దీపం ఒత్తి ఆ గుడ్డ దారాలతో చేసిందే.

ప్రపంచంలో ప్రతి వస్తువు రీ సైక్లింగ్ చేయడం ద్వారా మళ్లీ ఉపయోగించుకోవచ్చు అని చెప్పేందుకు ఈ కథ చెప్పానని చంద్రబాబు వివరించారు.

చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు

- ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- చివరిరోజు 5 లక్షల మందితో బహిరంగ సభ
- పార్కింగ్ కోసం 300 ఎకరాలు సిద్ధం
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు.. నేడు పలు కమిటీల నియామకం



మహానాడు నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

కడప, మే 17(ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచిపోయేలా మహానాడును నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెప్పారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడప నగర శివార్లలోని పబ్బాపురం గ్రామం వద్ద 125 ఎకరాల్లో ప్రతిష్ఠాత్మకంగా మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో మహానాడు ఏర్పాట్లను శనివారం పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. తొలి రెండు రోజుల ప్లీనరీ సభా వేదిక, చివరి రోజు బహిరంగ సభ వేదిక, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. కడపలో నిర్వహించే ఈ మహానాడును కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని టీడీపీ భావిస్తోంది. చివరి రోజు ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి జనసమీకరణ చేయనున్నారు. ఇక ట్రాఫిక్, ఇతర అంశాలకు సంబంధించి కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్ వేదిక ప్రాంతాన్ని పరిశీలించి చర్చించారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనే రింగురోడ్డులో మహానాడు నిర్వహిస్తున్నందువల్ల కడప, పరిసరాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 300 ఎకరాలను వాహనాల పార్కింగ్ కోసం సిద్ధం చేశారు. మహానాడు వేదికను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా చైతన్య కూడా పరిశీలించారు.

నేడు మంత్రుల రాక

మహానాడు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, సవిత, మండిపల్లె రాంప్రసాదరెడ్డి, సుభాష్‌తో పాటు సీఎం ప్రోగ్రాం కన్వీనర్ వెంకటేశ్ ఆదివారం కడపకు వస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు మహానాడు వేదిక వద్ద కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తారు. మహానాడును విజయవంతం చేసేందుకు.. ప్లీనరీ వేదిక, బహిరంగసభ ఆహ్వానితులు, ట్రాన్స్‌పోర్టు, బస, రక్తదానం, ఆహారం తదితర కమిటీలను ఏర్పాటు చేస్తారు. కాగా.. కడపలో శనివారం నిర్వహించిన తిరంగ ర్యాలీలో పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

3లక్షల గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- హౌసింగ్ అధికారులతో మంత్రి పార్థసారథి సమీక్ష



అమరావతి, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. లబ్ధిదారులకు ఆ ఇళ్లను ఒకేరోజు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. శనివారం విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిమెంటు, ఇసుక, స్టీల్ తదితర మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు అందజేస్తూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. లేఅవుట్లలో రహదారులు, డ్రెయిన్లు, మంచినీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు కల్పించే పనులను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

భోలేబాబా డెయిరీ

చుట్టూనే దర్యాప్తు

- పాల సేకరణా లేదు.. పాల ఉత్పత్తుల విక్రయాలూ లేవు
- కల్తీ నెయ్యి మొత్తం తయారైంది అక్కడే
- ఇతర డెయిరీల ద్వారా టీటీడీకి సరఫరా

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరాపై నమోదైన కేసు దర్యాప్తు మొత్తం ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా డెయిరీ చుట్టూనే తిరుగుతోంది. ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీ ద్వారా భోలేబాబా డెయిరీయే టీటీడీకి నెయ్యి సరఫరా చేసినట్టు సిట్ అధికారులు గుర్తించారు. భోలేబాబా డెయిరీలో పాల సేకరణ గానీ, పాల ఉత్పత్తుల విక్రయాలూ గానీ చేయడం లేదని దర్యాప్తులో వెలుగు చూసింది. స్థానికంగా స్వల్ప పరిమాణంలో నెయ్యి కొనుగోలు చేసి దానికి అధిక పరిమాణంలో పామాయిల్, రసాయనాలు కలిపి కల్తీ నెయ్యి తయారు చేసినట్టు వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఆ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, జనరల్ మేనేజర్ హరిమోహన్ రాణా, వారికి పామాయిల్ సరఫరా చేసిన ఆశిష్ అగర్వాల్‌లదే కీలక పాత్రగా సిట్ తేల్చింది. ఇప్పటి వరకూ ఈ కేసులో 12మంది వ్యక్తులను, మూడు డెయిరీ సంస్థలను నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చిన అధికారులు కేసు విచారణను నెల్లూరు ఏసీబీ కోర్టుకు బదిలీ చేసుకున్న సంగతి తెలిసిందే. నిందితుల్లో ఇద్దరు టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. ఏ9, ఏ10 ఉన్న ఆ ఇద్దరూ టెండర్ల వ్యవహారంలో సంబంధిత డెయిరీల నుంచి లబ్ధి పొందారని సిట్ గుర్తించడంతో వీరిని అవినీతి నిరోధక చట్టం కింద విచారించాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్లే కేసును ఏసీబీ కోర్టుకు బదిలీ చేసినట్టు వెల్లడైంది.

పామాయిల్, 12 రకాల రసాయనాలతో కల్తీ..

ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో మెస్సర్స్ భోలేబాబా డెయిరీ ఆర్గానిక్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట డెయిరీ ప్లాంట్ ఉంది. దీని అనుబంధ సంస్థ హర్ష్ ఫ్రెష్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్.. మెస్సర్స్ బజ్‌బజ్ ఆయిల్ రిఫైనరీ నుంచీ పామాయిల్ సేకరించేదని, ఆ పామాయిల్‌ను భోలేబాబా డెయిరీ తెప్పించుకుని నెయ్యి కల్తీ తయారీకి వాడినట్టు సిట్ గుర్తించింది. నెయ్యిలో పామాయిల్, మరో 12 రకాల రసాయనాలు కలిపి కల్తీచేసినట్టు గుర్తించారు. నెయ్యి కల్తీలో ప్లాంట్ ఆపరేటర్ సంజయ్ చౌహాన్ పాత్ర కీలకమని తేలింది. నెయ్యి నమూనాలను ఢిల్లీలోని ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌కు పంపగా 90 శాతానికి పైగా కల్తీ ఉన్నట్టు నిర్ధారించినట్టు సమాచారం.

కల్తీ బయటపడకుండా జాగ్రత్తలు..

ల్యాబ్‌లో పరీక్షించినా కల్తీని గుర్తించకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్టు సిట్ గుర్తించింది. ల్యాబ్ టెస్టింగ్ నిబంధనలకు అనుగుణంగా వాల్యూస్ ఉండేలా, నెయ్యి వాసన వచ్చేలా అవసరమైన రసాయనాలను కలిపేవారని తేల్చింది. కల్తీ నెయ్యిని భోలేబాబా డెయిరీలోనే నిల్వ ఉంచి, అక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా తిరుపతి జిల్లాలోని వైష్ణవి డెయిరీకి పంపినట్టు గుర్తించింది.

ఖాళీ లారీలతోనే మోసం..

రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా తదితర ప్రాంతాల నుంచి భోలేబాబా డెయిరీకి ఖాళీ లారీలు వచ్చేవని కొందరు ఉద్యోగులు సిట్‌కు తెలిపారు. ఐదారు గంటలు వాటిని అక్కడే ఉంచి ఆ తర్వాత తీసుకెళ్లేవారని చెప్పారు. ఆ లారీల డ్రైవర్లు నెయ్యి తీసుకొచ్చినట్టుగా ప్లాంటులోకి వెళ్లి జీఎం హరిమోహన్ రాణాకు లేదా అకౌంటెంట్ ఆశిష్ రోహిలాకు అందజేసేవారని తెలిపారు. పొమిల్ జైన్, విపిన్ జైన్, హరిమోహన్ రాణా, ఆశిష్ రోహిలా నెయ్యి సరఫరా జరిగినట్టుగా ఇన్‌వాయిస్‌లు, ఇ-వే బిల్లులు, ట్రాన్స్‌పోర్టు రశీదులు, జీఎస్టీ రిటర్నులు సృష్టించి, వాటిని అడ్డుపెట్టుకుని బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిపినట్టు సిట్ గుర్తించింది.

నలుగురు నిందితులదే కీలకపాత్ర

ఈ కేసులో ప్రధానంగా నలుగురు నిందితులదే కీలక పాత్రని సిట్ భావిస్తోంది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ప్రధాన సూత్రధారులు కాగా వారిద్దరికీ ఆ డెయిరీ జనరల్ మేనేజర్ హరిమోహన్ రాణా కీలకంగా సహకరించారు. ఈ ముగ్గురికీ కల్తీ నెయ్యి వ్యవహారంలో సహకరించిన కీలక వ్యక్తి ఆశిష్ అగర్వాల్‌గా సిట్ తేల్చింది. రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లోని మోహన్ లాల్ ఆశిష్ కుమార్ సంస్థకు ఆయన యజమాని. బికనీర్‌లోనే అగర్వాల్ అండ్ సన్స్ సంస్థకు ఆయన తల్లి సీతా అగర్వాల్ యజమాని అయినప్పటికీ ఆ సంస్థ నిర్వహణ కూడా ఆశిష్ చూస్తున్నారు. హరియాణాలోని కురుక్షేత్ర సాహాబాద్‌లో సుప్రీం ఇన్ కార్పొరేషన్, ఢిల్లీ కమల్ రోడ్డులో సుప్రీం సంస్థలను కూడా ఈయనే నిర్వహిస్తున్నారు. పొమిల్ జైన్, విపిన్ జైన్, హరిమోహన్ రాణాకు సంపూర్ణంగా సహకరించి అక్రమాలకు పాల్పడినట్టు సిట్ గుర్తించింది. ఆశిష్ అగర్వాల్ తన సంస్థల నుంచి భోలేబాబా డెయిరీకి నెయ్యి సరఫరా చేయకుండానే చేసినట్టు బోగస్ రికార్డులు సృష్టించినట్టు గుర్తించింది. ఆ డెయిరీ నుంచి ఏకంగా రూ.146కోట్లు అందుకున్నారని తేలింది. ఆశిష్ అగర్వాల్ తన కమీషన్ మినహాయించుకుని మిగిలిన నగదును హవాలా మార్గంలో పొమిల్ జైన్, విపిన్ జైన్‌కు అందజేసేవాడని సిట్ గుర్తించింది. తాము ఎప్పుడూ భోలేబాబా డెయిరీ గురించి వినలేదని, ఏనాడూ ట్యాంకర్‌లో నెయ్యి నింపిందీ లేదని ఆశిష్ అగర్వాల్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సిట్ విచారణలో చెప్పినట్టు తెలిసింది.

ఏపీకి మీ ఆశీస్సులు అందించండి

(మొదటి పేజీ తరువాయి)



ప్రధానికి మామిడి పండ్లు అందజేస్తున్న లోకేశ్ కుటుంబం

సాధించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషికి తోడ్పాటు అందించాలని కోరారు. భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి మంత్రి లోకేశ్ ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో ఢిల్లీలోని మోదీ నివాసానికి వెళ్లిన లోకేశ్ కుటుంబం దాదాపు 2 గంటలు ప్రధానితో గడిపింది. మోదీకి లోకేశ్ శాలువా కప్పి, తిరుమల శ్రీవారి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'యువగళం' కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు. లోకేశ్ నుంచి మొదటి ప్రతిని అందుకున్నారు. మరో పుస్తకంపై మోదీ సంతకం చేసి లోకేశ్‌కు అందించారు. 2024 ఎన్నికలకు ముందు లోకేశ్ చేపట్టిన 3,132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్‌లో పొందుపరిచారు. యువగళం పాదయాత్ర జగన్ అరాచక పాలనను అంతం చేసి, ఎన్డీఏ కూటమి విజయానికి బాటలు వేసిన సంగతి తెలిసిందే. తన నివాసంలో బ్రాహ్మణి, దేవాన్ష్‌లకు ప్రధాని మోదీ ఆశీస్సులు అందించారు. దేవాన్ష్‌ను తన ఒడిలో కూర్చోబెట్టుకుని కుశల ప్రశ్నలు వేశారు. దేవాన్ష్‌కు చదరంగంలో ఉన్న ప్రావీణ్యాన్ని తెలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా మోదీ చాక్లెట్లను అందజేశారు. రాష్ట్ర పురోగతి కోసం అమరావతి, పోలవరానికి నిధులు అందించడంతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక మద్దతు అందించి రాష్ట్ర ప్రభుత్వానికి నిరంతరం అండగా ఉన్నందుకు ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ప్రధానమంత్రి బలమైన నిర్ణయాత్మక నాయకత్వాన్ని ప్రశంసించారు. ఇటీవల అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చిన మోదీ.. కుటుంబంతో కలసి ఢిల్లీకి రావాల్సిందిగా లోకేశ్‌ను ఆహ్వానించారు. మోదీ ఆహ్వానం మేరకు లోకేశ్ తన కుటుంబంతో వెళ్లారు. ప్రధాని మోదీతో భేటీపై నారా బ్రాహ్మణి 'ఎక్స్'లో సంతోషం వ్యక్తం చేశారు. భారత్‌ను గ్లోబల్ పవర్‌గా మార్చేందుకు మోదీ కృషి చేస్తున్నారని... ఆయన ఒక గొప్ప ప్రధానమంత్రి అని ప్రశంసించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.